www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 17-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 18
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: చవితి మ.3.24 తదుపరి పంచమి; నక్షత్రం: జ్యేష్ఠ పూర్తి; వర్జ్యం: మ.12.05-1.50, దుర్ముహూర్తం: ఉ.10.10-11.00, మ.3.09-3.58; అమృతఘడియలు: రా.10.39-12.25; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.28 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తదుపరి సీజేఐ జస్టిస్ గవాయ్ 2



కేంద్రానికి సుప్రీంకోర్టు సీజే సంజీవ్ ఖన్నా సిఫారసు
52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా మే14న బాధ్యతల స్వీకరణ
జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత ఆయనే రెండో దళిత సీజేఐ
మహారాష్ట్రలో జననం.. బొంబాయి హైకోర్టులో పలు హోదాల్లో విధులు
2019 నుంచి సుప్రీంకోర్టులో కీలక ధర్మాసనాల్లో ముఖ్యభూమిక
370 రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎన్నికల బాండ్ల నిలిపివేత తీర్పుల్లో భాగం

కంచగచ్చిబౌలిలో ఆ వందెకరాలను పునరుద్ధరిస్తారా.. లేక
జైలుకెళ్తారా?

సీఎస్ సహా అధికారులంతా సిద్ధంగా ఉండండి

అక్కడే కొలను వద్ద 6 నెలల్లో తాత్కాలిక జైలు నిర్మించి అందులో ఉంచుతాం
ఆ భూముల్లో బుల్‌డోజర్లు తొలగించారా?.. చెట్ల నరికివేతకు అనుమతి ఉందా?
అభివృద్ధి, పర్యావరణం మధ్య సమతౌల్యం అవసరం
చెట్ల కొట్టివేతతో జంతువులపై కుక్కల దాడి వీడియో చూసి ఆందోళన చెందాం
అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టూ కొట్టకుండా ఆదేశాలిస్తాం: సుప్రీం
పనులన్నీ ఆపేశాం.. ఆ భూములన్నీ సర్కారుకు చెందినవే.. రాష్ట్ర ప్రభుత్వ వాదన
సీఈసీ నివేదిక అధ్యయనానికి సమయం ఇవ్వాలని విజ్ఞప్తి
యథాతథ స్థితి కొనసాగింపు.. మే 15కు విచారణ వాయిదా వేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. "కంచగచ్చిబౌలిలోని వందెకరాలను పునరుద్ధరిస్తారా? లేక జైలుకెళతారా?" అని ప్రశ్నించింది. చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దని హెచ్చరించింది. కంచ గచ్చిబౌలిలో చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా? లేదా? అనే ప్రశ్నకు సూటిగా జవాబివ్వాలని నిలదీసింది. "మీరు పెద్దఎత్తున చెట్లను కొట్టివేస్తే.. ఆవాసం కోసం జంతువులు పరుగులు తీశాయి. వాటిని వీధికుక్కలు తరిమాయి. దీనికి సంబంధించిన వీడియోలు చూసి మాకెంతో ఆందోళన కలిగింది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. అభివృద్ధికి, పర్యావరణానికి మధ్య సమతౌల్యం అవసరం. ఇష్టమొచ్చినట్టు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తామంటే ఊరుకునేది లేదు. ఆ వందెకరాలనూ ఎలా పునరుద్ధరిస్తారో చెప్పండి. లేదంటే జైలుకెళ్లేందుకు సీఎస్ సహా అధికారులు సిద్ధంగా ఉండాలి. అక్కడే కొలను దగ్గర ఆరు నెలల్లో తాత్కాలికంగా జైలు నిర్మించి అందరినీ అందులో ఉంచుతాం." అంటూ తీవ్రస్థాయిలో మండిపడింది. హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసే అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీంతో ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని

మిగతా 12వ పేజీలో...

అది ప్రభుత్వ పోరంబోకు భూమి

1955 నుంచి అనేక సంస్థలకు కేటాయించారు
ఏనాడూ అటవీ భూమిగా నమోదు కాలేదు
165 చిన్న, మధ్యస్థాయి చెట్లనే తొలగించాం
భారీ యంత్రాలను వాడలేదు
అక్కడ 400 ఎకరాల్లో పర్యావరణ ఐటీ పార్కు
జంతువులు, జలాశయాలను పరిరక్షిస్తూనే ఏర్పాటు చేస్తాం
నకిలీ వీడియోలతో దుష్ప్రచారం
వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోండి
సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు

12

కంచగచ్చిబౌలి భూములకు అటవీ లక్షణాలు!

నిబంధనలు తుంగలో తొక్కి చెట్లు, రాతి నిర్మాణాలను కూల్చేశారు
పత్రాలు, ఒప్పందాల ఆధారంగా ఈ భూమి వర్గీకరించలేదే!: సీఈసీ 14

కంచ గచ్చిబౌలి భూముల ఫొటో రీపోస్ట్ వ్యవహారంలో.. స్మిత సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు 12

నేనూ ఫొటోలు పోస్టు చేశా.. కేసులు పెట్టుకోవచ్చు: కిషన్‌రెడ్డి 14

ఆ భూములపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ విష ప్రచారం
బీజేపీ నేతల తప్పుడు సమాచారంతో మోదీ కూడా మాట్లాడారు
నకిలీ ఫొటోలు అన్ని వ్యవస్థల్నీ ప్రభావితం చేశాయి: శ్రీధర్‌బాబు 12



టోక్యోలో భారత రాయబార కార్యాలయంలో షిబు జార్జ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

జపాన్ చేరుకున్న సీఎం

ఘనస్వాగతం పలికిన ప్రవాస తెలంగాణ వాసులు
భారత ఎంబసీలో రేవంత్ బృందానికి విందు
రాయబారి షిబు జార్జ్‌తో ముఖ్యమంత్రి భేటీ
నేడు హిరోషిమా(?) మెట్రోపై జైకాతో సమావేశం 13

మొదలుకానున్న
కొలువుల జాతర!

వివిధ శాఖల్లో ఖాళీలు ఇలా ఉండొచ్చని అంచనా..

పోలీసు శాఖ	12,150
వైద్యశాఖ	2,762
ఆర్టీసీ	3,038
గురుకులాలు	2,850
ఇంజనీరింగ్	2,510
వ్యవసాయ శాఖ	148
ఆర్అండ్‌బీ	185
రెవెన్యూ	10,954
మహిళా శిశుసంక్షేమం	14,236

పలు ఇతర శాఖల్లో ఖాళీలు, గ్రూప్ 1 పోస్టులు ఉండే చాన్స్

భర్తీకి సిద్ధంగా 56 వేలకు పైగా ఉద్యోగాలు
ఆయా శాఖల నుంచి ప్రభుత్వానికి నివేదికలు
త్వరలో 18,236 పోస్టులకు నోటిఫికేషన్లు!

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ సర్కారు కొలువుల జాతర మొదలు కానుంది. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో వివిధ శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల లెక్కలను తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అధికారిక వర్గాల ద్వారా అందిన ప్రాథమిక సమాచారం మేరకు 56,740కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఇప్పటికే గుర్తించి.. ఖరారు చేసిన 14,236 అంగన్‌వాడీ పోస్టులు, 10,954 రెవెన్యూ పోస్టులు పోగా మిగిలినవి వివిధ శాఖల వారీగా ఉన్నాయి. అంతేకాకుండా గ్రూప్-1కు సంబంధించి కూడా కొన్ని పోస్టులు తేలే అవకాశం ఉందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. వీటితోపాటు గ్రూప్-2, 3, 4 పోస్టులను

మిగతా 13వ పేజీలో...



చైనాను ఒంటరిని చేద్దాం

డ్రాగన్ కట్టడికి సుంకాల చర్చలను ఆయుధంగా వాడే యోచనలో ట్రంప్
చైనా ఉత్పత్తుల రవాణాకు అనుమతి ఇవ్వొద్దని పలు దేశాలకు సూచన!
చైనాతో వాణిజ్యం తగ్గించాలని ఒత్తిడి
వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం
చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాల భారం 245 శాతానికి?

వాషింగ్టన్, ఏప్రిల్ 16: వాణిజ్య, సుంకాల యుద్ధంలో తమతో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరిస్తూ తలనొప్పిగా మారిన చైనాను కట్టడి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారు! సుంకాలకు సంబంధించి ఇతర దేశాలు తమతో చర్చలకు వచ్చినప్పుడు.. చైనాతో వాణిజ్య కార్యకలాపాలను తగ్గించుకోవాలని వాటిపై ఒత్తిడి తేవడం ద్వారా డ్రాగన్ దేశాన్ని ఒంటరిని చేసేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నట్టు పేర్కొంటూ అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రతీకార సుంకాల బారి నుంచి తప్పించుకోవాలంటే.. తమ తమ

మిగతా 2వ పేజీలో...

భారతీయులపై చైనా వీసాల వర్షం!

ఈ ఏడాది జనవరి 1-ఏప్రిల్ 9 మధ్య 85 వేలకుపైగా వీసాలు మంజూరు
2023 ఏడాది మొత్తంలో ఇచ్చిన వీసాలు 1.8 లక్షలు మాత్రమే 2
అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో భారత్ పట్ల మారిన చైనా వైఖరి!

ఐపీఎల్‌కు ఫిక్సింగ్ ముప్పు?

హైదరాబాద్ వ్యాపారిపై బీసీసీఐ అనుమానం
జాగ్రత్తగా ఉండాలని ఫ్రాంచైజీలకు హెచ్చరిక 11
బుకీలకు దూరం.. ఆటగాళ్లు, కోచ్‌లకు సూచన



సచివాలయం, ఐకానిక్ టవర్ల నమూనా

ఏపీ సచివాలయం నిర్మాణానికి టెండర్లు

4 ఐకానిక్ టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా జారీ
రూ.4,668 కోట్లతో డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మాణం
మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనునన్న సీఆర్డీఏ

విజయవాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో కూటమి ప్రభుత్వం నిర్మించతలపెట్టిన సచివాలయం, జీఏడీ ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం కోసం నాలుగు టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. రూ.4,668 కోట్లతో ఐదు టవర్లను డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మించనున్నారు. సచివాలయ 4 టవర్లను బేస్‌మెంట్+39 ఫ్లోర్లు+టెర్రస్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో 1, 2 టవర్లను 28,41,675 చదరపు

మిగతా 13వ పేజీలో...

నేటి నుంచే రెవెన్యూ సదస్సులు

భూ భారతి అమల్లో భాగంగా 4 మండలాల్లో ప్రారంభం
భూ సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేక దరఖాస్తు
మే 1 నుంచి పరిష్కారం.. కలెక్టర్ల నేతృత్వంలో సదస్సులు
భూ సమస్యల్లేని తెలంగాణే లక్ష్యం: మంత్రి పొంగులేటి
పోర్టల్‌కు 36 గంటల్లో 5 లక్షల మందికిపైగా సందర్శకులు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతోనే భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈ చట్టాన్ని ప్రయోగాత్మకంగా నాలుగు మండలాల్లో అమలు చేస్తున్నామన్నారు. ఆ మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను గుర్తించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం కాజీపూర్‌లో గురువారం రెవెన్యూ సదస్సులను ప్రారంభించనున్నామన్నారు. చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల నేతృత్వంలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4 మండలాల్లో మాత్రం రెవెన్యూ సదస్సులు

మిగతా 3వ పేజీలో...



వక్ఫ్ ఆస్తులేవీ డీనోటిఫై చేయొద్దు!

'వక్ఫ్ బై యూజర్' అయినా, వక్ఫ్ బోర్డుల ఆస్తులైనా ప్రస్తుతానికి చర్యలొద్దు
కేంద్రానికి సుప్రీం సూచన.. చట్టంలోని పలు అంశాలపై స్టే ఇచ్చేందుకు సిద్ధం?
'వక్ఫ్ బై యూజర్'లను అనుమతించకుంటే ఎలా?
వందల ఏళ్ల కిందటి ఆస్తులకు పత్రాలు ఎలా వస్తాయి?
హిందూ మత ట్రస్టుబోర్డుల్లో ముస్లింలకు చోటిస్తారా అని సుప్రీంకోర్టు నిలదీత
విచారణ జరపకుండా ఉత్తర్వులు ఇవ్వవద్దంటూ కేంద్రం కేవియట్ దాఖలు

గంగా జమునీ తెహ్‌జీబ్‌కు అత్యున్నత ప్రతీక ఉర్దూ

అది విదేశీ భాష కాదు.. మన దేశంలో పుట్టిన భాష
హిందీ మూలం హిందవీ.. 2
అది పార్సీ పదం: సుప్రీంకోర్టు
బోర్డుల మీద ఉర్దూ ఉండొద్దన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశవ్యాప్తంగా 'వక్ఫ్ బై యూజర్'గా నమోదై ఉన్నవి సహా వక్ఫ్ ఆస్తులను వేటినీ డీనోటిఫై చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని సెక్షన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ సందర్భంగా ఈ ప్రతిపాదన చేసింది. ఈ మేరకు చట్టంలోని పలు అంశాలపై స్టే ఇచ్చేందుకూ సిద్ధమైంది. కానీ విచారణ చేపట్టకుండా ఉత్తర్వులేవీ జారీ చేయవద్దంటూ కేంద్రం కేవియట్

మిగతా 2వ పేజీలో...

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల
జారీ ఎలా?!



వర్గీకరణ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మార్గదర్శకాల విడుదలపై సర్కారు కసరత్తు
'కులగణన'ను ప్రామాణికంగా తీసుకునే యోచన
ఆ వివరాలు అధికారులకు అందుబాటులో ఉంటే తప్పులు జరిగే అవకాశం ఉండదని అంచనా
రిజర్వేషన్ ఫలాలు అర్హులకే అందేలా ప్రణాళికలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాల జారీపై మార్గదర్శకాలు జారీ చేసేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. త్వరలోనే పెద్దఎత్తున రానున్న ఉద్యోగ నోటిఫికేషన్లతోపాటు విద్యా సంస్థల ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఆయా కులాల వారికి అవకాశాలు కల్పించాల్సిన నేపథ్యంలో ఎక్కడా పొరపాట్లు జరగొద్దన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. అయితే, ఎస్సీ సామాజిక వర్గంలోని అభివృద్ధి చెందిన వర్గాలు అత్యంత వెనకబడిన వర్గాల కేటగిరీ కింద కుల ధ్రువీకరణ పత్రాలు పొందితే.. వర్గీకరణకు అర్థం ఉండదని సర్కారు భావిస్తోంది. ఈ విషయమై ఆయా సామాజిక వర్గాల నాయకులు ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా.. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎడాపెడా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్కారు

మిగతా 13వ పేజీలో...

పాఠశాల నీళ్ల ట్యాంకులో
పురుగుల మందు

మధ్యాహ్నం భోజనం వండే పాత్రల్లోనూ..
అనుమానం వచ్చి అప్రమత్తమైన సిబ్బంది
సకాలంలో గుర్తించడంతో తప్పిన ముప్పు
నిందితుడి అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడు సోయం కిష్టు; పురుగుల మందు డబ్బా

ఇచ్చోడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అదొక పాఠశాల! సుమారు 30 మంది విద్యార్థులు ఆ బడిలో చదువుకుంటున్నారు! ఆ బడిలో మధ్యాహ్న భోజనం వండడం కోసం ఉపయోగించే పాత్రల్లోనూ, స్కూలు వాటర్ టాంక్‌లోనూ పురుగులమందు కలిపాడొక దుండగుడు. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది సకాలంలో గుర్తించడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం

మిగతా 3వ పేజీలో...



భట్టి సమక్షంలో గ్రీన్‌ఎనర్జీ ప్రాజెక్టుల కంపెనీ ప్రతినిధుల ఒప్పందాలు

హరిత ఇంధనంలో రూ. 29 వేల కోట్లు

పెట్టుబడులకు ముందుకొచ్చిన ఎకోరెన్, జీపీఎస్ ఆర్య
రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు ఖరారు
2035 కల్లా 40 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం
డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2035 కల్లా 40 వేల మెగావాట్ల హరిత ఇంధనాన్ని (గ్రీన్ పవర్) ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17,162 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఉందని, పకడ్బందీ వ్యూహంతో అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ

మిగతా 13వ పేజీలో...

తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్

» కేంద్రానికి సుప్రీంకోర్టు సీజే సిఫారసు

» 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా మే14న చీఫ్ జస్టిస్ ఖన్నా నుంచి బాధ్యతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ ఎంపికయ్యారు. ఆయన పేరును కేంద్ర ప్రభుత్వానికి చీఫ్‌జస్టిస్ సంజీవ్ ఖన్నా బుధవారం సిఫారసు చేశారు. వచ్చే నెల 13వ తేదీన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి పదవీవిరమణ చేయనున్నారు. ఆ మరునాడు, 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. అనంతరం ప్రస్తుత సీజే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా నియమితులు కానున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్. చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా అప్పటి సీజే చంద్రచూడ్ నుంచి గత నవంబరులో బాధ్యతలు తీసుకున్నారు. జస్టిస్ చంద్రచూడ్ బాటలోనే ఆయనా 65 ఏళ్ల వయసులో పదవీవిరమణ చేయనున్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న ఆర్ఎస్ గవాయ్, కమల దంపతులకు ఆయన జన్మించారు. ఆర్ఎస్ గవాయ్ దళిత నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్ వర్గం) అధ్యక్షుడు. పార్లమెంటు




సభ్యునిగాను, గవర్నర్‌గాను ఆయన సేవలు అందించారు. ఆయన సోదరుడు రాజేంద్ర గవాయ్ కూడా రాజకీయాల్లోనే కొనసాగుతున్నారు. జస్టిస్ గవాయ్ అమరావతి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణులయ్యారు. 1985లో బార్‌కౌన్సిల్‌లో సభ్యులయ్యారు. బొంబాయి హైకోర్టులో 1992 నుంచి 1993 వరకు ఏజీపీగాను, ఏపీపీగాను పనిచేశారు. నాగ్‌పూర్ బెంచ్‌లో పీపీగా 2000 జనవరి 17న నియమితులయ్యారు. హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా 2005 నవంబరు 12న నియమితులయ్యారు. ఆయన 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

'ఎస్సీ వర్గీకరణ' బెంచ్‌లో సభ్యులు

పలు చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాల్లో జస్టిస్ గవాయ్ సభ్యునిగా ఉన్నారు. ముఖ్యంగా, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దుచేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించిన ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో ఆయన ఒకరు. ఎన్నికల బాండ్లను నిలిపివేస్తూ కీలక తీర్పును వెలువరించడంలో ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో జస్టిస్ గవాయ్ క్రియాశీలక భూమిక పోషించారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన ఐదుగురు సభ్యుల బెంచ్‌లో ఆయన ఒకరు. ఎస్సీ వర్గీకరణ జరిపే రాజ్యాంగ అధికారం రాష్ట్రాలకు ఉన్నదంటూ 6:1 మెజారిటీలో ఆమోదించిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన సభ్యుడు.

లోకం తీరు



గంగా జెమునీ తెహ్‌జీబ్‌కు
అత్యున్నత ప్రతీక ఉర్దూ

అది విదేశీ భాష కాదు.. మన దేశంలో పుట్టిన భాష: సుప్రీం

బోర్డుల మీద ఉర్దూ ఉండొద్దన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: మన దేశంలోని 'గంగా జెమునీ తెహ్‌జీబ్'కు (హిందూ, ఇస్లామిక్ సాంస్కృతిక సమ్మేళనానికి) ఉర్దూ భాష ఒక అత్యున్నత ప్రతీక అని, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం చూసి మనం గర్వపడాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. ఉర్దూ పుట్టిందే భారతదేశంలోనని గుర్తు చేసింది. ఉర్దూను ముస్లింల భాషగా భావించటం అంటే మన దేశ వైవిధ్య వాస్తవికతను పూర్తిగా పక్కనపెట్టి చూసే ధోరణి అని, ఇది చింతించాల్సిన విషయమని పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలా జిల్లా పాతూర్‌లో మునిసిపల్ కౌన్సిల్ కొత్త భవనం బోర్డు మీద అక్షరాలను మరాఠీతోపాటు ఉర్దూలో రాయటాన్ని వర్షాతాయి అనే మాజీ కౌన్సిలర్ వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ వినోద్ చంద్రన్ బుధవారం విచారణ జరిపారు. ఈ పిటిషన్‌ను కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉర్దూ మన దేశానికి సంబంధించినది కాదనే దురభిప్రాయం కారణంగానే ఆ భాషపై రకరకాల అపోహలు నెలకొన్నాయని ధర్మాసనం తెలిపింది. 'హిందీ, మరాఠీల్లాగే ఉర్దూ కూడా ఇండో-ఆర్యన్ భాష. అనేకమంది మహాకవులకు ఇష్టమైన భాషగా నిలిచింది. ఈ రోజుల్లో అనేక ఉర్దూ పదాలు హిందీలో కలిసిపోయాయి. అసలు, హిందీ అనే పదమే హిందవీ అనే పార్శీ పదం నుంచి పుట్టింది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ వద్దు

» విద్యాలయాల నేమ్ బోర్డుల్లోనూ కులాల పేర్లు తొలగించాల్సిందే: మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ చేయరాదంటూ తమిళనాడులోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. దక్షిణభారత సెంగుంద మహాజన సంఘం నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరతచక్రవర్తి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. కులాలను ప్రోత్సహించే సంఘాలను రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదు చేయవచ్చా, అదేవిధంగా విద్యాసంస్థల పేర్లలో ఉన్న కులాల పేర్లను తొలగించడం సాధ్యమా? అనే అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్లు చేయరాదంటూ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్లు జారీచేయాల్సిందిగా ఆ శాఖ ఐజీని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా కులసంఘాలు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల నేమ్‌బోర్డుల్లో ఉన్న కులాలను నాలుగు వారాల్లోపు తొలగించాలని స్పష్టం చేసింది. లేని పక్షంలో సంబంధిత విద్యాసంస్థల లైసెన్సును రద్దు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. అంతేకాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న కల్లర్, ఆదిద్రావిడుల సంక్షేమ పాఠశాలల పేర్లను కూడా తొలగించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

అల్లర్ల వెనుక అమిత్ షా కుట్ర: మమత

కోల్‌కతా, ఏప్రిల్ 16: వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో జరిగిన అల్లర్ల వెనుక కుట్ర ఉందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీని వెనుక ఉన్నారని ఆరోపించారు. అందువల్లే సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) బంగ్లాదేశ్ నుంచి అల్లరి మూకలు పశ్చిమ బెంగాల్‌లో చొరబడేందుకు అనుమతించిందన్నారు. ముస్లిం మత పెద్దలతో కోల్‌కతాలో బుధవారం నిర్వహించిన ఒక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో తమ పార్టీ ముందుంటుందని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసనలు తెలపాలని కోరారు. హోంమంత్రి అమిత్ షా తమకు వ్యతిరేకంగా అన్ని కేంద్ర ఏజెన్సీలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఆయన్ను అదుపు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇకపై రైళ్లలోనూ ఏటీఎం సేవలు

» ప్రయోగాత్మకంగా పంచవటీ ఎక్స్‌ప్రెస్‌లో అమలు

ముంబై, ఏప్రిల్ 16: ఏటీఎం సేవలు ఇకపై రైళ్లలోనూ అందుబాటులోకి రానున్నాయి. ప్రయోగాత్మకంగా ముంబై-మన్మాడ్ మధ్య ప్రయాణించే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో అమలు చేశారు. ఈ రైల్లోని ఓ ఏసీ కోచ్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎం ట్రయల్ రన్ విజయవంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. దారి మధ్యలో టన్నెళ్లు, పరిమిత మొబైల్ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఎదురైనప్పటికీ, ఏటీఎం సేవల విషయంలో ప్రయాణికులు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఇండియన్ రైల్వేస్ ఇన్నోవేటివ్ నాన్ ఫేర్ రెవెన్యూ ఐడియాస్ స్కీంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సహకారంతో ఏటీఎం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైలు కదులుతున్నప్పుడు కూడా ప్రయాణికులు ఈ ఏటీఎం సేవలను వినియోగించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

చైనాను ఒంటరిని చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

దేశాల గుండా చైనా ఉత్పత్తుల రవాణాకు అనుమతులు నిరాకరించాలని, చైనా కంపెనీలు తమ భూభాగంలో లేకుండా చూడాలని అడిగేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైనట్టు అందులో పేర్కొంది. అందుకు ఆయా దేశాలు అంగీకరిస్తే చైనా ఆర్థికంగా దెబ్బతింటుంది. పైగా.. తమతో చర్చలకు సిద్ధమైనప్పుడు డ్రాగన్ దేశానికి పెద్దగా డిమాండ్లు చేసే అవకాశం ఉండదని అమెరికా భావిస్తోంది. ఈమేరకు ఇప్పటికే అమెరికా దీనిపై కొన్ని దేశాలతో చర్చించినట్టు కూడా వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.



గంపగుత్తగా కాదు..

సుంకాల విషయంలో తనతో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరిస్తున్న చైనాపై ప్రతీకార సుంకాన్ని అమెరికా నిశ్శబ్దంగా 245 శాతానికి పెంచేసిందా? శ్వేతసౌధం విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ ప్రకారం చైనా ఉత్పత్తులపై సుంకాల భారాన్ని అమెరికా ఏకంగా 145% నుంచి 245 శాతానికి.. అంటే ఏకంగా మరో 100 శాతం మేర పెంచేసినట్టు. అయితే, వైట్‌హౌస్ ఫ్యాక్ట్‌షీట్‌లో పేర్కొన్న 245 శాతం మాట నిజమేగానీ.. అది చైనా నుంచి అమెరికా చేసుకునే అన్ని ఉత్పత్తుల పైనా గంపగుత్తగా వేసే భారం కాదు. ఆ విషయం ఫ్యాక్ట్ షీట్‌లోనే స్పష్టంగా ఉంది. 125 శాతం ప్రతీకార సుంకం, 20% ఫెంటైనిల్ సుంకంతోపాటు.. కొన్ని వస్తువులపై 7.5 శాతం నుంచి 100 శాతం దాకా అదనంగా సుంకాలు ఉన్నట్టు అందులో పేర్కొంది. ఉదాహరణకు.. చైనా నుంచి దిగుమతి చేసుకునే సిరంజిలు, సూదులపై అత్యధికంగా 245 శాతం సుంకాలున్నాయి. 2024లో జో బైడెన్ హయాంలో వాటిపై 100 శాతం సుంకాలు విధించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక 20% ఫెంటైనిల్ సుంకాలు వేశారు. తర్వాత.. ఏప్రిల్ 2న ప్రపంచ దేశాలన్నింటిపైనా విధించిన ప్రతీకార సుంకాల్లో భాగంగా చైనాపై 34 శాతం విధించారు. దానికి చైనా దీటుగా స్పందించి తానూ ప్రతీకార సుంకాన్ని విధించడంతో.. ఆ సుంకాన్ని క్రమక్రమంగా పెంచుకుంటూ 125 శాతానికి తీసుకెళ్లారు. అది 125 శాతం, ఫెంటైనిల్ సుంకం 20 శాతం కలిపితే.. 145 శాతం అయ్యింది. సిరంజిలు, సూదులపై బైడెన్ హయాంలో విధించిన 100 శాతాన్ని కూడా కలుపుకొంటే వాటిపై భారం 245 శాతానికి చేరింది. అలాగే.. చైనా నుంచి దిగుమతి చేసుకునే ఊలు స్వెటర్లపై అమెరికా సుంకాల భారం ప్రస్తుతం 168.5 శాతంగా ఉంది. ఇలా ఉత్పత్తిని బట్టి సుంకాల్లో తేడా ఉంటుంది. కాగా.. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో పేర్కొన్న 245 శాతం సుంకాల గురించి చైనా విదేశాంగ మంత్రిని మీడియా ప్రశ్నించగా.. పన్ను రేట్ల గురించి అమెరికానే అడగాలని ఆయన సూచించారు. సుంకాలు, వాణిజ్య యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని మరోసారి తేల్చిచెప్పారు. చైనా ఇలాంటి వాటికి భయపడదని తేల్చిచెప్పారు.

మేం సిద్ధమే కానీ..

తాను విధించిన ప్రతీకార సుంకాల దెబ్బకు ప్రపంచ దేశాలన్నీ తమతో చర్చలు జరిపి, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి తహతహలాడుతున్నాయని పదేపదే చెబుతున్న ట్రంప్‌కు.. చైనా ప్రతీకార చర్యల సెగ బాగానే తగులుతున్నట్టు కనిపిస్తోంది. అలాగని చైనాతో చర్చల కోసం తామే ముందడుగు వేయాలంటే అహం అడ్డొస్తోంది. దీంతో.. 'కిందపడ్డా నాదే పైచేయి' అనే సామెత చందంగా అగ్రరాజ్యం వ్యవహరిస్తోంది. "చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ట్రంప్ సిద్ధంగానే ఉన్నారు. కానీ.. చర్చల దిశగా మొదటి అడుగు బీజింగే వెయ్యాలి" అంటూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. "ఇప్పుడు బంతి చైనా కోర్టులో ఉంది. ఆ దేశమే మాతో ఒప్పందం కుదుర్చుకోవాలి. ఆ దేశంతో మేము ఏ ఒప్పందాలూ చేసుకోనవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. చైనాతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్టు ట్రంప్ తనతో స్వయంగా తెలిపినట్టు ఆమె వెల్లడించారు.

చైనా నిర్ణయంతో
భారత్‌కు మేలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి బోయింగ్ విమానాల దిగుమతిని నిలిపివేయాలని చైనా భావించింది. అయితే.. ఈ నిర్ణయం భారత్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది..! వాస్తవానికి చైనా విమానయాన సంస్థలు ప్రస్తుతం బోయింగ్ నుంచి సుమారు వంద బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీ కోసం ఎదురుచూస్తున్నాయి. భారత్‌కు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఆకాశ ఎయిర్ కూడా కొన్ని బీ787 డ్రీమ్‌లైనర్ విమానాల కోసం ఆర్డర్ పెట్టాయి. అయితే.. అమెరికా నుంచి బోయింగ్‌లు కొనుగోలు చేయకూడదని చైనా తీసుకున్న నిర్ణయంతో.. ఆ దేశం కోసం రూపొందించిన బోయింగ్ విమానాలను భారతీయ విమానయాన సంస్థలకు మళ్లించే అవకాశం ఉంది. ఈ క్రమంలో భారతీయ విమానయాన సంస్థలు బోయింగ్ నుంచి ఊహించని ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్‌లైన్స్ సహా పలు భారత విమానయాన సంస్థలకు అవి అడిగిన వాటికంటే అదనపు విమానాలు లభించే అవకాశం ఉందని చెబుతున్నాయి. ఎయిరిండియా గతేడాది 25 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరికొన్ని విమానాలు రావాల్సి ఉంది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఇవి ఊహించినదానికంటే ముందే అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు బోయింగ్‌కు గుడ్‌బై చెప్పిన చైనా.. ఐరోపాకు చెందిన ఎయిర్‌బస్ వైపు మళ్లనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌బస్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఏ320 విమానాలకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

ట్రంప్ సర్కారుకు
కోర్టు ఝలక్!

» భారత విద్యార్థి వీసా రద్దుపై స్టే

న్యూయార్క్, ఏప్రిల్ 16: విద్యార్థి వీసా రద్దు విషయంలో ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. భారతీయ విద్యార్థి వీసా రద్దును ఫెడరల్ న్యాయమూర్తి అడ్డుకున్నారు. భారత్‌కు చెందిన క్రిష్‌లాల్ ఇస్సార్దాసాని(21) విస్కాన్సిన్-మాడిసన్ వర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చివరి సెమిస్టర్ చదువుతున్నారు. ఈ ఏడాది మే నెలలో అతని గ్రాడ్యుయేషన్ పూర్తికానుంది. బార్ వెలుపల గొడవ పడ్డారనే కారణంతో 2024 నవంబరు 22న క్రిష్‌ను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో అతనిపై అభియోగాలు మోపడానికి డేన్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ నిరాకరించారు. ఈ వ్యవహారంలో అతను కోర్టుకు కూడా హాజరుకాలేదు. ఈ క్రమంలో ఏప్రిల్ 4న క్రిష్‌లాల్ విద్యార్థి వీసాను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (సెవిస్) డేటాబేస్ నుంచి అతని రికార్డును తొలగించింది. దీనిపై అతను ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. రికార్డు తొలగింపుపై తాత్కాలిక స్టే ఇవ్వాలని మాడిసన్ న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. 'సెవిస్ రికార్డు రద్దు చేయడానికి సంబంధించి ఎలాంటి హెచ్చరికలు, ముందస్తు సమాచారం ఇవ్వలేదు. తప్పు చేసి ఉంటే దానిపై వివరణ ఇవ్వడానికి గానీ, సమర్థించుకోవడానికి గానీ అవకాశం కూడా ఇవ్వలేదు' అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనల అనంతరం క్రిష్‌లాల్ బహిష్కరణపై స్టే విధిస్తూ న్యాయమూర్తి విలియం కోన్లీ మంగళవారం తీర్పు వెలువరించారు. క్రిష్ ఎలాంటి నేరాన్ని పాల్పడలేదని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

భారతీయులపై చైనా వీసాల వర్షం!

» ఈ ఏడాది జనవరి 1, ఏప్రిల్ 9 మధ్య 85 వేలకు పైగా వీసాల మంజూరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సుంకాల సమరం చేస్తున్న చైనా.. భారత్ విషయంలో తన పంథా మార్చుకున్నట్టు తెలుస్తోంది. భారతీయులపై డ్రాగన్ కంట్రీ వీసాల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 9వ తేదీ మధ్య దాదాపు 85 వేలకు పైగా వీసాలను మంజూరు చేసింది. ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించే క్రమంలోనే ఇంత భారీ సంఖ్యలో వీసాలు మంజూరు చేసినట్టు భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఇండియన్ ఫ్రెండ్స్ మరింత మంది మా దేశాన్ని సందర్శించాలి. చైనా ద్వారాలు తీసే ఉంటాయి. సురక్షితం. స్నేహపూరిత వాతావరణాన్ని అనుభవించండి" అని ఫీహాంగ్ ఆహ్వానించారు. కాగా, గత 2023 ఏడాది మొత్తంలో భారతీయులకు 1.8 లక్షల వీసాలను మాత్రమే మంజూరు చేసిన చైనా ఈ ఏడాది తొలి నాలుగు(జనవరి 1-ఏప్రిల్ 9) మాసాల్లోనే 85 వేలకుపైగా వీసాలు ఇవ్వడం గమనార్హం. అంతేకాదు, వీసా దరఖాస్తుల్లో పలు ముఖ్యమైన సడలింపులు కూడా ఇచ్చింది. కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే కోరుతోంది. వీసా దరఖాస్తు దారులు వాటిని సమర్పించడానికి ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ బుక్ చేసుకునే విధానాన్ని తొలగించి, నేరుగా వీసా కేంద్రాల వద్ద దరఖాస్తులు సమర్పించే సౌలభ్యం కల్పించారు. అదేవిధంగా 180 రోజులకంటే తక్కువగా చైనాలో ఉండాలని భావించే వారికి బయోమెట్రిక్ డేటా, వేలి ముద్రలు వంటివాటిని మినహాయించారు. వీటితోపాటు.. వీసా ఫీజును కూడా తగ్గించారు.

రండి కలిసి పోరాడదాం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ఎడతెగని సుంకాలపై పోరాడేందుకు తమతో కలిసి రావాలని భారత్ సహా పలు దేశాలకు చైనా పిలుపునిచ్చింది. సుంకాల పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ట్రంప్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయ అధికార ప్రతినిధి యు జింగ్ వ్యాఖ్యానించారు. భారత్, చైనాలు రెండూ అభివృద్ధి చెందుతున్న అతి పెద్ద దేశాలని, ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా సంయుక్త పోరాటం చేయాల్సి ఉందన్నారు. ఇదిలావుంటే, ట్రంప్ విధించిన సుంకాలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు రావడంతో ఆయన ఇతర దేశాల విషయంలో కొంత వెనక్కి తగ్గారు. కానీ, చైనా విషయంలో తన పంతాన్ని కొనసాగిస్తున్నారు.

డబ్బులిస్తాం.. విమానం టికెట్ ఇస్తాం.. వెళ్లిపోండి!

అక్రమ వలసదారులకు అధ్యక్షుడు ట్రంప్ ఆఫర్

వాషింగ్టన్, ఏప్రిల్ 16: అమెరికాలో నివసిస్తున్న అక్రమ వలసదారులకు దేశాధ్యక్షుడు ట్రంప్ సరికొత్త ఆఫర్ ప్రకటించారు. స్వీయ బహిష్కరణను ఎంచుకొనే వారు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి కొంత మొత్తం డబ్బులతో పాటు విమానం టికెట్ కూడా ఇస్తామని తెలిపారు. భవిష్యత్తులో వారిలో కొందరిని అమెరికాలోకి చట్టబద్ధంగా అనుమతించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. "మేం వారికి కొంత డబ్బు, విమానం టికెట్ ఇవ్వబోతున్నాం. వారికి తగిన నైపుణ్యం ఉంటే.. ఆ తర్వాత వారితో కలిసి పనిచేయబోతున్నాం. వారిని వీలైనంత త్వరగా వెనక్కి రప్పించుకుంటాం' అని మంగళవారం ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఉంటూ నేరాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు దృష్టిసారించారని, అయితే ఇతరులు మాత్రం సౌకర్యవంతంగా వెళ్లిపోయేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. కాగా, ప్యూ రిసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం 2022లో సరైన పత్రాలు లేకుండా అమెరికాలో 7,25,000 మంది భారతీయులు నివసిస్తున్నారు. అక్రమ వలసదారుల జాబితాలో మెక్సికన్లు, సాల్వడోరియన్ల తర్వాత మనోళ్లే అత్యధికం. మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ అంచనాల ప్రకారం 3,75,00 మందితో భారత్ ఐదో స్థానంలో నిలిచింది.

వక్ఫ్ ఆస్తులేవీ డీనోటిపై చేయొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేయడంతో విచారణను గురువారం (ఏప్రిల్ 17) మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. ఇదే సమయంలో వక్ఫ్ సవరణ చట్టంలోని పలు అంశాలపై కేంద్రానికి కొన్ని ప్రశ్నలను సంధించింది. కేంద్రం చేసిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, రాజీవ్ ధవన్, ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. వక్ఫ్ ఆస్తులన్నీ రిజిస్టర్ చేసుకోవాలన్న నిబంధన సరికాదని, వందల ఏళ్లుగా చాలా ఆస్తులు 'వక్ఫ్ బై యూజర్ (ఎలాంటి పత్రాలు లేకుండా చాలా కాలం నుంచి వక్ఫ్ ఆస్తులుగా కొనసాగుతున్నవి)'గా కొనసాగుతున్నాయని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు. అయితే వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని ఉద్దేశమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "వందల ఏళ్లుగా వ్యక్తిగత ట్రస్టులుగా కొనసాగుతున్న 'వక్ఫ్ బై యూజర్'లను ఇప్పుడు ఎలా రిజిస్టర్ చేస్తారు? వాటికి పత్రాలు ఎక్కడి నుంచి వస్తాయి? రిజిస్టర్ చేసుకోకుంటే వక్ఫ్ గుర్తింపు (డీనోటిఫై) తొలగిస్తే ఎలా? ఇంతకుముందు చాలా సందర్భాల్లో కోర్టులు 'వక్ఫ్ బై యూజర్'ను గుర్తించాయి. ఇప్పుడు మీరు గుర్తింపును వెనక్కి తీసుకుంటే చాలా సమస్యలు చెలరేగుతాయి.." అని స్పష్టం చేసింది. వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బోర్డులు సహా వక్ఫ్‌గా కోర్టులు ప్రకటించిన ఆస్తులు వేటినీ డీనోటిఫై చేయవద్దని సూచించింది.

అటు వ్యతిరేకం... ఇటు మద్దతుగా..

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఎంఐఎం పార్టీ, జమియత్ ఉలేమా ఈ హింద్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి సంస్థలతోపాటు ఆప్, డీఎంకే, సీపీఐ, జేడీయూ తదితర పార్టీలు వేసినవి కలిపి మొత్తం 72 పిటిషన్లు దాఖలయ్యాయి. మరోవైపు కేంద్రానికి మద్దతుగా బీజేపీ పాలిత రాష్ట్రాలు హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం రాష్ట్రాలు పిటిషన్లు వేయడం గమనార్హం.

హిందూ బోర్డుల్లో ముస్లింలను నియమిస్తారా?

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యుల నియామకాల సెక్షన్‌ను ప్రస్తావిస్తూ.. 'హిందూ మత ట్రస్టు బోర్డుల్లో ముస్లింను నియమిస్తారా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో సభ్యులుగా ముస్లింలే ఉండాలని పేర్కొంది. వక్ఫ్ బోర్డుల్లో ఎక్స్‌అఫీషియో సభ్యులు కూడా ముస్లింలే ఉండాలని సూచించింది. వక్ఫ్ చట్టం ప్రకారం కలెక్టర్లు తమ బాధ్యతలను నిర్వర్తించవచ్చని.. కానీ దీనికి సంబంధించిన వివాదాస్పద సెక్షన్‌ను మాత్రం ప్రస్తుతానికి అమలు చేయవద్దని సూచించింది. చివరగా పార్లమెంటు చేసిన చట్టాల్లో సాధారణంగా న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోదని.. కానీ వక్ఫ్ చట్టంలోని పలు అంశాలపై అభ్యంతరాలు, వాటితో సమస్యలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. గురువారం మధ్యాహ్నం విచారణ చేపడతామని.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో హింస చెలరేగడంపై ఆందోళన వ్యక్తం చేసింది.



ఢిల్లీలో ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

రాజకీయ ప్రతీకారమే!

ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లపై భగ్గుమన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన చార్జిషీట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లను పేర్కొనడాన్ని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా నిరసించారు. ఏఐసీసీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను చేతబూని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది రాజకీయ ప్రతీకార చర్య అంటూ ధ్వజమెత్తారు. 24, అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. "కాంగ్రెస్ అగ్రనేతలు భయపడవద్దు.. మొత్తం దేశం మీతో ఉంది" అంటూ రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చిన నేపథ్యంలో భారీ స్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ పార్టీలో రెండు రకాల గుర్రాలు

» రేసులో వాడే వాటిని పెళ్లికి.. పెళ్లికి వాడే వాటిని రేసులకు పంపుతున్నాం

» పార్టీ నేతలకు అప్పగిస్తున్న బాధ్యతలపై రాహుల్ వ్యాఖ్య

అహ్మదాబాద్, ఏప్రిల్ 16: కాంగ్రెస్‌లో నాయకత్వ సమస్యలను ప్రస్తావిస్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం గుజరాత్‌లోని మోదాసాలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీలో రెండు రకాల గుర్రాలు ఉన్నాయి. ఒకరకమేమో రేసుల్లో దౌడు తీసేవి, రెండో రకం పెళ్లిలో ఊరేగింపులకు వాడేవి. కాంగ్రెస్ చాలా సార్లు పెళ్లికి వాడే గుర్రాలను రేసులకు, రేసు గుర్రాలను పెళ్లిళ్లకు పంపుతోందని కొందరు నాతో చెబుతున్నారు. ఇప్పుడా పరిస్థితిని సరిచేయాలి" అని రాహుల్ పేర్కొన్నారు. ఇకపై సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో కొందరు నేతలు బీజేపీతో అంటకాగుతున్నారని, అలాంటి వారిని గుర్తించి బయటికి పంపాల్సి ఉందన్నారు. పార్టీలో అంతర్గతంగా మార్పులు రావాల్సి ఉందని ఆయన చెప్పారు.

ఆదాయం 2, వ్యయం 1.97

- రాష్ట్ర వ్యయం రూ.1.97 లక్షల కోట్లు
- రాబడి రూ.2 లక్షల కోట్లు
- 130 శాతం మేర మార్కెట్ రుణాలు
- 'కాగ్' ఫిబ్రవరి నివేదిక విడుదల



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాల రాబడుల కింద రూ.2,00,632.26 కోట్లు వచ్చాయి. అలాగే, అన్ని పద్దుల కింద ప్రభుత్వం రూ.1,97,066.32 కోట్లు ఖర్చు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఫిబ్రవరి నెల నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) బుధవారం విడుదల చేసింది. 2024-25కి గాను ప్రభుత్వం రూ. 2,91,159 కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రభుత్వ పథకాలు, వడ్డీ చెల్లింపులు, ఉద్యోగుల జీత భత్యాలు, పెన్షన్లు, సబ్సిడీల వ్యయంతోపాటు మూలధన వ్యయం కలిపి మొత్తం రూ.2,54,431.31 కోట్లను ఖర్చు చేస్తామని పేర్కొంది. అయితే, ఫిబ్రవరి నాటికి రూ. 1,97,066.32 కోట్లను ఖర్చు చేసింది. 2023-24 బడ్జెట్‌లో ఇదే ఫిబ్రవరి నాటికి రూ.75.18 శాతం మేర నిధులను ప్రభుత్వం ఖర్చు చేసింది. అంటే.. 2023-24తో పోలిస్తే వ్యయంలో 2.27 శాతం మేర వృద్ధి నమోదైంది. కాగా, ఈ 1.97 లక్షల కోట్లలో పథకాల కోసం రూ.73,455.82 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.24,078.06 కోట్లు, జీత భత్యాలకు రూ.38,962.53 కోట్లు, పెన్షన్లకు రూ.15,480.84 కోట్లు, సబ్సిడీలకు రూ.12,291.60 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. మూలధన వ్యయం కింద రూ.33,486.50 కోట్లను ఖర్చు చేస్తామని అంచనా వేయగా ఫిబ్రవరి నాటికి అందులో 97.58 శాతం రూ.32,797.47 కోట్లు వ్యయం చేసింది. 2024-25లో మొత్తం వ్యయం రూ.2.20 లక్షల కోట్ల మేర ఉంటుందని సీఎం ఇదివరకే ప్రకటించారు. అలాగే, 2025-26 బడ్జెట్ ప్రకటన సందర్భంలో 2024-25 బడ్జెట్ రూ.2,91,159 కోట్లను రూ. 2,65,934.51 కోట్లకు ప్రభుత్వం సవరించింది. మార్చి వివరాలు వెలువడితే లెక్కలు తేలుతాయి.

రాబడులు రూ.2 లక్షల కోట్లు

2024-25 ఏడాదిలో ఫిబ్రవరి నాటికి అన్ని రకాల రాబడుల కింద ప్రభుత్వానికి రూ.2,00,632.26 కోట్లు వచ్చాయి. ప్రతిపాదిత రాబడులు రూ.2,74,057.64 కోట్లలో ఇది 73.21 శాతం. ఇందులో రెవెన్యూ రాబడుల కింద రూ.1,36,136.01 కోట్లు, వస్తు సేవల పన్నులు రూ.46,440.07 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కింద రూ.7,033.38 కోట్లు, అమ్మకం పన్ను కింద రూ.29,238.45 కోట్లు, ఎక్సైజ్ సుంకాల కింద రూ.16,808.29 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.17,243.22 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల కింద రూ.7,290.14 కోట్లు ఉన్నాయి. పన్నేతర రాబడి కింద రూ.6,071.98 కోట్లు సమకూరాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.6,009.65 కోట్లు వచ్చాయి. మూలధన రాబడుల్లో భాగంగా రూ.49,255.41 కోట్ల మేర మార్కెట్ రుణాలను తీసుకుంటామని ప్రభుత్వం అంచనా వేయగా రూ.64,456.79 కోట్ల అప్పులు తీసుకున్నది. ఇది ప్రతిపాదిత అప్పులో 130.86 శాతం కావడం గమనార్హం.

రియల్‌ఎస్టేట్ సంస్థల్లో
ఈడీ సోదాలు

- సురానా గ్రూప్, సాయిసూర్య డెవలపర్స్.. ఆర్యవన్ ఎనర్జీ సంస్థల్లో తనిఖీలు

హైదరాబాద్, బోయినపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వివిధ బ్యాంకులకు రూ.13 వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కేసులో రియల్‌ఎస్టేట్ సంస్థ సురానా గ్రూప్, దాని అనుబంధ సంస్థలు- సాయిసూర్య డెవలపర్స్, ఆర్యవన్ ఎనర్జీలపై చెన్నైవిభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ మోసాలపై ఐడీబీఐ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో 2019లోనే బెంగళూరు విభాగం సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీల్యాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. సురానా గ్రూప్ చైర్మన్, ఇతర డైరెక్టర్లు చెన్నైలో నివసిస్తున్నా.. వారికి హైదరాబాద్‌లో వ్యాపారాలున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని.. అనుబంధ సంస్థలకు అక్రమంగా మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. దీంతో..హైదరాబాద్‌లోని సురానా గ్రూప్, సాయిసూర్య, ఆర్యవన్ ఎనర్జీ కార్యాలయాలు, వాటి డైరెక్టర్ల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో బోయినపల్లిలోని అరిహంట్ కార్డు మాస్టర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని సురానా యజమానుల ఇంట్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. రాత్రి కడపటి వార్తలందేసరికి సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతోపాటు.. సురానా గ్రూప్ ఎండీ దేవేందర్ సురానా ఇళ్లు, కార్యాలయాలు, సాయిసూర్య, ఆర్యవన్ ఎనర్జీ కార్యాలయాల్లోనూ ఈడీ సోదాలు జరిగాయి.




సీఆర్ నాయుడు ఆత్మకథ 'కొండమెట్లు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.వెంకయ్య నాయుడు. చిత్రంలో ఎన్వీ రమణ, హెచ్‌జే దొర.. సీఆర్ నాయుడును శాలువాతో సత్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ. చిత్రంలో విశ్రాంత ఐఏఎస్ కె. లక్ష్మీనారాయణ తదితరులు

ఆదర్శప్రాయుడు సీఆర్ నాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.. విశ్రాంత ఐపీఎస్ సీఆర్ నాయుడు ఆత్మకథ 'కొండమెట్లు' పుస్తకావిష్కరణ

- పాల్గొన్న సుప్రీం మాజీ సీజే ఎన్వీ రమణ, ఏపీ మాజీ డీజీపీ దొర తదితరులు
- సీఆర్ నాయుడును సత్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐపీఎస్ అధికారి సీఆర్ నాయుడు ఆత్మకథ 'కొండమెట్లు' పుస్తకం యువతరానికి ప్రేరణగా నిలుస్తుందని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కొనియాడారు. చిత్తూరు జిల్లా మారుమూల పల్లెల్లో పుట్టిన ఆయన పోలీసు అధికారి కావాలన్న ఇష్టంతో కష్టపడి లక్ష్యాన్ని సాధించిన తీరు అభినందనీయమన్నారు. క్యాప్ సంస్థ ద్వారా సీఆర్ నాయుడు నిర్వహిస్తున్న జీవన నైపుణ్యాల శిక్షణ వంటి సేవాకార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విశ్రాంత ఐపీఎస్, పారిశ్రామికవేత్త చేరెడ్డి రామచంద్రయ్య నాయుడు (సీఆర్ నాయుడు) ఆత్మకథ 'కొండమెట్లు' పుస్తకాన్ని బుధవారం మాదాపూర్‌లోని దస్‌పల్లా హోటల్లో వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. పుస్తక రచయిత సీఆర్ నాయుడు మాట్లాడుతూ... కమ్యూనిటీ పోలీసింగ్, మైత్రి ప్రాజెక్టులను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లడం తన జీవితంలో ఒక మర్చిపోలేని మధురానుభూతులని తెలిపారు. తన జీవిత భాగస్వామి శశికళ సహకారం వల్లే జీవితంలో ఇన్నిమెట్లు ఎక్కగలిగానంటూ భావోద్వేగంతో మాట్లాడారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సీఆర్ నాయుడును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జె దొర, కె. పద్మనాభయ్య, మహేందర్ రెడ్డి, గౌతం సవాంగ్, ఆర్పీ సింగ్, వీకే మొహంతి తదితర సీనియర్ ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీనియర్ ఐఏఎస్ కె. లక్ష్మీనారాయణ, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగానికి పనికొస్తాడనుకోలేదు: ఎన్వీ రమణ

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ మాట్లాడుతూ.. "సీఆర్ నాయుడును మొదట చూసినప్పుడు, ఇతను పోలీసు ఉద్యోగానికి పనికొస్తాడా? అన్న సందేహం కలిగేది. పోలీసు అధికారిగా ఆయన కమ్యూనిటీ పోలీసింగ్, బాల కార్మికుల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించడంలాంటి ఎన్నో కొత్త విధానాలు ప్రవేశపెట్టడం చూసి తర్వాత నా అభిప్రాయం పూర్తిగా తప్పు అని నిర్ధారించుకున్నాను" అని అన్నారు.

నేటి నుంచే రెవెన్యూ సదస్సులు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నామన్నారు. 18న ములుగు జిల్లా వెంకటాపురంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో తాను పాల్గొననున్నట్లు చెప్పారు. నారాయణ పేట జిల్లా మద్దూరు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపురం మండలాల్లో భూ సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేక దరఖాస్తును రూపొందించినట్లు తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలను మినహాయించి.. మిగిలిన అన్ని సమస్యలపై వచ్చిన దరఖాస్తులను మే 1 నుంచి పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తులను ఏ రోజుకా రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. మండలానికి రెండు గ్రామాల్లో నిర్వహించే అవగాహనా సదస్సులకు కలెక్టర్లు రోజూ హాజరు కావాలని కోరారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ బృందాలుగా ఏర్పడి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అవి పూర్తయ్యాక 4 మండలాల్లో నిర్వహించినట్లే రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు నమూనా ఇలా..

భూ భారతి చట్టం అమలులో భాగంగా 4 మండలాల్లో భూ సమస్యలను గుర్తించేందుకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆధ్వర్యంలో దరఖాస్తును తయారు చేసింది. అందులో దరఖాస్తు నంబరు, భూ యజమాని వివరాలను తొలుత నమోదు చేయాలి. ఆ తర్వాత పాస్ పుస్తకం ఉందా, లేదా? అనే వివరాలను, ఖాతా నంబరు, ఇంటి చిరునామా, 10వ కాలం కింద భూ సమస్యలను తెలపాలి. ఇందులో భూమి ఖుష్కి, తరి అనే వివరాలను; పట్టా, ఇనాం, లావుణి, సీలింగ్, ప్రభుత్వ, భూదాన్, పోడు వంటి వివరాలను; భూమి ఎలా వచ్చిందనే విషయాన్ని తెలియజేయాలి. భూ సమస్యలకు సంబంధించి.. కొత్త పాస్ పుస్తకం రాలేదు, పాస్ పుస్తకంలో వివరాలు తప్పుగా ఉన్నాయి, సాగులో ఉన్న భూమి కంటే పాస్ పుస్తకంలో నమోదు చేసిన విస్తీర్ణం తక్కువ ఉండడం, సర్వే నంబర్లు తప్పు వేయడం, పట్టాదారు పేరు తప్పు రాయడం, నిషేధిత జాబితాలో ఉండడం, సాదాబైనామా క్రమబద్ధీకరణ కాలేదు.. ఇలా 11 రకాల సమస్యలను నమోదు చేసే అవకాశం కల్పించారు.

5 లక్షల మందికిపైగా సందర్శకులు

భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించిన 36 గంటల్లోనే 5 లక్షల మందికి పైగా సందర్శించారు. మొదటి నాలుగు గంటల్లో ఉద్యోగులు 20 వేల మంది లాగిన్ కాగా.. ప్రజలు 60 వేల మంది అయ్యారు. మంగళవారం ఒక్క రోజే భూ భారతి పోర్టల్ ద్వారా 1210 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక పోర్టల్‌లో ఉన్న 9 రకాల రిజిస్ట్రేషన్ల అమరిక గందరగోళంగా ఉందన్న ఫిర్యాదులు రావడంతో వాటిలో మార్పులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పాఠశాల నీళ్ల ట్యాంకులో పురుగు మందు

(మొదటి పేజీ తరువాయి)

ధరంపురి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ధరంపురి ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 30మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రోజులాగే బుధవారం కూడా విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ స్కూల్‌కు వచ్చారు. నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని వండే సమయంలో వంట గదికి తాళం పగలగొట్టి ఉండడంతో.. విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలికి చెప్పారు. అప్రమత్తమైన హెచ్ఎం.. సమాచారాన్ని గ్రామ పెద్దలకు వెంటనే స్కూల్‌కు వెళ్లి చూడగా గదిలో పురుగుల మందు వాసన రావడంతో పాటు వంట పాత్రల్లో తెల్లటి వర్ణంలో ద్రావణం కనిపించింది. దీంతో పాఠశాలలోని వంట సామగ్రిలో పురుగుల మందు కలిసిందని గుర్తించారు. అప్రమత్తమైన సిబ్బంది చుట్టూ చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. తాగు నీటి ట్యాంకులోనూ దాన్ని కలిపినట్లు గుర్తించారు. వెంటనే వారు విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చివరకు గ్రామానికి చెందిన సోయం కిష్టు అనే యువకుడు ఈ ఘటనకు పాల్పడినట్టు నిర్ధారించారు. కుటుంబ కలహాలు, ఇంట్లో వారిపై కోపంతో పాటు అతని మానసిక ఆరోగ్యం సరిగ్గా లేదని గుర్తించారు. పోలీసులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, పిల్లలంతా విష ప్రయోగం నుంచి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తరగతి గదిలో పెచ్చులూడి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

- వికారాబాద్ జిల్లా మున్నూర్‌సోమారం పాఠశాలలో ఘటన



విద్యార్థిని కాలుకు అయిన గాయం

ధారూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని మున్నూర్ సోమారంలోని 20 ఏళ్ల నాటి పాఠశాల భవనంలోని ఓ తరగతి గదిలో బుధవారం పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. శిరీష(6) స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాలకు వెళ్లగా.. తరగతి గది పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. దీంతో శిరీష తల, చెవి, చెయ్యి, కాలుకు గాయాలయ్యాయి. ఆ సమయంలో తరగతి గదిలో 9 మంది విద్యార్థులుండగా.. శిరీష మినహా మిగిలిన వారంతా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇక, శిరీషను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మధ్యాహ్నం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. కాగా, ప్రమాదం సంగతి తెలుసుకున్న జిల్లా విద్యా శాఖ అధికారి(డీఈవో) రేణుకాదేవి ఆస్పత్రికి వెళ్లి బాధిత బాలికను పరామర్శించారు.

ప్రైవేట్ ఆస్పత్రి పొమ్మంటే.. సర్కారు దవాఖానా ప్రాణాలు నిలిపింది

- షిర్డీ వెళుతూ తీవ్ర అస్వస్థతకు గురైన ఏపీ యువకుడు
- ఉస్మానియా ఆస్పత్రికి వెళితే అడ్మిట్ చేసుకున్న వైద్యులు
- శస్త్రచికిత్స నిర్వహణ.. పూర్తిగా కోలుకున్న యువకుడు



ఆసుపత్రిలో హేమంత్

మంగళ్‌హాట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పరిస్థితి విషమంగా ఉందని చెబుతూ రోగిని అడ్మిట్ చేసుకునేందుకు ఓ ప్రైవేటు ఆస్పత్రి తిరస్కరిస్తే.. సర్కారు దవాఖానా మాత్రం పండగ సెలవురోజు అయినా ఆ రోగిని అడ్మిట్ చేసుకొని.. క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టింది. ఆ ప్రభుత్వాస్పత్రి ఉస్మానియా పెద్దాస్పత్రి అయితే ఆ రోగి ఏపీకి చెందిన హేమంత్ అనే 22 ఏళ్ల యువకుడు. విశాఖ వాస్తవ్యుడైన హేమంత్ గత నెల 29న కుటుంబసభ్యులతో కలిసి షిర్డీ వెళ్లేందుకు హైదరాబాద్‌కొచ్చాడు. 30వ తేదీ ఉగాది రోజు షిర్డీ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా హేమంత్ ఒక్కసారిగా శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హేమంత్ కడుపు బాగా ఉబ్బిపోయి ఉండటంతో చేర్చుకునేందుకు వైద్యులు తిరస్కరించారు. దీంతో కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉస్మానియా ఆస్పత్రిలో సెలవు దినాల్లో, పండగ రోజుల్లో సిబ్బంది, వైద్యులు తక్కువగా ఉంటారు. అయినా అక్కడి జనరల్ సర్జరీ విభాగం వైద్యులు సకాలంలో స్పందించి హేమంత్‌కు పలు పరీక్షలు నిర్వహించారు. అల్ట్రాసౌండ్ రిపోర్టు ఆధారంగా అతడి కడుపులో పేగుకు రంధ్రం పడిందని గుర్తించారు. వెంటనే హేమంత్‌కు జనరల్ సర్జరీ 7వ యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ రంగా అజ్మీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విక్రమ్ సారథ్యంలోని వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించి కడుపులోని వ్యర్థాలను తొలగించడంతో పాటు పేగుకు పడిన రంధ్రాన్ని సరిచేశారు. పది రోజులు పరిశీలనలో ఉంచి.. గతవారం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు వెల్లడించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షలతో కూడుకున్న శస్త్రచికిత్సను పూర్తి ఉచితంగా, అదికూడా సెలవు రోజు నిర్వహించి ప్రాణాలను కాపాడిన వైద్య బృందంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉస్మానియా వైద్యులకు ధన్యవాదాలు చెబుతూ హేమంత్ కుటుంబసభ్యులు, స్నేహితులు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఫలితంగా అక్కడి వైద్యులపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవలు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయని, నిరుపేద రోగులు వినియోగించుకోవాలని ప్రొఫెసర్ డాక్టర్ రంగా అజ్మీరా తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొత్తులు–ఎత్తులు

కమలంతో స్నేహం ఎన్నికల వరకేనని అన్నాడీఎంకె అధినేత పళనిస్వామి బుధవారం చేసిన వ్యాఖ్యను ఎవరికి తోచినరీతిలో వారు విశ్లేషించుకోవచ్చు. అధికారపక్షం డీఎంకెను ఓడించగలశక్తి తమకు ఉన్నదని పళనిపార్టీలో ఎంతమంది నమ్ముతున్నారో తెలియదు కానీ, బీజేపీతో గతవారం మొలిచిన పొత్తు కారణంగా తాము మరింత దెబ్బతినిపోతామన్న భయం మాత్రం అత్యధికుల్లో ఉంది. మరీ ముఖ్యంగా కార్యకర్తల్లో ఉన్న ఈ ఆందోళనను పటాపంచలు చేయడానికీ, వారిలో ఉత్సాహాన్ని నింపడానికి పళని ఈ వ్యాఖ్యలు చేసినట్టు కనిపిస్తోంది. బీజేపీని కాదు పొమ్మనగలిగే స్థితి పళని పార్టీకి లేదు. డీఎంకెను బలంగా ఢీకొట్టడానికి సమస్త సంపత్తీ ఉన్న బీజేపీ దానికి అవసరం. పొత్తును పునరుద్ధరించుకోవాలా వద్దా అని మల్లగుల్లాలు పడి, చివరకు కుదర్చుకున్నప్పటికీ, డీఎంకె నుంచి వస్తున్న విమర్శలు, ప్రశ్నలు పళని పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, ఎన్నికలవరకే పొత్తు అనడం ద్వారా, ఆ తరువాత ప్రభుత్వం ఏర్పాటులో కానీ, పాలనలోనే కానీ బీజేపీకి వీసమెత్తు చోటు ఉండదని పళని ముందే సందేశం ఇవ్వదల్చుకున్నట్టు కనిపిస్తోంది.

ప్రధాని మోదీ, అమిత్ షా ఇత్యాది బీజేపీ నాయకులు ఈ పొత్తును ఘనంగా ప్రశంసిస్తూ ప్రకటనలు చేశారు. నిజానికి, బీజేపీ నాయకులకంటే ఎక్కువగా ఈ పొత్తును ఆకాశానికి ఎత్తేస్తూ తమిళనాడు అభివృద్ధి, ఇరుపక్షాల ముందుచూపు, రాష్ట్రానికి మోదీ ఆశీస్సులు ఇత్యాది మాటలు వాడింది పళనిస్వామే. పొత్తుకు ఏ కండిషన్లు, డిమాండ్లు లేవని, అన్నాడీఎంకె వ్యవహారాల్లో, నిర్ణయాల్లో బీజేపీ ఏ మాత్రం జోక్యం చేసుకోబోదని, కలసికట్టుగా పనిచేస్తామని అమిత్ షా మొన్న శుక్రవారం పొత్తు ప్రకటన నాడు వివరించారు. రెండుపార్టీలను సహజభాగస్వాములని కీర్తించారు. ఈ పొత్తు పునరుద్ధరణ కోసం బీజేపీ అన్నామలై వంటి పోరాటవీరుడిని వదులుకుంది. ఆయన డీఎంకెమీద అస్త్రాలు సంధిస్తున్నంతవరకూ అన్నాడీఎంకె బాగా ఆనందపడింది. ఆయన కారణంగానే రాష్ట్రంలో నాలుగుఓట్లు పడుతున్నాయనీ, పార్టీ పెరుగుతోందని, సిద్ధాంత వ్యాప్తి జరుగుతోందని బీజేపీ నాయకులు కూడా సంతోషించారు. కానీ, ఆ తరువాత అన్నాదురై, జయలలిత సహా అన్నాడీఎంకె నాయకులమీద ఈ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఘాటైన విమర్శలు చేయడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందే పళనిపార్టీ ఆ పొత్తు తెంపేసుకుంది. బీజేపీతోనూ, ఎన్డీయేతోనూ తెగదెంపులు తమకు అత్యంత సంతోషకరమైన ఘట్టం అని ఈ నాయకులంతా అన్నారు. బీజేపీతో పొత్తు కారణంగా మైనారిటీ ఓట్లు తమకు దక్కకుండా పోతున్నాయని, ముప్పైతొమ్మిది ఎంపీ సీట్లూ తామే గెలుస్తామని చెప్పుకున్నారు. కానీ, ఈ తెగదెంపుల ఎత్తుగడ తర్వాత కూడా సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకూ ఒక్కసీటు కూడా గిట్టుబాటు కాలేదు.

ఈ విడాకుల సందర్భంలోనే, చాలామందికి జయలలిత మరణానంతరం ఆమె పార్టీ రెండుగా చీలిన ఘట్టం గుర్తుకువచ్చింది. కన్నీరు మున్నీరవుతున్న శశికళ తలనిమిరి ప్రధాని మోదీ ఓదార్చడం, అనూహ్యంగా న్యాయస్థానం ఆదేశాలతో శశికళ జైలుకు పోవడం, పళని–పన్నీరు వైరాలు, న్యాయపోరాటాలు, తరువాత కరచాలనాలు, వెన్నుపోట్లు ఇత్యాది పరిణామాలు అన్నాడీఎంకెను ఎంతగా బలహీనపరిచాయో తెలియందేమీ కాదు. తెరవెనుక బీజేపీ ఉన్నదనీ, తమిళనాడులో ప్రత్యక్షంగా కాలూనడానికి వీలుగా అమ్మ పార్టీని అదే బలహీనపరచిందని చాలామంది నమ్మకం. అదేతరహాలో అన్నాడీఎంకెను మళ్ళీ చీల్చడానికి అన్నామలై పావులు కదుపుతున్నారన్న అనుమానాల నేపథ్యంలో వేరుపడిన ఈ రెండుపార్టీలు, ఇప్పుడు మళ్ళీ చేయీ చేయీ కలిపి పోరాడాలని నిర్ణయించుకున్నాయి. అన్నామలై స్థానంలోకి అన్నాడీఎంకె మాజీ నాయకుడైన నయనార్ నాగేంద్రన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా వచ్చి మార్గాన్ని సుగమం చేశారు. అత్యంత బలంగా ఉన్న డీఎంకెను ఓడించడానికి ఉభయపక్షాలకు ఈ పొత్తు ముఖ్యం. మరీముఖ్యంగా, తమిళనాడులో కాలూనడం అంత సులభం కాదని ఈ పదేళ్ళకాలంలో తత్వం బోధపడిన బీజేపీకి అన్నాడీఎంకె ఊతం మరీ అవసరం. గత మూడు ఎన్నికల్లోనూ అంతగా లబ్ధిపొందని ఈ కూటమి కేవలం ఏడాదిలో ప్రజలను తన వైపు ఏమేరకు తిప్పుకోగలదో చూడాలి.


ఎవరు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి?

ఇటీవల ఒక సినిమా షూటింగ్ కోసం ఢిల్లీకి వెళ్లాను. రాత్రంతా షూటింగ్. పగలు విశ్రాంతి. బయటకు వెళ్దామంటే ఎర్రటి ఎండ. టీవీ పెడితే పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టంపై చర్చ జరుగుతోంది. దాన్ని చూస్తుంటే నాకెందుకో ఉమర్ ఖలీద్ గుర్తుకొచ్చాడు. ఏసీ రూముల్లో నివసించే నేనే ఎండను తట్టుకోలేకపోతున్నానే, ఐదేళ్ల పాటు తీహార్ జైలులో ఈ ఎండను ఉమర్ ఎలా తట్టుకున్నాడా? అనిపించింది. నా ఆలోచనలు– ఖలీద్ తల్లిదండ్రుల వైపు మళ్లాయి. ఒకసారి వాళ్లని కలిసి ధైర్యం చెబితే బావుంటుంది కదా అనుకున్నాను. మా ఇద్దరికీ పరిచయం ఉన్నవారికి ఫోన్ చేశాను. ఉమర్ తల్లిదండ్రులతో వారు మాట్లాడి, నేను వాళ్లను కలిసేందుకు వస్తున్నానని చెప్పారు. మార్గమధ్యంలో వాళ్ల కలిసారు. ఉమర్‌ను వారందరూ వారానికొకరు తీహార్ జైల్లో కలుస్తూ ఉంటారు. "మీ పనులు మీకుంటాయి. ఇంత హడావుడి జీవితంలో ప్రతివారం ఉమర్‌ను కలవటానికి సమయం ఎలా కేటాయించగలుగుతున్నారు?" అని అడిగాను. "జైలు జీవితం ఎవరినైనా మార్చేయొచ్చు, అంత క్రూరంగా ఉంటుంది. అమీర్ అని మాకు తెలిసిన ఓ యువకుడున్నాడు. అతణ్ణి కూడా తప్పుడు అభియోగాలతో జైలుకు పంపారు. మొదటి మూడు నెలలు అమీర్ కుటుంబ సభ్యులు ప్రతి వారం వచ్చి తనను కలిసేవారు. కానీ వాళ్లది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. దాంతో జైలుకు రావటం తగ్గించారు. వారు రాకపోవటంతో అమీర్‌లో ఆత్మవిశ్వాసం తగ్గింది. సునాయాసంగా బెయిల్ వచ్చేసే ఆ కేసులో– అమీర్ పదేళ్ల జైలులోనే గడిపాడు. జైలు అతణ్ణి ఎలా మార్చిందో మా కళ్లతో చూశాం. ఉమర్‌కు అలాంటి స్థితి రాకూడదని నిర్ణయించుకున్నాం. 'నీకు అండగా మేమున్నాం' అని చెప్పటానికి ప్రతి వారం మాలో ఒకరు వెళ్లి కలిసి వస్తూ ఉంటాం" అని ఉమర్ స్నేహితుడొకరు చెప్పారు. బెయిల్ రాకుండా, విచారణ లేకుండా జైళ్లల్లో మగ్గిపోతున్నవారు కొన్ని కోట్లమంది ఉన్నారు. వారి వేదన కేవలం వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే తెలుస్తుంది. ఉమర్ స్నేహితుల దృష్టిలో అతనొక దేశభక్తుడు. దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నవాడు. అలాంటి వ్యక్తిని ప్రభుత్వం జైలులో ఉంచి మానసికంగా ఇబ్బంది పెడుతోంది కాబట్టి వారు అతనికి అండగా నిలవాలనుకున్నారు ఉమర్ స్నేహితులు. వారిని చూస్తుంటే గర్వంగా అనిపించింది.

మేము వెళ్లే సమయానికి ఉమర్ తండ్రి వక్ఫ్ బోర్డు సమావేశానికి వెళ్లారు. తల్లి ప్రేమతో మమ్మల్ని ఆహ్వానించింది. పైకి నవ్వుతూ మాకు ఆతిథ్యమిచ్చినా, ఆమె కన్నుల్లో ఎంతో బాధ గూడుకట్టుకు ఉంది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియలేదు. ఏవో సందర్భం లేని మాటలు మాట్లాడుతున్నాం. మధ్యలో ఎక్కడో ఉమర్ కేసు ప్రస్తావన వచ్చింది. "నా కుమారుడు త్వరలో విడుదలవుతాడు, కచ్చితంగా బయటకు వస్తాడు. మాకు న్యాయ వ్యవస్థపై ఇంకా విశ్వాసం ఉంది" అంది. మేము ఆమెను ఓదార్చటానికి వచ్చినట్లు అనిపించలేదు. ఆమె మమ్మల్ని ఓదారుస్తున్నట్లు అనిపించింది. నా కళ్లు చెమర్చాయి. కొడుకును అన్యాయంగా జైలులో పెట్టినవారికి శాపనార్థాలు పెట్టాల్సిందిపోయి, న్యాయవ్యవస్థపై నమ్మకంతో మాట్లాడుతోందంటే ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఎలా వర్ణించాలి? ఇంతలో ఉమర్ తండ్రి వచ్చాడు. లోపలికి వెళ్లి మా అందరికీ చాయ్ కలిపి తీసుకువచ్చాడు. "మీ కుమారుడు ఒంటరి కాదు, మేమందరం ఉన్నాం," అన్నాను. ఆయన కళ్లలో ఒక వైపు విశ్వాసం, మరోవైపు ఆవేదన కనిపిస్తున్నాయి. "ఉమర్ తప్పు చేసి జైలుకు వెళ్లలేదు. ప్రజల కోసం పోరాడుతూ జైలుకు వెళ్లాడు. అయినా మనందరం తనతోనే ఉన్నాంగా," అన్నారాయన. ఆ తండ్రి ఆత్మవిశ్వాసానికి మనస్సులోనే సెల్యూట్ చేశాను. మాటలు సాగుతున్నాయి. "ఉమర్‌కు బెయిల్ వచ్చి విడుదలయితే, ప్రకాశ్ సార్ దగ్గరకు దక్షిణ భారతదేశానికి పంపేద్దాం. అక్కడైతే క్షేమంగా ఉంటాడు బాబా!" అని ఉమర్ స్నేహితుడొకరు అన్నారు. ఉమర్ తండ్రి అతని కళ్లలోకి సూటిగా చూసి "పోరాటం జరుగుతున్నది ఇక్కడ, ఢిల్లీలో. ఆ ప్రాంతాన్ని వదిలి ఎక్కడికి వెళ్లాలి? ఎందుకు వెళ్లాలి?" అన్నారు. ఆయన మాటలకు నాకు షాక్ కొట్టినట్లయింది. వారి దృష్టిలో పోరాటమనేది జీవితానికి పర్యాయపదం. ఒక వ్యక్తికి ఉన్న సహజమైన హక్కులతో, రాజ్యాంగం చట్టబద్ధంగా ప్రసాదించిన గౌరవంతో ఈ సమాజంలో జీవించాలంటే పోరాడాల్సిందే. జీవచ్ఛవాలుగా ఉండలేం కదా! వర్తమానంలో ఉమర్‌ను ఎన్ని రకాలుగానైనా అనుకోవచ్చు. చరిత్ర మాత్రం భవిష్యత్తులో ఉమర్‌ను, అతని తల్లితండ్రులను దేశభక్తులుగా గుర్తిస్తుందనే నమ్మకం నాకుంది.

ఇక్కడ మనం ఇంకొన్ని విషయాలు కూడా మాట్లాడుకోవాలి. అసలు దేశద్రోహం అంటే ఏమిటనే విషయం తెలియకపోతే ఎవరు దేశభక్తుడో ఎవరు దేశద్రోహో ఎలా తెలుస్తుంది? ఈ నిర్వచనాలు తెలుసుకోవటానికి ఎప్పటి చరిత్రనో తవ్వాల్సిన అవసరం లేదు. వందేళ్ల నాటి చరిత్రను గమనిస్తే చాలు. మన దేశాన్ని అహింస అనే సూత్రం ద్వారా ఏకతాటిపై ఉంచిన మహాత్ముడు మత సామరస్యమనే సిద్ధాంతాన్ని గాఢంగా నమ్మాడు. "దేశం అంటే భూభాగం కాదు. దానిలో నివసించే ప్రజలు. వారందరికీ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు ఉంది. జాతి, మతం, భాషలు వేరు కావచ్చు. కానీ అందరూ సోదరులే" అని ప్రచారం చేశాడు. ఈ భావజాలాన్ని వ్యతిరేకించిన గాడ్సే అనే మతతత్వ ఉన్మాది మహాత్ముడిని హత్య చేశాడు. ఈ మధ్యకాలంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత– గాంధీజీని దేశద్రోహిగా, గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ చేతిలో అధికారం ఉంది. తమ విధానాలను అడ్డుకున్నవారు దేశద్రోహులవుతున్నారు. తమ మతమౌఢ్యాన్ని సమ్మతించేవారు అనతి కాలంలోనే దేశభక్తులవుతున్నారు! ఉమర్ కూడా అంతే! అతను ఒకప్పుడు చురుకైన యువకుడు. భారత రాజ్యాంగ ఆత్మను అర్థం చేసుకున్నవాడు. దానిని నాశనం చేస్తున్న వారికి వ్యతిరేకంగా రోడ్డెక్కి పోరాడినవాడు. మతద్వేషాన్ని, మతమౌఢ్యాన్ని వ్యాప్తి చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకున్నవారికి వ్యతిరేకంగా పోరాడినవాడు. "మతం వ్యక్తిగత అంశం. దానికి రాజకీయాల్లో స్థానం లేదు" అని ప్రతిపాదించిన గాంధీకి నిజమైన మానస పుత్రుడు. "సర్వాధికారానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం మన నుంచి ప్రారంభం కాలేదు, మనతో ఆగిపోదు" అని గర్జించిన భగత్‌సింగ్ వారసుడు.

మన దేశానికి సౌభ్రాతృత్వం అంతరాత్మ. దీన్ని నాశనం చేయటానికి ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ). దీనికి వ్యతిరేకంగా ఉమర్ పోరాడాడు. దీనిని వ్యతిరేకించేవారికి, సమర్థించేవారికి మధ్య జరిగిన పోరాటం హింసాత్మక రూపం దాల్చింది. ఈ పోరాటంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది ముస్లింలే! ఈ హింసాత్మక ఘర్షణలను ప్రేరేపించే విధంగా ప్రసంగాలు చేసిన పాలక పార్టీ సభ్యులు స్వేచ్ఛగానే తిరుగుతున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఉమర్‌ను మాత్రం ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కింది కోర్టులన్నీ ఉమర్‌కు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించాయి. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుండా, ఒక వ్యక్తిని ఐదేళ్ల జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకపోతోంది. "ఇరవై నిమిషాలు సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా" అంటాడు ఆయన తరఫు న్యాయవాది. కానీ ఆ ఇరవై నిమిషాల సమయం సుప్రీం కోర్టుకు లభించటం లేదు. చచ్చిన చేపలే ప్రవాహానికి కొట్టుకుపోతాయి. బతికిన చేపే ప్రవాహానికి ఎదురీదుతుంది. ఒడ్డుకు చేరుతుంది. నా దృష్టిలో ఉమర్ ప్రస్తుతం ప్రవాహానికి ఎదురీదుతున్న చేప. ఎప్పటికైనా తప్పకుండా విజయం సాధిస్తాడు.



> ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుండా, ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్ ఖలీద్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకుండా పోతోంది. "ఇరవై నిమిషాల సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా" అంటాడు ఆయన తరఫు న్యాయవాది. కానీ ఆ ఇరవై నిమిషాల సమయం సుప్రీంకోర్టుకు లభించటం లేదు.



■ ప్రకాశ్ రాజ్
సినీనటుడు, సామాజిక ఉద్యమకారుడు

పచ్చళ్ళమ్మాయి–పెట్టుబడిదారీ భాష!

"ఇదే అదనుగా చోటామోటా వ్యాపారులంతా చెలరేగిపోతున్నారు. క్యూ వెంబడి రకరకాల వస్తువులు పట్టుకుని తిరుగుతున్నారు. కొనమని డిమాండ్ చేస్తున్నారు. కొననివాళ్లను తిడుతున్నారు. మరీ భీష్మించుకుంటే నిర్దాక్షిణ్యంగా క్యూలోంచి లాగిపడేస్తున్నారు. ఇంట్లోంచి బయటికొచ్చాక ఏదో ఒకటి కొనకుండా ఎలా ఉంటారండీ. అసలు అలాంటి వాళ్లు ఇంట్లోంచి బయటికి ఎందుకొచ్చారండీ" ఇవి నేను 2014లో రాసిన 'ఒంటిచెయ్యి' కథలోని మాటలు.

కొనుగోలు శక్తి లేనివారికి బయట తిరిగే అర్హత లేదనేది ఈ సన్నివేశంలో సారాంశం. మళ్లీ అలాంటి అంశమే నాకు అలేఖ్య చిట్టి పచ్చళ్ల వివాదంలో కనిపించింది. ధర ఎక్కువ అని ఒక కస్టమర్ అన్నందుకు ఆ పచ్చళ్లు అమ్మే అమ్మాయిల్లో ఒకామె ఓ ఆడియోలో అతణ్ణి దుర్భాషలాడింది. 'నువ్వెందుకూ పనికిరావు.. తొందరపడి ప్రేమ, పెళ్లి వంటి వాటి జోలికి వెళ్లకు, ముష్టి పచ్చళ్లే కొనలేని నువ్వు రేపు పెళ్లానికి బంగారం ఏమి కొనిపెడతావు' అంటూ అతణ్ణి దెప్పిపొడిచింది. ఆ ఆడియో వైరల్ అయిపోయింది. ఆడపిల్ల, పైగా పెళ్లి కాని యువతి అయ్యుండి, పవిత్ర భారత సమాజంలో ఇంతటి పచ్చిగా మాట్లాడుతావా.. అంటూ అందరూ ఆ అమ్మాయిని ట్రోల్ చేశారు. ఆమె నడిపే వెబ్‌సైటును, యూట్యూబ్ చానల్‌ను రిపోర్టు కొట్టారు.

ఇక్కడ ఆమె వాడిన భాష కన్నా ఆ మాటల్లోని అంతరార్థమే ఎక్కువ ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే ధర ఎక్కువ అని ప్రశ్నించిన వారికి ఆమె అనునయంగా నచ్చచెప్పే ప్రయత్నం చేయలేదు. ధర ఎందుకు ఎక్కువో వివరించే ప్రయత్నమూ చేయలేదు. అసలు ఆ ప్రశ్న అడగడమే తప్పు అన్నట్టు తిట్టింది. ఇంకోసారి ఇంకెవరైనా అలాంటి ప్రశ్న వేయడానికే భయపడిపోయి ఆత్మన్యూనతా భావానికి గురయ్యేలా ప్రవర్తించింది. సమాజంలో కొనుగోలు శక్తి లేని బక్క ప్రాణులకు తన పచ్చళ్లు తినే అర్హత లేదని తెలిసో తెలియకో ఆమె తేల్చేసింది.



> నిత్యం ప్రతి చోటా ఖరీదైన షాపుల్లో తలవొంచుకుని అడిగినంత ఇచ్చి కొనుగోలు చేస్తున్న మనకు కేవలం పచ్చళ్లమ్మాయిని మాత్రమే ధర ఎక్కువ అని ప్రశ్నించే హక్కు ఉందా? నాకైతే ఆ పచ్చళ్లమ్మాయిలో ఈ పెట్టుబడిదారీ సమాజం తయారు చేసిన ఒక మరబొమ్మ మాత్రమే కనిపిస్తోంది.

నిజానికి ఈ పచ్చళ్ల అమ్మాయి మాట్లాడింది పెట్టుబడిదారీ సమాజపు భాష. మొన్న ఓ ఐస్‌క్రీం ప్రకటన చూశాను. దాని ధర మనం నిత్యం తినే సాధారణ ఐస్‌క్రీం కన్నా పది రెట్లు ఎక్కువ! పైగా బ్రాండెడ్. ప్రకటనలో ఒకమ్మాయి ఆ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్‌ని కొనగానే ఉన్నట్టుండి సమాజం ఆమెను చూసే చూపు మారిపోతుంది. అప్పటిదాక సాధారణ స్త్రీలా ఉన్న ఆమె ఆ ఐస్‌క్రీమ్ కొన్న మరుక్షణమే మహారాణిలా కనిపిస్తుంది. పైగా ఇదే ప్రకటనలో సాధారణ ఐస్‌క్రీమ్ తింటున్న ఒకతను ఈ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్ తింటున్న ఆమెను చూసి ఆత్మన్యూనతా భావానికి గురై సిగ్గుతో తన ఐస్‌క్రీమ్‌ని చేతులు వెనక్కి పెట్టుకుని దాచుకుంటాడు. ఈ బ్రాండెడ్ ఐస్‌క్రీమ్ ట్యాగ్‌లైన్ ఏంటో తెలుసా? 'ఎంజాయ్ ద రాయల్ ట్రీట్‌మెంట్'.

పెట్టుబడిదారీ సమాజంలో ఎవరెంత ఖరీదైన వస్తువును కొంటే వారు అంత గొప్ప. అంతే తప్ప 'దానికంత విలువ ఉందా? వస్తువేంటి? నాణ్యతేంటి?' వంటి ప్రశ్నలకు, లాజిక్కులకు తావుండదు. అలాంటి ప్రశ్నలు వేసేవారిని ఈ పచ్చళ్లమ్మాయి ఈసడించుకున్నట్టే మార్కెట్ కూడా ఈసడించుకుంటుంది. ఒక రకంగా అలాంటి వారితో ఈ సమాజానికి ఎలాంటి ఉపయోగమూ లేదని తేల్చేస్తుంది. వారు బతికుండటం కన్నా చనిపోవడమే మేలు అనేలా ప్రవర్తిస్తుంది. ఎలాగోలాగ డబ్బు సంపాదించి పోటీలో నిలబడి, ఎంతకు పడితే అంతకు వస్తువులు కొని అనుభవించడం ఒకటే పరమార్థంగా బోధిస్తుంది. దానికోసం నువ్వు ఏ దారులు తొక్కినా ప్రోత్సహిస్తుంది. అంతిమంగా డబ్బే జీవితం అని చెబుతుంది. అలా అని ఆ అందని పండులో ఏదైనా ప్రత్యేకత ఉంటుందా అంటే.. ఏమీ ఉండదు. కేవలం ప్రచారం ద్వారా దాని చుట్టూ అల్లిన 'బ్రాండు' అనే ఒక రూపరహితమైన మాయాపొర మాత్రమే ఉంటుంది. 'ధర' అనే ప్రశ్నే మన దగ్గర్నుంచి రాకుండా బ్రాండు పేరుతో ఏమీ లేని దానికి ప్రచారం కల్పించి, పోటీకి పెట్టి, ఊరించి కిమ్మనకుండా కొనేలా చేస్తుంది పెట్టుబడిదారి మార్కెట్. అది కొనలేకపోతే జీవితమే వృథా అనిపిస్తుంది.

మధ్యతరగతి ప్రజలు ఈ మాయలో పడి ఆదాయానికి, ఖర్చుకు మధ్య పొంతన కుదరక నిరంతరం నరకం చూస్తారు. వస్తువులు కొనకుండా ఉండలేక, కొని బతకలేక పూర్తిగా డబ్బుతో ముడిపడ్డ మానవ సంబంధాలన్నీ ధ్వంసమై, చావలేక, బతకలేక నలిగిపోతుంటారు. ఒక దశలో మనిషికున్న కొనుగోలు శక్తి మాత్రమే సమాజంలో అతని హోదాని, గౌరవాన్ని నిర్దేశిస్తుంది.

ఇక్కడ పచ్చళ్లమ్మాయి కాబట్టి ధర ఎక్కువని మన నోరు లేచింది కానీ, నిత్య జీవితంలో మనం ఈ ప్రశ్న ఎంతమందికి వేస్తున్నాం? ముఖ్యంగా మల్టీ నేషనల్ కంపెనీలు కేవలం హంగులు పొంగులతో వచ్చి మన దగ్గర దొరికే మంచినీళ్లను కూడా మనతోనే వందలు పెట్టి కొనిపించడం లేదూ! ప్రతి చోటా నిత్యం ఖరీదైన షాపుల్లో తలొంచుకుని అడిగినంత ఇచ్చి కొనుగోలు చేస్తున్న మనకు కేవలం పచ్చళ్ళమ్మాయివంటివారిని మాత్రమే 'ధర ఎక్కువ' అని ప్రశ్నించే హక్కు ఉందా? నాకైతే ఆ పచ్చళ్లమ్మాయిలో ఈ పెట్టుబడిదారీ సమాజం తయారు చేసిన ఒక మరబొమ్మ మాత్రమే కనిపిస్తోంది.

○ డా. వేంపల్లె షరీఫ్

శాంతిచర్చల వెనుక వ్యూహం!

మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదన కొత్తది కాదు. పరిస్థితులు దెబ్బతిన్న ప్రతీసారి, వారు చర్చల జపంతో ముందుకు వస్తారు. మావోయిస్టులు ఈ ప్రతిపాదనను కేవలం వ్యూహాత్మకంగా ఉపయోగిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా పరిశీలిస్తే, ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో వరుస ఎన్‌కౌంటర్లలో అనేకమంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం, వారి కంచుకోటలు బీటలు వారడం జరుగుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో నక్సలిజాన్ని అణచివేసేందుకు తీవ్రమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, మావోయిస్టులు ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఇది నిజమైన శాంతి కాంక్ష కంటే, విధిలేని పరిస్థితుల్లో వెసులుబాటు కోసం చేయాల్సి వచ్చిన వ్యూహాత్మక చర్య.

2004లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో, నక్సలైట్లతో శాంతి చర్చలు జరిగాయి. ఆ సమయంలో వారు హింసను తగ్గిస్తామని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి, చర్చలకు అవకాశం కల్పించింది. కానీ, ఒకవైపు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే, మరోవైపు మావోయిస్టులు భారీగా రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఆయుధాల సరఫరా పెంచుకున్నారు, నిధులు సమీకరించుకున్నారు. చర్చలు విఫలమైన తర్వాత, వారు మరింత బలంగా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడ్డారు. వైఎస్ఆర్ హయాంలో జరిగినట్లుగానే, ఇప్పుడు కూడా రిక్రూట్‌మెంట్, ఆయుధాల సేకరణ, నిధుల సమీకరణ వంటి కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారి ప్రతిపాదన మేరకు నక్సల్ ఏరివేత కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడం ప్రభుత్వాలకు దీర్ఘకాలంలో నష్టం కలిగించవచ్చు. అందువల్ల చర్చలు జరిగినా, మరోపక్క మావోయిస్టుల కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలి. గతంలో మాదిరిగా వారికి వ్యూహాత్మక వెసులుబాటు దొరకకుండా చూడాలి. నక్సల్ ఏరివేత కార్యక్రమాన్ని ఆపకుండా చర్యలు, చర్చలూ కొనసాగించాలి.

– శ్రీనివాస్ గౌడ్ ముద్దం
సామాజిక విశ్లేషకులు

విద్యా సంక్షోభం : విరుగుడేమిటో మీకు తెలియదా?

తెలంగాణ శాసనమండలిలో విద్యారంగం మీద కొన్ని గంటల పాటు కొందరు సభ్యులు చేసిన ప్రసంగం మీద పౌరసమాజం తప్పక చర్చించాలి. తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు చేసిన ప్రసంగాలు, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన విషయాలు కొన్ని ప్రశ్నలను తెలంగాణ సమాజం ముందు ఉంచాయి. 'ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విద్య సంక్షోభంలో ఉందని, వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా తగిన ఫలితం రావటం లేదని, విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు కనీస స్థాయిలో లేవని, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య పట్ల విశ్వాసం సడలిందని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతను ప్రదర్శించటం లేదని' సభ్యుల, ముఖ్యమంత్రి చర్చల సారాంశంగా మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ విద్యారంగం పతనం ఇవాల్టికి ఇవ్వాళ ప్రారంభం కాలేదు. దేశంలోకి నూతన ఆర్థిక విధానాలు ప్రవేశించాక సంక్షేమరంగం మీద, ముఖ్యంగా విద్యారంగం మీద, ప్రభుత్వ కేటాయింపులు తగ్గుతూ వచ్చాయి. విద్య ప్రభుత్వ ప్రాధాన్యంలో లేకుండా పోయింది. ఫలితంగా విద్యార్థులు చదువుకోవడానికి కావలసిన మౌలిక వసతులు తరగతిగదుల నిర్మాణం నిలిచిపోయింది. ఉపాధ్యాయుల నియామకాలు నామమాత్రమయ్యాయి. ప్రభుత్వం విద్యా రంగం మీద కేటాయించే బడ్జెట్ కేవలం టీచర్ల జీతభత్యాలకే సరిపోయేది. కాబట్టి ఈ ప్రభావమంతా బోధన మీద పడింది. ఈ పరిస్థితిని గమనించిన కొందరు వ్యాపారవేత్తలు విద్యా రంగంలోకి ప్రవేశించి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారు. ఈ క్రమంలో ఆర్థిక వెసులుబాటు ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్పించారు. సహజంగానే ప్రభుత్వ విద్యాసంస్థలు పేదల, కింది కులాల విద్యార్థులకు పరిమితం అయ్యాయి. విద్యలో ఒక విభజన రేఖ ఏర్పడింది. లాభసాటిగా మారిన విద్యా వ్యాపారంలోకి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రవేశించడం వల్ల ప్రైవేట్ విద్యారంగానికి నష్టం జరగని విధాన రూపకల్పన ముందుకు వచ్చింది. రాజకీయ పార్టీలకు ఎన్నికలలో డబ్బును సమకూర్చే స్థాయికి విద్యా వ్యాపారవేత్తలు ఎదిగారు. ఫలితంగా 'పూనుస్పర్థలు విద్యలందు వైరములు వాణిజ్యమందు' అని గురజాడ చెప్పిన మాట తలకిందులై విద్యా వ్యాపారంలోకి వైరం ప్రవేశించింది.

గ్లోబలైజేషన్ వ్యక్తి ప్రాధాన్యాన్ని ముందుకు తీసుకొచ్చింది. కెరియరిజానికి పెద్దపీట వేసింది. సామూహిక ఆలోచనలు, విలువలు, సామాజిక ప్రయోజనం, బాధ్యతల స్థానంలో వ్యక్తి ఒక విలువగా ఈ కాలం ప్రదర్శించింది. నిబద్ధతతో పాఠం బోధించాల్సిన టీచర్లు కూడా ప్రపంచీకరణ కడుపుకు గురయ్యారు. ఉదాత్త ఆశయాలు, విలువలు సమాజంలో లుప్తమవుతున్న సందర్భం కూడా తరగతి గదిని ప్రభావితం చేసింది. అవసరానికి మించిన సంపాదన ఒక లక్ష్యంగా సమాజంలోకి వ్యాపించింది. ప్రభావిత సమూహంగా ఉన్న కొందరు ఉపాధ్యాయులు చిట్టీల, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోకి ప్రవేశించారు. ప్రభుత్వం స్థాయిల వారీగా చేయాల్సిన పర్యవేక్షణను గాలికొదిలేసింది. ప్రజా ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు, కమ్యూనిస్టులకు, బహుజన పార్టీలకు విద్య ప్రధాన ఎజెండా కాకుండా పోయింది. ఇది కేవలం తమ అనుబంధ అధ్యాపక, విద్యార్థి సంఘాల నినాదంగా మారిపోయింది. ప్రభుత్వ విద్యను కాపాడితేనే ఓట్లు అడగాలనే చైతన్యాన్ని ప్రజలలో కల్పించి పాలకపార్టీల మీద ఒత్తిడి పెంచి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. ఇన్ని కారణాల వల్ల ప్రభుత్వ విద్య పట్ల మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి విముఖత ప్రదర్శిస్తోంది. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అనాథలయ్యాయి.

ప్రైవేట్, ప్రభుత్వ విద్య అనే తేడా లేకుండా ఈ పాతికేళ్లలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తగిన స్థాయిలో లేవని రేవంత్‌రెడ్డి ఆవేదన చెందారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం తగినంతగా లేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే 'గాయం ఒక చోట ఉంటే మందు మరో చోట' రాస్తే సరైన ఫలితాన్ని ఆశించలేం. ఒక విద్యార్థి మీద ప్రభుత్వం ఏడాదికి చేస్తున్న ఖర్చు రూ.లక్షకు పైగా ఉంటోందని విధాన మండలిలో ముఖ్యమంత్రి చెప్పారు. నిజమే, కానీ ఆ లక్ష రూపాయల్లో ఉపాధ్యాయుల, పాఠ్యేతర ఉద్యోగుల జీతాలు, పాఠశాల కరెంట్ బిల్లులు కూడా కలిసి ఉంటాయని ఆయన తెలియక మాట్లాడారా? ప్రతి విద్యార్థికి ప్రాథమిక పాఠశాల కేంద్రంగా అభ్యసనం జరగాలి. కానీ పాతికేళ్లుగా మన పాలకులు ప్రాథమిక విద్యను గాలికి వదిలివేసారు.

> ఒక విద్యార్థి మీద ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రూ. లక్షకు పైగా ఉంటోందని విధాన మండలిలో ముఖ్యమంత్రి చెప్పారు. నిజమే, కానీ ఆ లక్ష రూపాయల్లో ఉపాధ్యాయుల, పాఠ్యేతర ఉద్యోగుల జీతాలు, పాఠశాల కరెంట్ బిల్లులు కూడా కలిసి ఉంటాయని ఆయన తెలియక మాట్లాడారా?



మన దేశంలో టీచర్లను తయారుచేసే 'ఉపాధ్యాయ శిక్షణా విద్య' అధమ స్థాయిలో ఉంది. సర్టిఫికెట్లు ఇచ్చి సమాజం మీదికి పంపటం తప్ప ఆ కళాశాలల్లో సృజనాత్మకత శూన్యం. అపరిమిత సంఖ్యలో ప్రైవేట్, డి.ఎడ్., బి.ఎడ్ కళాశాలలు ప్రవేశించాక విద్యా ప్రమాణాలు దిగజారిపోయాయి. రికార్డులు రాయకపోయినా, టీచింగ్ ప్రాక్టీస్ చేయకపోయినా అభ్యర్థుల వద్ద డబ్బులు తీసుకొని మార్కులు వేసే కళాశాలలే అధికంగా ఉన్న చోట నాణ్యమైన, ప్రతిభావంతమైన ఉపాధ్యాయులను ఎలా ఆశించగలం?

విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న విద్యార్థులే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు అవుతారు. కానీ విశ్వజ్ఞానాన్ని అందించవలసిన విశ్వవిద్యాలయాలు తెల్లపేపరును విద్యార్థి నల్లగా చేస్తే మార్కులు వేసి, పట్టాలు ఇచ్చి పంపుతున్నాయి. అక్షరాలను సరిగ్గా రాయలేని, చదవలేని వాళ్లకు కూడా పీహెచ్‌డీ లాంటి అత్యున్నత డిగ్రీని ఇచ్చి సత్కరిస్తున్నాయి. ఫలితంగా బోధనా రంగంలోకి నైపుణ్యాలు లేనివారు ప్రవేశిస్తున్నారు. సమాజంలో మెరికల్లాంటి యువత ఆకర్షణీయమైన కార్పొరేట్ జీతాల వైపు వెళ్తున్నారు. దేశీయంగానైతే సివిల్ సర్వెంట్లుగా, గ్రూప్స్ అధికారులుగా స్థిరపడడానికి ఆసక్తి చూపుతున్నారు. బోధనా వృత్తివైపు, పరిశోధన వైపు వచ్చేవారికి ఆయా రంగాల్లో తగిన నైపుణ్యం ఉండటం లేదు.

ఇన్ని సవాళ్లను ఎదుర్కొంటున్న విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలన్న చిత్తశుద్ధి రేవంత్‌రెడ్డికి ఉంటే తక్షణ కార్యాచరణ ప్రకటించాలి. ఉపాధ్యాయుల, అధ్యాపకుల శిక్షణా కళాశాలలను పునః సమీక్షించి వాటి అనుమతులను పునరుద్ధరించాలి. డి.ఎడ్, బి.ఎడ్ కోర్సులకు అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో సమూల మార్పులు తీసుకురావాలి. పఠన, లేఖన నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రవేశపరీక్ష ఉండాలి. ఐచ్ఛిక ప్రశ్నల స్థానంలో వ్యాసరూప సమాధాన ప్రశ్నల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలి. ఉపాధ్యాయ శిక్షణ తర్వాత నిర్వహించే పరీక్ష పత్రాల మూల్యాంకనం శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఉండాలి. పీజీ, పీహెచ్‌డీ స్థాయి విద్యను అభ్యసించేవారి ఎంపిక కోసం నిర్వహించే పరీక్షల్లో కూడా రాత, మౌఖిక పరీక్షా పద్ధతులను ప్రవేశపెట్టి, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయాలి.

యూనివర్సిటీల ఆచార్యుల ఎంపిక ప్రస్తుతం లోపభూయిష్టంగా ఉంది. సివిల్ సర్వీస్ స్థాయి లాంటి మూడంచల పరీక్షా పద్ధతిని ప్రవేశపెట్టి ఆచార్యులను ఎంపికచేయాలి. విశ్వవిద్యాలయాల్లోకి విశ్వజ్ఞానాన్ని ఆహ్వానించే విధంగా ఎంపిక ఉండాలి. అధికారంలో ఉన్నవాళ్లు విశ్వవిద్యాలయాలను తమ రాజకీయ క్షేత్రంగా మార్చుకోవడాన్ని విస్మరించాలి. మంత్రుల, రాజకీయ నాయకుల జన్మదినాలు జరపడం, పాలాభిషేకాలు చేయడం లాంటి విద్యేతర కార్యకలాపాలు చేయకుండా తమ అనుచర గణానికి పరిమితులు విధించాలి. ఈ విషయంలో ముఖ్యమంత్రే చొరవచూపి అదుపుచేయాలి. విశ్వవిద్యాలయాలను కేవలం విద్యార్థి సంఘాల విద్యా సంబంధిత రాజకీయ చర్చలకు వేదికలుగా ఉండనివ్వాలి. సమాజం ఎదుర్కొంటున్న సామాజిక రాజకీయ ఆర్థిక సమస్యలకు పరిష్కారాలను వెదికే మేధోనిలయాలుగా విశ్వవిద్యాలయాలు ఉండాలనే పరిపక్వత సమాజానికి, రాజకీయ నాయకత్వానికీ రావాలి. బోధనా రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి కార్పొరేట్ రంగంలో ఇస్తున్న విధంగానే ఆకర్షణీయమైన వేతనాలు ఉండాలి. అన్నిటికీ మించి విద్యారంగానికి సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించాలి.

• ప్రొఫెసర్ చింతకింది కాశీం



నేటి చాటువులు

అగ్ని సాక్షి గాను అవినీతి భూతమ్ము
న్యాయమూర్తి యింట నాట్యమాడి
దగ్ధమైన నోట్ల దరిచేరి నవ్వేను
ఢిల్లి కోర్టు గుండె జల్లుమనగ

ఉద్యమాల జాడ ఉస్మానియయెదపై
కఠినమైన ఆంక్ష కాలుదువ్వి
చెరిపివేసె నకట నిరసించు హక్కును
పోరుబాట గుండె బోరుమనియె

చిన్నగ ధనలక్ష్మి శిఖరమ్ము నెక్కించి
లోయలోకి నెట్టి వేయునపుడె
పీకమీద కత్తి 'బెట్టింగు యాప'న్న
అదును చూసి జనుల హత్యజేయు

'హెచ్చీసీయు' లోన పచ్చని అడవమ్మ
భూమి లెన్నొ లెస్స బుక్క నెంచి
చిదిమి వేయ జూసె జీవన శ్వాసను
నెమలి పిట్ట కూడ కుమిలి యేడ్చె

ద్రోహచింతనతో మతోన్మాద తంత్రమ్ము,
వక్రశాసనమ్ము వక్ఫు బిల్లు
మందిబలము చూసి మనువాద కత్తితో
సంవిధాన స్ఫూర్తి చంపివేసె

రైలు, బస్సు, ఆటొ, రాస్తాలో నిరతమ్ము
కామసర్పవితతి కాటు వేయు
అత్యాచార ఘటన అసలు జరుగనట్టి
స్థలములేనె లేదు ధరణి లోన

దగ్ధమయ్యె ప్రబల దండకారణ్యము
రాజ్యహింస అగ్ని రగిలి రగిలి
హత్య కాండ చూసి అమిత సంతోషము
మరణములు గుణించి మంత్రి మురిసె

– సంఘమిత్ర



ఈ ఫొటోలో విలపిస్తున్న మహిళా గిరిజన రైతు పేరు మంగమ్మ. ముత్యాలమ్మ తండాకు చెందిన బానోత్ మంగమ్మ - మోహన్ దంపతులు సుమారు మూడెకరాల్లో 40 క్వింటాళ్ల మొక్కజొన్నల దిగుబడి తీశారు. మార్కెట్‌కు తీసుకొచ్చి తేమ తగ్గేందుకు ఆరబోశారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరబోసుకున్న మొక్కకొన్నలన్నీ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. దీంతో గిరిజన రైతు మంగమ్మ కన్నీరుమున్నీరైంది. మంగమ్మ రోదిస్తున్న తీరు తోటి రైతు లను కూడా తీరని ఆవేదనకు గురి చేసింది. పండించిన పంట నీటి పాలైందని, పెట్టుబడి, ఆదాయం కోల్పోయామని, మాకెవరు దిక్కు? అని మంగమ్మ రోదించడం అక్కడున్నవారిని కలచివేసింది.

రెక్కల కష్టం.. వర్షంతో నష్టం..

- అకాలవర్షం, ఈదురుగాలులతో పంటలకు చేటు
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నేలపాలైన చేలు
- నర్సంపేట, పరకాల డివిజన్లలో తీవ్ర నష్టం
- నేలరాలిన మామిడి, ధ్వంసమైన వరి, మిర్చి పంటలు
- మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు నీటిపాలు
- విరిగిపడిన స్తంభాలు.. నేలకొరిగిన భారీ వృక్షాలు..
- పలు ప్రాంతాల్లో ధ్వంసమైన ఇళ్లు
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం

6



చెన్నారావుపేటలో రాలిన వరి పంట దృశ్యం



నాచినపల్లిలోని సీతారామాలయంలోని ధ్వజస్తంభం నేలకొరిగిన దృశ్యం



నీరుకుళ్ల గ్రామంలో అన్నదాత ఎరువుల షాపు పైకప్పు లేచిపోయిన దృశ్యం

ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట ఒక్కసారిగా అకాల వర్షం పాలు కావడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు.. పొద్దనకా మాపనకా.. నిరంతరం కష్టపడే కర్షకుడికి చివరకు కన్నీళ్లే మిగిలాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. భారీగా ఈదురు గాలులు, అకాల వర్షం కురువడంతో మామిడి తోటలు, వరి పంట నేల వాలింది. మొక్కజొన్న పంట కర్రలు విరిగి నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటలు, అరటితోటలకు భారీగా నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఈదురుగాలుల వల్ల కల్లాల్లో ఆరబోసిన వడ్లు వర్షం నీటితో తడిసి ముద్దయినట్లు చెబుతున్నారు. చేనుల్లో ఆరబోసిన మొక్కజొన్న కంకులు వర్షంలో తడిసి పోయినట్లు వాపోయారు. చేతికందే దశలో అకాల వర్షం కురవడంతో అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, శాయంపేట పరిధితోపాటు వరంగల్ జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ, నల్లబెల్లి, వర్ధన్నపేట మండలాల్లో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయాధికారులు స్పందించి పంటనష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించి పరిహారం వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

\- నర్సంపేట, పరకాల (ఆంధ్రజ్యోతి)



చెన్నారావుపేటలో రాలిన మామిడికాయలు



చెన్నారావుపేటలో విరిగిన స్తంభం



దుగ్గొండి మండలం పీజీ తండాలో గాలివానతో కొట్టుకుపోయిన రేకుల ఇళ్లు





పరకాల మండల పరిధిలో తడిచిన ఇటుక బట్టీ, ధాన్యం



నర్సంపేట మార్కెట్‌లో తడిసిన మక్కకొన్నలు

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

- వరంగల్ కలెక్టర్ సత్య శారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంగెం మండలం తిమ్మాపూర్, గీసుగొండ మండలం మచ్చాపూర్ రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేషనల్ హైవే నిర్మాణం వల్ల వరంగల్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భవిష్యత్‌లో హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిలా వరంగల్‌ను చూడవచ్చని అన్నారు. నేషనల్ హైవే యాక్ట్‌ను అనుసరించి రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సంగెం, గీసుగొండ తహసీల్దార్లు గనిపాక రాజ్‌కుమార్, రియాజుద్దీన్, సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి

- కిటెక్స్ కంపెనీని సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కిటెక్స్ కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్‌తో మాట్లాడుతున్న రేవూరి, కలెక్టర్

గీసుగొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కులో నిర్మించే కిటెక్స్ కంపెనీలో స్థానికులకే ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి కల్పించాలని కంపెనీ యాజమాన్యానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన కిటెక్స్ కంపెనీ పనులను బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తుల వివరాలను, ఉద్యోగ కల్పన గురించి తెలుసుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కాగా, కంపెనీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు మనోజ్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. ధరఖాస్తు చేసుకున్న వారి విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం హెల్పర్‌లు, వర్కర్‌లను ఇంటర్వ్యూల ద్వారా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇంజనీర్లు, మేనేజర్లు, సూపర్‌వైజర్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు వంటి ఇతర పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం షార్ట్‌లిస్ట్ తయారుచేసి కాల్‌ఫర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్‌ఐ సాంబయ్య, డీటీ రవిందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం..

- యాసంగిలోనూ సన్న వడ్లకు రూ.500 బోనస్
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



భీమదేవరపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించిన ప్రతీ వరిధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ యాసంగిలో సన్నవడ్ల కు కూడా క్వింటాల్‌కు రూ.500బోనస్ అందిస్తున్నామన్నారు. ఉగాది నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోందన్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వం లాగా ఏదో ఒక ఊరిలో కాకుండా ప్రతి ఊరిలో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన వారికే పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందన్నారు. భీమదేవరపల్లి మండలంలో ఈ నెల 28 నుంచి భూభారతి గ్రామసభలు నిర్వహిస్తున్నామనారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసి పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలు చేస్తున్నామన్నారు. కులగణన పూర్తి చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతున్నామన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా ఫిష్ వెహికల్, సోలార్ యూనిట్లు అందిస్తున్నామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. దేవాదుల ప్రాజెక్టు కుడి కాలువ, గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వంగరకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో నవోదయ పాఠశాలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. త్వరలో వంగరలోని పీవీ విజ్ఞాన వేదిక ప్రారంభిస్తామన్నారు. వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా 60 శాతం సబ్సిడీతో సంచార చేపల విక్రయ వాహనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలు ప్రారంభించారు. అనంతరం 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, ఆర్డీవో రమేష్ రాథోడ్, ఎంపీడీవో వీరేశం, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనాయక్, ఆర్‌ఐ రాజు, ఏపీఎం దేవానంద్, ఏపీవో కుమారస్వామి, నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, కేతిరి లక్ష్మారెడ్డి, ఊసకోయిల ప్రకాష్, చిదురాల స్వరూప, జ్యోతి గ్రామైక్య సంఘం ప్రతినిధులు పోలు మౌనిక, పోలు రజిత, గాజుల విమల, సాతూరి రాణి తదితరులు పాల్గొన్నారు.

'గులాబీ' పండుగకు..

- రజతోత్సవ సభకు ముస్తాబవుతున్న ఎల్కతుర్తి
- 27న సభ.. నిర్వహణకు 1500ఎకరాల భూసేకరణ
- ఉమ్మడి వరంగల్ నేతలకు సభ బాధ్యతలు
- శాటిలైట్ ద్వారా పనులు పర్యవేక్షిస్తున్న అధినేత కేసీఆర్

7



ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

వరంగల్ మిల్క్ షెడ్‌కు మహర్దశ

- రూ.25 కోట్లతో విజయ డెయిరీ అభివృద్ధి
- ప్రభుత్వ పరిశీలనలో డీపీఆర్.. త్వరలో ఆమోదం..
- మిల్క్‌షెడ్ ఆధునీకరణతో లక్ష లీటర్ల పాల ఉత్పత్తి
- 25వేల మంది పాడి రైతులకు లబ్ధి

7

జల్సాల కోసం బైక్‌ల చోరీ

- జనగామ జిల్లాకు చెందిన యువకుడి అరెస్టు
- రూ.10లక్షల విలువైన 18 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ తిరుమల్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి పోలీసులు

వరంగల్ క్రైం/హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి) : జీవనోపాధి కోసం ఫుడ్ డెలివరీ బాయ్‌గా విధుల్లో చేరిన జనగామ జిల్లాకు చెందిన ఓ యువకుడు జల్సాల కోసం రద్దీ ప్రాంతాల్లోని ద్విచక్రవాహనాలను దొంగలించి చివరికి హసన్‌పర్తి పోలీసులకు చిక్కాడు. కాజీపేట ఏసీపీ తిరుమల్ తెలిపిన కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన గుగులోతు చందు(24) హనుమకొండ గోపాలపూర్‌లో నివాసం ఉంటూ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. దాని ద్వారా వచ్చే ఆదాయం జల్సాలకు సరిపడకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు రద్దీప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పథకం రచించాడు. ఈ క్రమంలో హనుమకొండ పీఎస్ పరిధిలో 7, హసన్‌పర్తి పీఎస్ పరిధిలో 3, కేయూసీ పీఎస్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు రాచకొండ కమి షనరేట్‌లోని ఉప్పల్ పరిధిలో 4, భువనగిరి పరిధిలో 2, హైదరాబాద్ పరిధిలో ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. అవకాశం వచ్చినప్పుడు వాహనాలను విక్రయించవచ్చు ని 18 వాహనాలను ఇంట్లో భద్రపరిచా డు. కాగా, బుధవారం ఉదయం హసన్‌పర్తి మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తు న్న నిందితుడు చందు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయతిస్తుండగా ఆదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.10లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నా రు. కాగా, నిందితుడిని పట్టుకొని వాహనా లను స్వాధీనం చేసుకోవ డంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ తిరుమ ల్, హసన్‌పర్తి సీఐ చేరాలు, ఎస్సై దేవేందర్, రవి, సిద్ధయ్య, ఏఏఓ సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ వివేకానంద, కానిస్టేబుళ్లు క్రాంతి కుమార్, తిరుపతయ్య, దేవేందర్, మహేందర్, రమేశ్, పూర్ణచారి, రాజ్ కుమార్, సోమన్న, నాగరాజు, నవీన్, ధనుంజయ్‌లను సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.


నీరుకుళ్లలో దెబ్బతిన్న వరి పంట


శాయంపేటలో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటిపై రేకులు

ఈదురుగాలుల బీభత్సం

- పరకాల డివిజన్‌లో దెబ్బతిన్న పంటలు
- నేలరాలిన మామిడి, భారీ వృక్షాలు

పరకాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండించి పంట దిగుబడులు చేతికొచ్చే సమయంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి ధాన్యం అమ్ముకునే దశలో మార్కెట్‌కు తీసుకొచ్చి రాశులు పోశారు. మిర్చి పంటలు ఏరి కల్లాల్లో రాశులుగా పోశారు. మొక్కజొన్న పూర్తిగా చేతికి వచ్చి కోసే సమయానికి అకాల వర్షంతో పూర్తిగా నేలపాలైంది. ఇలా పరకాల మండల పరిధిలో 130 ఎకరాల వరిపంట, 35ఎకరాల మొక్కజొన్న పంట నేలవాలినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన వారికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని రైతాంగం కోరుతోంది. ఈ సందర్భంగా పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆత్మకూరు మండలంలో.

ఆత్మకూరు : మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో చేతికి అందివచ్చిన మామిడి నేలరాలడంతో పాటు భారీ వృక్షాలు సైతం నేలకూలాయి. ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల, కటాక్షపురం, హౌజుబుజుర్గు, గూడెప్పాడ్ గ్రామాల్లోని మామిడికాయలు నేల రాలాయి. దీంతోపాటు భారీవృక్షాలు సైతం నేల కూలడంతో పలు గ్రామాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరుకుళ్లలో వరిపంటలు కూడా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో నీటి మునిగాయి. కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో సమాచారం అందుకున్న హార్టికల్చర్ అధికారి మధులిక బుధవారం ఉదయం పంటలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక అందించి నష్టపరిహారం అందే విధంగా చూస్తామని హార్టికల్చర్ అధికారి మధులిక తెలిపారు. కాగా, ఈదురు గాలులతో కూడిన భారీవర్షానికి నీరుకుళ్ల గ్రామంలో అన్నదాత ఫర్టిలైజర్స్‌కు సంబంధించి రేకులు గాలికి కొట్టుకుపోయాయి. దీంతో అందులోని ఎరువులు తడిసిపోయాయి. దీంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని ఇళ్ల రేకుల గాలికి ఎగిరిపోయాయి.

నడికూడ మండలంలో..

నడికూడ :నడికూడ మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం రాత్రి వీచిన గాలులకు, అకాల వర్షానికి చెట్లు ఒరిగిపోయాయి. రేకుల ఇండ్ల పై కప్పు ఊడిపోయాయి. మొక్కజొన్న చేను, మిరప చేన్లు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం వాతావరణం ఎండగా ఉండి, రాత్రి 10 తర్వాత బలమైన గాలులతో కూడిన వాన కురవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చేతికొచ్చిన ధాన్యం వర్షాలకు తడిసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


నడికూడలో గాలివానకు ఎగిరిపోయిన ఇంటి పైరేకులు

శాయంపేట మండలంలో..

శాయంపేట : మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా వాతావరణం మారడంతో ఇళ్ల పైకప్పులు లేచిపోయి, విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. శాయంపేట, గట్లకానిపర్తి, కొత్తగట్టు సింగారం, నేరేడుపల్లి, పెద్దకోడెపాక గ్రామాలలో 10 విద్యుత్ స్తంభాలు ధ్వంసమైయ్యాయి. వాటిని తిరిగి పునరుద్ధరించామని ఏఈ చందులాల్ తెలిపారు. అలాగే మైలారం, కొప్పుల, పత్తిపాక, హుస్సేన్‌పల్లి, పెద్దకోడెపాక, శాయంపేట, గట్లకానిపర్తి, తహరాపూర్, కొత్తగట్టు సింగారం గ్రామాలలో ఈదురుగాలులు, వర్షానికి 245 మంది రైతులకు చెందిన 347 ఎకరాల వరి 38 మంది రైతుల 57 ఎకరాల మొక్క జొన్న, 15 మంది రైతుల 30 ఎకరాల అరటితోట నేలకొరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి వెల్లడించారు. అలాగే మండల కేంద్రంలో ఏడుగురి ఇంటిపై కప్పు రేకులు, గట్లకానిపర్తిలో ఒకరి ఇంటి పైకప్పు రేకులు ఈదురు గాలులకు కొట్టుకుపోయాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

అధికారులు పంట నష్టాన్ని పరిశీలించాలి..

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో అకాల వర్షానికి రైతులు పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో రైతులు తమ పంటలకు పరిహారం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి పంట వివరాలు నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. అయితే 1 ఎకరంలో 33 శాతం పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందని, ప్రస్తుతమైతే పంట నష్టం జరుగలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలించడం లేదని, అందుకే రైతులకు పరిహారం అందించడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించి వివరాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నదాతకు అపార నష్టం

- ఆరుగాలం చేసిన కష్టం.. అకాల వర్షం పాలు
- నేలవాలిన మొక్కజొన్న, వరి పంటలు
- మార్కెట్ల ఆరబోసిన మక్కలు నీటిపాలు

నర్సంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలో అకాలవర్షం రైతులను తీరని దెబ్బతీశాయి. పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసుకున్న మొక్కజొన్నలు పూర్తిగా తడిసిపోయాయి. మార్కెట్‌కు సుమారు ఐదువేల క్వింటాళ్ల మొక్కజొన్నలు అమ్మకానికి వచ్చి ఉండవచ్చని అధికారులు తెలుపుతున్నారు. నర్సంపేట పట్టణానికి చెందిన రాపోలు నమ్మయ్య, ముత్యాలమ్మ తండాకు చెందిన బానోతుమోహన్, చెన్నారావుపేట మండలం గొల్లపల్లికి చెందిన ఇదిగాని సారంగం అనే రైతులతో పాటు మరికొంతమంది రైతుల మొక్కజొన్నలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. తడిసిన మొక్కజొన్న లను కొనుగోలు చేయడంతో పాటు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నర్సంపేట మండలంలో..

నర్సంపేట టౌన్: నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల భారీ వర్షంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని పర్శనాయక్‌తండా, మాధన్నపేట, గురిజాల, మహేశ్వరం, ముత్తోజిపేట, ఇటుకాలపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షంతో రైతుల వరి, మొక్కజొన్న పంటలు నేలవాలిపోయి తీవ్రంగా నష్టం కలిగింది. గాలి దుమారంతో పలు గ్రామాల్లోని చెట్లు పెంకుటిళ్లు, రేకుల ఇళ్లపై పడి ఇళ్లు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి అనేక గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి.

చెన్నారావుపేట మండలంలో..

చెన్నారావుపేట: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన బీభత్సంతో తీవ్ర నష్ట వాటిల్లింది. మండల కేంద్రంలో వరి పంటలు నేలవాలాయి. పలు గ్రామాల్లో చేతికి వరి పంటల వడ్లు నేలరాలాయి. మొక్కజొన్న అరబేసిన సంకటి చంద్రమౌళి అనే రైతు మొక్కజొన్నలు తడిసి వరుద నీటిలో కొట్టుకుపోయాయి, అలాగే మండలకేంద్రంలో విద్యుత్ తీగలపై చెట్టు కూలటంతో విద్యుత్ స్తంభాలు కూలాయి. పలు గ్రామాలకు రాత్రంతా కరెంటు సరఫరా నిలిచిపోయింది. మామిడి కాయలు నేలరాలాయి. అలాగే ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దుగ్గొండి మండలంలో..

దుగ్గొండి : దుగ్గొండి మండలంలో మంగళవారం రాత్రి వచ్చిన గాలివానతో వివిధ గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలకు భారీ నష్టం వాటిల్లింది. గాలి వానతో పంటలు నేలపై పడ్డాయి. చెట్లు విరిగి పడ్డాయి. రేకుల ఇండ్లు కొట్టుకుపోవడంతో పాటు చెట్లు ఇండ్లపై పడిపోయాయి. మండలంలోని పీజీ తండా ఇళ్ల రేకులు కొట్టుకుపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు, ఇళ్లపై చెట్లుపై విరిగిపడ్డాయి. నాచినపల్లి గ్రామంలో సీతారామాలయంలోని 40 ఫీట్ల ధ్వజస్తంభం విరిగి నేలపై పడిపోయింది.


నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలో చెట్టు కూలి ఇంటిపై పడడంతో ధ్వంసమైన చెక్క నాగరాజు ఇల్లు

ఖానాపురం మండలంలో..

ఖానాపురం: ఉరుములు, మెరుపులతో కురిసిన వడగండ్ల వర్షంతో మంగళవారం రాత్రి ఖానాపురం మండలంలోని పలు గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఈదుగాలులకు తోడు వడగండ్ల వర్షం కురవడంతో ఖానాపురం, మనుబోతులగడ్డ, బుధరావుపేట, అశోక్‌నగర్, దబీర్‌పేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల్లోని వరి పంటలు నేలవాలాయి. కోతకు వచ్చిన పొలాల్లో వరి గింజలు రాలిపోయాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నెక్కొండ మండలంలో..

నెక్కొండ: మండలంలో గాలివాన రాత్రి రైతులను ఆగమాగం చేశాయి. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన నాపల్లి శ్రీనివాస్, నాపల్లి భద్రమ్మలకు చెందిన ఇండ్లు ధ్వంసమైనట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. ఇళ్లలోని గృహోపకరణాలైన టీవీలు, ఫ్రిజ్, ఫ్యాన్లు, బట్టలు, వంట సామగ్రి, బియ్యం నీటిపాలయ్యాయి. మండలంలో ఆరు గంటలు విద్యుత్ సరఫరాకు అంత రాయం కలిగింది.

వర్ధన్నపేట మండలంలో..

వర్ధన్నపేట రూరల్: వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామ శివారులో గాలివానకు మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడ్డారు. రాయపర్తి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన బొల్లు యాదవరెడ్డి అనే రైతు దమ్మన్నపేట రెవెన్యూ శివారులో చెట్లకు ఉన్న మామిడికాయలు సైతం నేలరాలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

నల్లబెల్లి మండలంలో..

నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి తీవ్రమైన గాలివాన రావడంతో పలు గ్రామాల్లో మొక్కజొన్న తడిపోయింది. మిర్చి పంట తడిసి దెబ్బతింది. అలాగే విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగిపడ్డాయి. కొన్ని చోట్లు రేకులకు కిందపడ్డాయి. మొత్తంగా గాలి వాన బీభత్సంతో మండలంలో పంట నష్టం జరిగింది. పంట నష్టం జరిగిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

రాయపర్తి మండలంలో..

రాయపర్తి: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి అకాల వర్షం కురియడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కాపాడు కోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి వచ్చిన గాలివానతో కొండూరు, కొలన్‌పెల్లి గ్రామ శివార్లలో ఉన్న మామిడి తోటల్లోని మామిడికాయలు నేలరాలాయి.


తడిసిన మక్కజొన్నను చూపిస్తున్న రైతు


ఆడిటోరియాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

నేడు క్యాంపస్ కళాశాలలో సంబురాలు

- క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం
- కేయూ 50 వసంతాల వేడుకలకు ఏర్పాట్లు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు 19వతేదీకి కాకతీయ యూనివర్సిటీకి 50వసంతాలు నిండుతున్నాయి. ఈ స్వర్ణోత్సవ ఏడాదిని పురస్కరించుకుని గురువారం కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ ఏడాది ఆన్యువల్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ గాల - 2025 పల్స్ ఆఫ్ ది క్యాంపస్ పేరుతో సంబురాలను నిర్వహించనున్నారు. ఈ సంబురాలకు కేయూ క్యాంపస్ కళాశాల విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభంకానున్న సంబురాలకు గౌరవ అతిథులుగా ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ఇండియా కబడ్డీ జట్టు మాజీ హెడ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాసరెడ్డిలతో పాటు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హాజరుకానున్నారు. కేయూ ఆడిటోరియం వేదికగా సంబురాలు జరుగనుండగా అందుకు ఆడిటోరియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సాంస్కృతిక, వార్షికోత్సవ సంబరాల వివరాలను కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వార్షికోత్సవ అధ్యక్షుడు ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత బుధవారం వెల్లడించారు.

అధ్యాపకులతో కమిటీల ఏర్పాటు

కాకతీయ యూనివర్సిటీలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రూప్‌సాంగ్‌లు, కల్చరల్ ఈవెంట్లను సెనెట్ హాల్‌లో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. లిటరరీ కమిటీ, వ్యాసరచన పోటీల నిర్వహణ కమిటీ, పెయింటింగ్ కాంపిటేషన్ కమిటీ, రంగోళి కాంపిటేషన్ కమిటీ, పాటల పోటీల కమిటీ, కల్చరల్ కమిటీలను చైర్‌పర్సన్‌తో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లను సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేశారు.

కేయూ ఆడిటోరియంలో..

కాకతీయ యూనివర్సిటీ వార్షికోత్సవం, క్రీడోత్సవ, సాంస్కృతిక సంబురాలకు ఆడిటోరియాన్ని వేదికగా ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం ఉంటుంది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవంతోపాటు అతిథుల ప్రసంగాలుంటాయి. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక సంబురాలు నిర్వహిస్తారు. హోరాహోరీగా విద్యార్థుల తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. కన్నుల పండవగా ఉత్సవాన్ని జరిపేందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ నేతృత్వంలో విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విజేతలు వీరే..

- పురుషుల క్రికెట్ పోటీల్లో రాజనీతిశాస్త్ర విభాగం కెప్టెన్ యు.నరేశ్ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ విన్నర్‌గా నిలువగా, రన్నర్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగం కెప్టెన్ జి.శివకుమార్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు నిలిచారు.
- పురుషుల కబడ్డీ పోటీల్లో 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విద్యార్థుల జట్టు విన్నర్‌లు కాగా, రన్నర్‌లుగా మేథమెటిక్స్ విభాగం జట్టు నిలిచింది.
- మహిళల కబడ్డీ పోటీల్లో మ్యాథ్స్ విభాగం విద్యార్థులు జట్టు విన్నర్‌లు కాగా, రన్నర్‌లుగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం జట్టు నిలిచింది.
- పురుషుల వాలీబాల్ పోటీల్లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులు జట్టు విన్నర్‌లు కాగా, రన్నర్‌లుగా కెమిస్ట్రీ విభాగం జట్టు నిలిచింది.
- మహిళల సింగిల్ షటిల్ పోటీల్లో బయటెక్నాలజీ విభాగం స్టూడెంట్ కంచరకుంట్ల పల్లవి విన్నర్ కాగా, రన్నర్‌లుగా మ్యాథ్స్ విభాగం స్టూడెంట్ ముప్పు శ్రీనిజ నిలిచారు.
- పురుషుల సింగిల్ షటిల్ పోటీల్లో జియాలజీ విభాగం స్టూడెంట్ అలేం రాహుల్ విన్నర్ కాగా, రన్నర్‌లుగా ఎంటీఎం విభాగం స్టూడెంట్ ఎర్రోళ్ళ రవి నిలిచారు.
- పురుషుల డబుల్స్ షటిల్ పోటీల్లో జియాలజీ విభాగం స్టూడెంట్స్ అలేంరాహుల్, దేశగాని వంశీ విన్నర్ కాగా, రన్నర్‌లుగా ఎంటీఎం విభాగం స్టూడెంట్స్‌హరివేణుల సామ్యూల్‌నిరేక్షణ్, ఎర్రోళ్ళరవిలు నిలిచారు.
- మహిళల డబుల్స్ షటిల్ పోటీల్లో మైక్రోబయోలజీ విభాగం స్టూడెంట్స్ పటోళ్ళ కీర్తనరెడ్డి, బోగుడమీది శరణ్యలు విన్నర్ కాగా, రన్నర్‌లుగా మ్యాథ్స్ విభాగం స్టూడెంట్స్ దాసరి సిరి, ముప్పు శ్రీనిజలు నిలిచారు.
- పురుషుల సింగిల్ టేబుల్ టెన్నిస్ సింగల్స్ పోటీల్లో మైక్రోబయోలజీ విభాగం స్టూడెంట్ హనుమకొండ రఘువర్ధన్ విన్నర్ కాగా, రన్నర్‌లుగా బయోటెక్నాలజీ విభాగం స్టూడెంట్ అల్లం గోపీచంద్ నిలిచారు.
- మహిళల సింగల్ టెబుల్ టెన్నిస్ పోటీల్లో బయోటెక్నాలజీ విభాగం స్టూడెంట్ బోస్లం జి విన్నర్ కాగా, రన్నర్‌లుగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం స్టూడెంట్ ఎం.పరిమళ నిలిచారు.
- మహిళల టెన్నికాయిట్ డబుల్స్ పోటీల్లో బయోటెక్నాలజీ విభాగం స్టూడెంట్స్ జాదవ్ సుమిత, గంగారం హైమావతిలు విన్నర్ కాగా, రన్నర్‌లుగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం స్టూడెంట్స్ ముదిర పరిమళ, నిట్టురి మాదవిలు నిలిచారు.
- చెస్ సింగల్ పురుషుల విభాగంలో అప్లీడ్ మ్యాథమెటిక్స్ స్టూడెంట్ గడ్డం ప్రమోద్ విన్నర్‌గా నిలువగా, ఎకానమిక్స్ విభాగం స్టూడెంట్ ధరావత్ నవీన్ రన్నర్‌గా నిలిచారు.
- మహిళల విభాగంలో 100 మీటర్ల పరగు పందెంలో బాటనీ విభాగం కె.శ్రావణి, జి.ప్రత్యూష, ఎం.పరిమళలుగా నిలువగా, పురుషుల విభాగంలో రాజనీతిశాస్త్ర విభాగం స్టూడెంట్ ఎ.నరేశ్, ఆర్.రవీందర్, ఎస్.అరవింద్‌లు నిలిచారు. అలాగే 400 మీటర్ల విభాగంలో మహిళలు విభాగంలో హిస్టరీ జి. సుకన్య, మైక్రోబయోలజీ పి.ప్రత్యూష, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎం.పరిమళలు నిలువగా, పురుషుల విభాగలో కెమిస్ట్రీ ఎస్.అరవింద్, జర్నలిజం బి.గణేశ్, రాజనీతిశాస్త్రం ఎ.నరేశ్‌లు నిలిచారు. అలాగే 800 మీటర్ల పరుగు పందెంలో మహిళల విభాగంలో హిస్టరీ జి.సుకన్య, మైక్రోబయోలజీ పి.యమున, జి.అనితలు నిలువగా పురుషుల విభాగంలో రాజనీతిశాస్త్రం ఈ.యాదగిరి, జియాలజీ జి.సుమన్, రాజనీతిశాస్త్రం ఎ.నరేశ్‌లు నిలిచారు. అలాగే హైజంప్, షాట్‌పుట్‌లలోనూ విజేతలుగాపలువురు విద్యార్థులు గెలుపొందారు.
- సాంస్కృతిక విభాగంలో క్విజ్, సోలో డ్యాన్స్, క్లాసికల్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, గ్రూప్‌డ్యాన్స్, పాటల పోటీలు, రంగోళి, వ్యక్తృత్వ పోటీలు, వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లోనూ పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరందరికీ బహుమతుల ప్రదానోత్సవం జరుగుతోంది.

అత్తా కోడళ్లం కలిసే ఉన్నాం..

- పాలకుర్తిని విడిచిపెట్టి ఎక్కడి వెళ్లం..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం..
- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి



పాలకుర్తిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పక్కన ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తాము ఎలాంటి గొడవలు లేకుండా కలిసే ఉన్నామని, కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే బీఆర్‌ఎస్ నాయకులను తరిమికొడుతామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలను సంపాదించిన మాజీ మంత్రి దయాకర్‌రావు అమెరికాలో పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. దయాకర్‌రావు అనుచరులు కొంత మంది అత్తా కోడళ్ల మధ్య గొడవలు వచ్చాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇక నుంచి సహించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కోవర్టులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల అభివృద్ధికి రీ ఎస్టీమేషన్ చేసి రూ.1015 కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లుపేర్కొన్నారు. ఈ రెండురిజర్వాయర్లను నిర్మించి పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. నిరంతర విద్యుత్ అందించేందుకు చిన్నమడూరులో రూ.130కోట్లు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. తొర్రూరులో వంద పడకలకు, పాలకుర్తిలో ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసి టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, నెమురుగొమ్ముల ప్రవీన్‌రావు, ఎర్రబెల్లి రాఘవరావు, యాకాంతరావు, బిల్లా సుధీర్‌రెడ్డి, చిలువేరు కృష్ణమూర్తి, హమాక్య నాయక్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, బొమ్మగాని భాస్కర్, మదార్ ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7325	5300
మక్కలు (బిల్టీ రకం)	2110	1521
కందులు	6433	3022
పెసళ్లు	7410	3022
పల్లికాయ (సూక)	6300	5200
పల్లికాయ (పచ్చిది)	4150	3575
పసుపు (కాడి)	14209	10534
పసుపు (గోల)	13109	9700
తేజ మిర్చి	12200	9500
వండర్‌హాట్	12000	10000
యూఎస్341	10800	9000
దీపిక	12000	10000
దేశీ	27000	18000
సింగిల్ పట్టి	20500	20000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

అప్రమత్తతే ముద్దు..

● ఎండల వేళ అగ్నిప్రమాదాలకు అవకాశాలెక్కువ.. ●

- నియంత్రణకు కృషి చేస్తున్న అగ్నిమాపక విభాగం
- ఈనెల 20వరకు వారోత్సవాల నిర్వహణ





అగ్ని ప్రమాదంలో మంటలు ఆర్పి వేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ప్రమాదానికి ప్రధాన కారణాలివే..

గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు నివాస గృహాలకు దగ్గరగా ఉండడం, సిగరెట్, బీడీలు తాగుతూ పూర్తిగా ఆర్పకుండా విసిరేయడంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఓవర్‌లోడ్ నాసిరకం విద్యుత్ ఉపకరణాలు వినియోగించిన దుకాణాలు, షాపింగ్‌మాళ్లు, బహుళ అంతస్తుల భవనాల్లో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది. వంటగదిలో గ్యాస్ లీకేజీ, గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

వర్ధన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరిగేందుకు ఆస్కారం ఉన్న సమయం. ఈ క్రమంలో 'సేవే మా కర్తవ్యం' అనే నినాదంతో విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అగ్నిప్రమాదాల నివారణకు కృషి చేస్తోంది. సాధారణ రోజుల కన్నా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయని, భారీగా ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం జరిగే అవకాశాలుంటాయన్న విషయాలను తెలియజేస్తూ ప్రజలను అప్రమత్తం చేసేలా ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా ఏప్రిల్ 14 నుంచి 20వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో అగ్నిమాపక శాఖ కేంద్రాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కరపత్రాల పంపిణీ, ర్యాలీలు, ప్రధాన కూడళ్లలో మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. అలాగే విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

వార్షికోత్సవం ఎందుకంటే..

1944 ఏప్రిల్ 14న ముంబయిలో విక్టోరియా డాక్ యార్డులో అగ్ని ప్రమాదం సంభవించి 66 మంది అగ్ని మాపక సిబ్బంది, సుమారు 800 మంది ప్రజలు మృతి చెందారు. వారి స్మారకార్థం జాతీయ అగ్ని మాపక దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది.

అగ్నిమాపక సిబ్బంది సేవలు



అగ్ని మాపక దళం కేవలం అగ్ని ప్రమాదాల నివారణకు మాత్రమే పని చేస్తుందని అనుకుంటాం... కానీ ప్రమాద సమయంలోనే కాకుండా వరదలు, రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే దగ్గరలోని అగ్ని మాపక కేంద్రానికి సమాచారమిచ్చి సహాయాన్ని కోరవచ్చు.

విస్తృత అవగాహన కల్పిస్తున్నాం..



అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారం పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాం. ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలను వివరిస్తూనే ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలో వివరిస్తాం. వేసవిలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- చొల్లేటి జైపాల్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

షాపింగ్‌మాల్స్ ఆస్పత్రులు, విద్యాసంస్థల నిర్మాణాల్లో ఫైర్ అలారంతో పాటు స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. ఆటోమేటిక్ స్ప్రింకర్లను ఉపయోగించుకోవాలి. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ ఉపకరణాలనే ఉపయోగించాలి. ప్రమాదాలను తప్పించుకునేందుకు వీలుగా బయటికి వెళ్లే మార్గాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలి.

వంటగదిలో గ్యాస్‌తో జాగ్రత్తలు

వంటింటి కింద, పైభాగంలో గాలి వెలుతురు ఉండేలా చూడాలి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌లను వాడొద్దు. ఐఎస్ఐ మార్కు ఉన్న వాటినే వాడాలి. గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆపివేయాలి. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లను ఉంచొద్దు.

మండు టెండలో..

మంచి నేస్తాలు..



- ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ ప్రదాత తాటి ముంజలు
- కల్తీ లేకుండా లభించే పకృతి ఆహారం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి ప్రసాదించే ఔషధ గుణాలున్న ఆహార పదార్థాల్లో తాటి ముంజలు ముందు వరుసలో ఉంటాయి. మండుటెండల్లో ప్రజలకు మంచి నేస్తాలుగా చలువదనాన్ని అందిస్తుంటాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఇష్టంగా తీసుకునే ఈ తాటి ముంజలు ప్రస్తుతం విరివిగా లభిస్తున్నాయి. ఎలాంటి రసాయనాలు, కల్తీ లేకుండా.. నోట్లో వేసుకోగానే కరిగిపోయే గుజ్జు, కొబ్బరి నీటిని మరిపించే తీయదనాన్ని అందించే స్వచ్ఛమైన తాటిముంజలను తినేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడతారు. వేసవి సెలవుల్లో పట్నం నుంచి పల్లెటూర్లకు వెళ్లే ప్రతీ ఒక్కరు వీటి రుచి చూడకుండా ఉండలేరు. పూర్వం రోజుల్లో గీత కార్మికులు ఊర్లలోని రైతులకు, ఆసాములకు ఉచితంగా ఈ తాటిముంజలను ఇచ్చేవారు. కానీ నేడు తాటి ముంజలను వారికి సమీపంలో ఉన్న పట్టణాలు, నగరాలకు తీసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజ లవణాలను సమన్వయ పర్చడంలో కీలక భూమిక పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తాటిముంజలతో ఎన్నో ప్రయోజనాలు..

వేసవి కాలంలో తాటి ముంజలను క్రమం తప్పకుండా తీసుకోవడం అధిక కొలెస్ట్రాల్‌ను నిరోధిస్తుంది. పోటాషియం సమృద్ధిగా ఉండటంతో రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులను దరిచేరకుండా నియంత్రిస్తుంది. ఇవి శరీరంలో హానికర వ్యర్థ పదార్థాలను తొలిగించడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే తాటి ముంజలు తినడం ద్వారా జీర్ణ సంబంధ సమస్యలు దరిచేరవు. ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, కడుపులో మంట, ఉబ్బడం లాంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అదే విధంగా నీటి శాతం ఎక్కువగా ఉండే గాటి ముంజలు స్వీకరించడం ద్వారా వడదెబ్బను ఉపశమనం పొందడమే కాకుండా వీటిలో ఫైబర్, పొటాషియం, కాల్షియం, జింక్, ఐరన్, లాంటి విటమిన్లు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ఎండలో వేడిమి తాపానికి వచ్చే వికారం, వాంతులను నివారిస్తూ, మానవ శరీరంలోని ఉష్ణోగ్రతలను తగ్గించి, డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. ఇన్ని రకాల పోషక విలువలు కలిగిన తాటి ముంజలను తినేందుకు నగర ప్రజలతో పాటు పల్లెటూరి వాసులు ఆసక్తి చూపుతున్నారు.



వడ్డేపల్లి జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు

గీత కార్మికులకు ఉపాధిగా..

గీత కార్మిల కుల వృత్తి కల్లు గీయడం. నాడు పల్లెటూర్ల లోని రైతులు, వ్యవసాయదారులు, ఆసాములు పొద్దంత పనికి వెళ్లి సాయంత్రం వేళల్లో వారి పనులను ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో ఊరి లోని గౌడు వద్ద కల్లును తాగి సేద తీరేవారు. అలా వారు వాడిక పద్ధతిలో నిత్యం కల్లు తాగినందుకు ఏడాదికోసారి, లేదంటే పంట చేతికి వచ్చినప్పుడు గీత కార్మికులకు డబ్బు చెల్లించేవారు. అలాంటి రైతులు, ఆసాములకు గీత కార్మికుడు వేసవి కాలంలో లభించే తాటి ముంజలను ఉచితంగా ఇచ్చేవారు. కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో వాడిక పద్ధతి అంతగా లేదు. దీంతో గీతకార్మికులు తాటి ముంజలను సమీప పట్టణాలు, నగరాలకు తీసుకెళ్లి విక్రయిస్తూ కొంతమేర ఉపాధిని పొందుతున్నారు. పట్టణ, నగర వాసులు కూడా ప్రకృతిసిద్ధమైన, సీజనల్‌గా దొరికే ఈ తాటిముంజలను కొనేందుకు ఇష్టపడుతున్నారు.

వరంగల్ మిల్క్‌షెడ్‌కు మహర్దశ

- ప్రభుత్వ పరిశీలనలో డీపీఆర్.. త్వరలో ఆమోదం
- మిల్క్‌షెడ్ ఆదునీకరణతో లక్ష లీటర్ల పాల ఉత్పత్తి
- 25వేల మంది పాడి రైతులకు లబ్ధి

రూ.25 కోట్లతో విజయ డెయిరీ అభివృద్ధి



హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద గల విజయ డెయిరీ వరంగల్ మిల్క్ షెడ్

హనుమకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని విజయ డెయిరీ వరంగల్ మిల్క్‌షెడ్‌కు త్వరలో మహర్దశ పట్టనున్నది. ఇన్నాళ్లు పలు సమస్యలు, సాంకేతికపరమైన ఇబ్బందులతో కూనారిల్లుతున్న ఈ మిల్క్‌షెడ్‌ను అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. పరిమిత వనరుల దృష్ట్యా బహిరంగ మార్కెట్‌లో ప్రైవేటు డెయిరీలతో సమానంగా పోటీపడలేక సతమతమవుతున్న ఈ వరంగల్ పాల ఉత్పత్తి కేంద్రాన్ని అత్యాధునిక టెక్నాలజీతో ఆధునీకరించి ప్రజలకు సకాలంలో మరింత నాణ్యమైన పాలను పంపిణీ చేసే దిశగా రూ.25 కోట్లతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు సిద్ధమవుతోంది. నివేదిక ప్రాతిపదికగా క్షేత్ర స్థాయిలో సాధ్యాసాధ్యాల పరిశీలనకు విజయ డెయిరీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన నిపుణుల బృందం త్వరలో ఈ మిల్క్‌షెడ్‌ను సందర్శించనున్నది. అనంతరం డీపీఆర్‌కు ఆమోదం లభించే అవకాశాలు మెండుగా ఉన్నట్టు తెలుస్తోంది. వరంగల్ మిల్క్‌షెడ్‌ను అభివృద్ధి చేయాలన్న వరంగల్ పాడిరైతుల అభ్యర్థనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఆ దిశగా అధికారులు చకచకా చర్యలు తీసుకుంటున్నారు.

ఆరు దశాబ్దాల చరిత్ర

విజయ డెయిరీ వరంగల్ పాల ఉత్పత్తి కేంద్రానికి ఆరు దశాబ్దాల అపూరూపమైన చరిత్ర ఉంది. ఉమ్మడి వరంగల్‌లో ఏర్పాటైన తొలి పాల ఉత్పత్తి కేంద్రం. హనుమకొండలోని అలంకార్ జంక్షన్ సమీపంలో 5 ఎకరాల 25 గుంటల స్థలంలో 1968లో ఈ మిల్క్‌షెడ్ ఏర్పాటైంది. అప్పట్లో ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ ఈ మిల్క్‌షెడ్ ద్వారానే పాల సరఫరా జరిగేది. ఆ రోజుల్లో విజయ పాలు అంటే ఎంతో క్రేజ్ ఉండేది. 60 ఏళ్ల కిందట సాగునీటి సరఫరా లేక వ్యవసాయం భారమైన పరిస్థితుల నేపథ్యంలో పాడి పరిశ్రమను నమ్ముకున్న వేలాది మంది రైతులకు ఈకేంద్రం అండగా నిలిచింది. పెరిగిన పాల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని 1971లో గంటలకు ఆరువేల సీసాల్లో పాలు నింపగల బాట్లింగ్ ప్లాంట్‌ను నెలకొల్పారు. తదనంతర కాలంలో పాల సీసాలు పోయి పాలప్యాకెట్లు వచ్చాయి. దీనితో 1984లో ప్యాకెట్ల తయారీ యంత్రాలను నెలకొల్పారు. 2014 వరకు వరంగల్ మిల్క్ షెడ్ విజయవంతంగా నడిచింది. ఆ తర్వాత ఈ ప్లాంట్‌కు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వ ఉదాసీనత, పాతపడిన మిషన్లు, మార్కెట్‌లో ప్రైవేటు డెయిరీల పోటీతో నిలదొక్కుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత విజయ డెయిరీకి మంచి రోజులు వస్తాయని భావించినప్పటికీ ఆ కలలు కల్లలే అయ్యాయి. విజయ డెయిరీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డెయిరీలుగా విడిపోయాయి. కొన్ని ప్రైవేటు డెయిరీలు ఆంధ్రప్రదేశ్ విజయ డెయిరీపేరుతో నకిలీ పాలను విక్రయించడం మొదలు పెట్టడంతో ఆ ప్రభావం విజయ డెయరీ వరంగల్ పాల ఉత్పత్తి కేంద్రంపై కూడా పడింది. దీంతో ఈ కేంద్రంలో పాల ఉత్పత్తి 25వేల లీటర్ల నుంచి ప్రస్తుతం 12వేల లీటర్లకు పడిపోయింది. మిషన్లు పాతపడి పోవడంతో ఉత్పత్తి సామర్థ్యం తగ్గింది. తత్ఫలితంగా మార్కెట్‌లో పాల అమ్మకాల్లో వెనుకబడిపోయింది. ప్లాంట్ పరిస్థితి క్రమంగా క్షీణిస్తూ వచ్చింది.

రూ.25 కోట్లతో విస్తరణ

ఈ పరిస్థితుల నేపథ్యంలో వరంగల్ మిల్క్‌షెడ్‌ను ఆదునీకరించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. హనుమకొండ జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘాలు ఈ విషయాన్ని పలుసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో విజయ కాకతీయ పాల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్ రావు నేతృత్వంలో పాడిరైతులు వరంగల్ మిల్క్‌షెడ్‌ను రూ.25కోట్లతో అభివృద్ధి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని నరేందర్ రెడ్డి సీఎం దృష్టికి తీసుకువచ్చారు. సీఎం ఈ అభ్యర్థనను విజయ డెయిరీ ఎం.డి.కి పంపారు. స్పందించిన ఎం.డి. ఈ ప్రతిపాదనకు సంబంధించి డీపీఆర్‌ను తయారు చేసే క్రమంలో వరంగల్ మిల్క్‌షెడ్ డిప్యూటీ డైరెక్టర్ నుంచి సాధ్యాసాధ్యాల నివేదిక (ఫీజుబుల్ రిపోర్టు)ను కోరారు. డీడీ ఈ మేరకు పూర్తి వివరాలతో రిపోర్టును పంపారు. ప్రస్తుతం ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మిల్క్‌షెడ్‌ను విజయ డెయిరీ ఇంజనీరింగ్ విభాగం నిపుణుల బృందం క్షేత్ర స్థాయి సందర్శన అనంతరం దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. వరంగల్ మిల్క్‌షెడ్ విస్తరణకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు సమాచారం.



మిల్క్‌షెడ్‌లోని పాల శీతలీకరణ కేంద్రం

విస్తరణలో భాగంగా..

వరంగల్ మిల్క్‌షెడ్ ఆధునీకరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న పాత యంత్రాల స్థానే అత్యాధునిక సాంకేతికతో కూడిన మిషనరీని ఏర్పాటు చేస్తారు. రోజుకు లక్ష లీటర్ల మేరకు పాలను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో పాల సేకరణ పెరిగి తద్వారా సుమారు 25వేల మంది పాడి రైతులకు లబ్ధిచేకూరగలదని అంచనా వేస్తున్నారు. పాలతో పాటు వివిధ రకాల పాల ఉత్పత్తులు కూడా పెరుగుతాయి. ఆ మేరకు మార్కెటింగ్ పెరుగుతుంది. మిల్క్‌షెడ్‌లో ప్రస్తుతం చాలినంత స్థలం అందుబాటులో ఉంది. విస్తరణలో భాగంగా కొత్త ప్లాంట్లను నెలకొల్పుతారు. కొత్త భవనాలు, షెడ్లను నిర్మిస్తారు. రైతుల నుంచి పాల సేకరణతో పాటు పాల ఉత్పత్తిలో రైతులకు మరిన్ని మెళకువలు నేర్పేందుకు, పాడి పశుపోషణకు కావలసిన దాణా, పాడి పరిశ్రమ అభివృద్ధి పథకంలో భాగంగా పాడి రైతులకు పాడి పశువుల పంపిణీ తదితర కార్యకలాపాలను కూడా ఈ షెడ్ ద్వారానే నిర్వహిస్తారు.

హోమిజీనైజర్‌కు మరమ్మతులు

వరంగల్ మిల్క్‌షెడ్‌లో ప్రస్తుతం చెడిపోయిన హోమిజీనైజర్ (పాలశుద్ధీకరణ యంత్రం)కు త్వరలోనే మరమ్మతులు చేయబోతున్నారు. పాలలోని వెన్నను విడగొట్టడం ద్వారా నాణ్యతను పెంచడంలో ఈ యంత్రం కీలకంగా పనిచేస్తుంది. ఈ యంత్రం అత్యంత ఖరీదైంది. కొద్దినెలలుగా ఈ యంత్రం పనిచేయకపోవడం వల్ల ఈ కేంద్రంలో పాలశుద్ధీకరణ, పాల ప్యాకింగ్ నిలిచిపోయింది. ఈ కేంద్రానికి వచ్చే పాలను ప్రతీరోజు హైదరాబాద్‌లోని విజయ డెయిరీ పాలశీతలీకరణ కేంద్రానికి పంపాల్సి వస్తోంది. దీని వల్ల రవాణాపరంగా ఖర్చు పెరగడమే కాకుండా ఇబ్బందులు కూడా కలుగుతున్నాయి. ఈ ప్రభావం పాల నాణ్యత, పంపిణీపై కూడా పడుతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా మహబూబ్‌నగర్‌లోని పాలశీతలీకరణ కేంద్రం నుంచి పాలశుద్ధీకరణ యంత్రాన్ని తీసుకువచ్చినప్పటికీ అది కూడా పని చేయడం లేదు. దీనికి కూడా కొంత మరమ్మతు అవసరమైంది. అత్యంత విలువైన ఈ యంత్రం మరమ్మతుకు ఢిల్లీ, పూణె నుంచి టెక్నీషియన్లను రప్పిస్తున్నారు. త్వరలోనే మరమ్మతులు జరగనున్నాయి.

ఫీజుబులిటీ రిపోర్టు పంపించాం..



హనుమకొండలోని విజయ డెయిరీ వరంగల్ విల్క్ షెడ్ ఆధునీకరణ కోసం ఫీజుబులిటీ రిపోర్టును పంపాం. ప్రస్తుత మిల్క్‌షెడ్ ఉత్పత్తి సామర్థ్యం, షెడ్‌లోని యంత్రాల పరిస్థితి, అందుబాటులో ఉన్న స్థలం, ఉత్పత్తి సామర్థ్యం, మార్కెటింగ్ గల అవకాశాలు తదితర అన్ని వివరాలతో నివేదికను అందచేశాం. విజయ డెయిరీ ఇంజనీరింగ్ విభాగం ఈ మేరకు డీపీఆర్‌ను సిద్ధం చేసింది. రూ.25కోట్ల అంచనా వ్యయంతో రోజుకు లక్ష లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా మిల్క్‌షెడ్ విస్తరణ జరగనున్నది. షెడ్ విస్తరణతో పాడి రైతులకు మిరంత లబ్ధి చేకూరనున్నది. మిల్క్‌షెడ్‌లోని పాలశుద్ధీకరణ యంత్రం (హోమిజోనైజర్)కు త్వరలో మరమ్మతులు జరగనున్నాయి. ఢిల్లీ, పూణె నుంచి టెక్నీషియన్లు రావలసి ఉన్నది. విజయ డెయిరీ పేరుతో మార్కెట్‌లోకి వస్తున్న నకిలీ బ్రాండ్ పాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ శ్రవణ్ కుమార్, వరంగల్ మిల్క్‌షెడ్ డిప్యూటీ డైరెక్టర్

గులాబీ పండుగకు..

- రజతోత్సవ సభకు ముస్తాబవుతున్న ఎల్కతుర్తి
- 27న సభ.. నిర్వహణకు 1500ఎకరాల భూసేకరణ
- ఉమ్మడి వరంగల్ నేతలకు సభ బాధ్యతలు
- శాటిలైట్ ద్వారా పనులు పర్యవేక్షిస్తున్న అధినేత కేసీఆర్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 'గులాబీ' పండుగకు ఎల్కతుర్తి ముస్తాబవుతోంది. బీఆర్ఎస్ 25వసంతాల వేడుకల నేపథ్యంలో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు పనులు చకచకా సాగుతున్నాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలు, సూచనలతో సభ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి వరంగల్ నేతలు ఎప్పటికప్పుడు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దీంతో మూడు జిల్లాలకు ముఖ ద్వారంగా ఉన్న ఎల్కతుర్తిలో సందడి వాతావరణం కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల సరిహద్దులోని అతి చిన్న మండల కేంద్రమైన ఎల్కతుర్తి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి జిల్లాల విభజనలో భాగంగా హనుమకొండ జిల్లాలో విలీనమైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లాలైన ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు సరిహద్దులో ఉన్న ఎల్కతుర్తిలో 25సంవత్సరాల గులాబీ పండుగను జరుపుకోవడానికి సిద్ధమైంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాలతో సభ నిర్వహణకు ఈనెల 2న అంకురార్పణ జరిగింది. నాటి నుంచి బీఆర్ఎస్‌నేతల రాకతో ఎల్కతుర్తికి కొత్తదనం సంతరించుకుంది.

500 ఎకరాల భూమి సేకరణ

బీఆర్ఎస్ రజతోత్సవ సభ, పార్కింగ్ కోసం ఎల్కతుర్తి, చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులు 1500 ఎకరాల భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. సభ స్థలికి 500 మీటర్ల దూరంలో పార్కింగ్ స్థలాలను చదును చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి చింతలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో 169 ఎకరాలను సభ నిర్వహణకు కేటాయించారు. సభాస్థలి ఇన్‌చార్జ్‌లుగా రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ మీదుగా వచ్చే వాహనాల పార్కింగ్‌కు సుర వైన్స్ పరిసర ప్రాంతంలో 550 ఎకరాలు, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట వైపు నుంచి వచ్చే వాహనాల కోసం ఎల్కతుర్తి నుంచి హస్నాబాద్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని 700ఎకరాలు, ధర్మసాగర్ మీదుగా ఎల్కతుర్తి వచ్చే దారిలో మరో 81 ఎకరాలను పార్కింగ్‌కు కేటాయించారు. వీటికి ఇన్‌చార్జ్‌లుగా ఎమ్మెల్సీలు తక్కళ్ళపెల్లి రవిందర్‌రావు, రాకేష్‌రెడ్డి, నిమ్మగడ్డ వెంకన్న వ్యవహరిస్తున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి మూడు వైపులా జాతీయ, రాష్ట్ర రహదారులు ఆనుకుని ఉండడంతో ట్రాఫిక్ జామ్ కావడానికి ఎలాంటి ఆస్కారం లేదంటున్నారు బీఆర్ఎస్ నాయకులు.

300ఎల్‌ఈడీ స్క్రీన్లు.. 400కేవీ విద్యుత్

సభా స్థలంతో పాటు వాహనాల పార్కింగ్ స్థలాలను కలుపుకుని 300వైర్‌లెస్ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నారు. 400 కిలోవాట్స్ సామర్థ్యం గల జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 50వేలకు పైగా వాహనాలు సభకు రానున్నట్లు అంచనా వేశారు. వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద సైతం ఎల్ఈడీ స్క్రీన్‌లతో పాటు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. వాహనాల భద్రత కోసం విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

15 లక్షల మజ్జిగ, 15 లక్షల వాటర్ ప్యాకెట్లు

సభకు రాష్ట్ర వ్యాప్తంగా తరలిరానున్న ప్రజలను దృష్టిలో పెట్టుకుని సభ స్థలితోపాటు పార్కింగ్ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 15 లక్షల మజ్జిగ, 15 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు నాయకులు తెలిపారు. అలాగే సభ సమీపంలో తాత్కాలికంగా 20పడకలతో ఆస్పత్రి, ప్రధాన రహదారుల్లో నాలుగు వైపులా నాలుగు అంబులెన్స్‌లు, నాలుగు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు.

ప్రముఖల పర్యవేక్షణలో సభ

బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణ ఏర్పాట్లు ప్రముఖుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. నిత్యం హనుమకొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, రాష్ట్ర నాయకుడు బాలమల్లు పర్యవేక్షణలో శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. సభకు వచ్చే ప్రజలకు సభ స్థలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వందలాది మంది కూలీలతో సభ స్థలాన్ని చదును చేయిస్తున్నారు.



ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్

శాటిలైట్ ద్వారా కేసీఆర్ పర్యవేక్షణ

ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించే రజతోత్సవ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శాటిలైట్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సభ స్థలంలో జరిగే పనులపై నాయకులకు సూచనలు చేస్తున్నారు. వీడియో కాల్ ద్వారా పరిసరాలను పరిశీలిస్తున్నారు. జరిగిన పనులు, చేపట్టాల్సిన పనులపై ఆరా తీస్తున్నారు. లక్షలాదిగా తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేలా సూచనలు చేస్తున్నారు.

ప్రజలను మోసగించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య

మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మోసగించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్న విషయం మరో సారి రుజువైందని బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో రజతోత్సవ సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మార్పు తీసుకవస్తామని మోస పూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి మార్పు తీసుకొచ్చారని మండిపడ్డారు. మార్పు అంటే విగ్రహాన్ని మార్చినంత సులువు కాదని ప్రజల జీవితాల్లో జరగాలన్నా రు. అమలుకు నోచుకోని మోస పూరిత హామీలతో పేద, గిరిజన, దళితులకు అన్యాయం జరిగిందన్నారు. 27న ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ఏం ప్రసంగిస్తారోనని కోట్లాది మంది ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. 14 ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి సకల జనుల మద్దతుతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు బీఆర్ఎస్ శ్రేణులు కరుడు కట్టిన సైనికుల్లా పోరాడాలన్నారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత వాగ్దానాలకు గురయ్యామని గుర్తించిన ప్రజలు తిరిగి కేసీఆర్ అధికారంలోకి రావాలని బలంగా కోరుకుంటున్నారన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సదానందం, బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, నరేందర్, భరత్‌కుమార్, నాగుర్ల వెంకన్న, బాలమల్లు, వాసుదేవరెడ్డి, పిట్టల మహేందర్, మేకల స్వప్న, కడారి రాజు, నగేష్, మహేందర్, మునిగడప శేషగిరి, రాజ్‌కుమార్, వీరలింగం, సాంబమూర్తి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్ కూడా సభ ఏర్పాట్లను పరిశీలించారు.

రాజీవ్ యువ వికాసం గడువు పెంచాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం గడువును పెంచి బ్యాంకు లింకేజీ లేకుండా దరఖాస్తు దారులకు రుణాలను అందించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లి చర్చి ప్రాంతంలోని మైత్రి నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ శాఖ పదేళ్లుగా నిధులు విడుదల చేయకుండా యాక్షన్ ప్లాన్ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకాన్ని బ్యాంకు లింకేజీ లేకుండా చిత్తశుద్ధితో రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చుంచు రాజేందర్ కోరారు. సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, కొమ్ముల కరుణాకర్, మేకల అనిత, చుంచు నరేష్, కిరణ్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో ఘనంగా పోషణ్ అభియాన్

హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్-1వ డివిజన్ పరిధి ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వీసం ఉమాదేవి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు అందించే పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ హైమావతి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మడికొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం భట్టుపల్లి, కొత్తపల్లి, కడిపికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాదాసి బాబు, మాజీ చైర్మన్ గంగుల శ్రీనివాసరెడ్డి, ఇనుగాల రజనీకర్‌రెడ్డి, పోలెపాక వెంకటస్వామి, కంకాల సంపత్‌రెడ్డి, నాగపురి శ్రీకాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి రమేష్, పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గురువారం నిర్వహించ తలపెట్టిన పార్ట్‌టైమ్ అధ్యాపకుల చలో సెక్రటేరియట్ పోస్టర్‌ను బుధవారం కేయూలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం నేతలు ఆవిష్కరించారు. కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ కె.నాగేశ్వర్‌రావు, చీఫ్ అడ్వయిజర్ ఎంకే సుమంత్, డాక్టర్ ఓ.మోహన్, శ్యామ్ సుందరాచారి, పి.శ్రీనివాస్, విష్ణు, జ్యోత్స్న, శ్రీవిద్య రామజ్యోతి, మమత, దామోదర్, మణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

వరంగల్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దమ్మగడ్డలోని అజర ఆస్పత్రి సిబ్బందికి జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాపాడే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకాధికారి ఎల్.దయాకర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు గేటు బహూకరణ

హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జయగిరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు పోలుసాని అనితసురేందర్‌రెడ్డి తన తండ్రి అనంతరెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు రూ.20వేల విలువ చేసే ప్రధాన గేటును బహూకరించారు. ఈ సందర్భంగా బుధవారం ఎంఈవో ఇ.రాజిరెడ్డి చేతుల మీదుగా గేటును ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఎల్లాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, అరవింద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సీఆర్పీ రాజుకుమార్, ఉపాధ్యాయులు శ్రీహరి, కుమారస్వామి, యాకయ్య, విష్ణుమూర్తి, బి.శ్రీధర్ తోపాటు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ తగ్గించేందుకు ఫీడర్ ఏర్పాటు



సిక్కువాడ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కేయూ సబ్‌స్టేషన్ పరిధిలోని నయీంనగర్, కిషన్‌పుర 11 కేవీ ఫీడర్‌లో ఉన్న ఓవర్‌లోడ్ తగ్గించేందుకు రూ.50లక్షలతో కొత్తగా నిర్మించిన 11 కేవీ సిక్కువాడ ఫీడర్‌ను ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఈ మధుసూదర్‌రావు, డీఈ సాంబరెడ్డి, ఏడీఈ రాజు, ఏఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మాతంగి శ్రీనివాస్‌వి ఏకపక్ష నిర్ణయాలు

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ తీసుకునే నిర్ణయాలు ఏకపక్షమని, అవి చెల్లవని టీజీ ఎన్పీడీసీఎల్ కమిటీ కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫుల్‌టైం పర్మిషన్‌తో హైదరాబాద్‌లో ఉంటూ ఎలాంటి సేవలందించకుండా అసోసియేషన్ సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో శ్రీనివాస్‌ను ఎన్పీడీసీఎల్ కంపెనీ జనరల్ సెక్రటరీ ఏడీఈ దానయ్య ప్రశ్నించిన కారణంగా బైలాస్ విరుద్ధంగా శ్రీనివాస్ నిర్ణయం తీసుకుంటూ అధికారులకు లేఖలు రాస్తూ అసోసియేషన్ పరువు, ప్రతిష్ఠలు మంటగలిపే విధంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. నూతన ఎన్నికలు జరిగే వరకు తమ మద్దతు దానయ్యకే ఉంటుందని సభ్యులు తీర్మానం చేశారు.

యువతి మృతికి కారణమైన జాన్‌రెడ్డిని శిక్షించాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్క ముంతలపహాడ్‌కు చెందిన దళిత మహిళ మల్లేశ్వరి మృతికి కారణమైన జాన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని స్వేరోస్ స్టూడెంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూలో జాన్‌రెడ్డిని ఉరితీయాలని ప్లకార్డులను ప్రదర్శించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు చెట్టుపల్లి శివకుమార్, శ్రావణ్, మత్తు, తేజశ్రీ, హరీష, కార్తీక, మహేశ్వరి, స్వాతి, శ్వేత,శృతి, పూజ, రోజా,కల్పన, ప్రణతి, శ్రావన్య, కల్పన, స్వప్న, నాగేశ్వరి, అంజలి, శ్రీచరణ్, అరవింద్, మణికంఠ, అనీప్, సునిల్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి చేయండి

▸▸ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలిస్తున్న మేయర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బల్దియా కార్యాలయం వెనుక జరుగుతున్న స్విమ్మింగ్ పూల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బల్దియా ఇండోర్ స్టేడియం సమీపంలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న స్విమ్మింగ్ పూల్ పనులను బుధవారం సుధారాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం చేయడంతో అధికారులపై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. స్విమ్మింగ్ పూల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నిత్యం ఇంజనీర్లు పర్యవేక్షించాలన్నారు. స్విమ్మింగ్ పూల్ చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి కార్పొరేటర్ పరామర్శ

మడికొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మడికొండ నెహ్రూనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సంగ రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీడబ్ల్యుఎంసీ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి బుధవారం ఆస్పత్రిలో రమేష్‌ను కలిసి పరామర్శించారు. త్వరలోనే స్వస్థత చేకూరుతుందని ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

చెన్నై ఓపెన్ స్పేసెస్‌లో బల్దియా కమిషనర్

• రెండు రోజుల పాటు స్మార్ట్‌సిటీ శిక్షణా తరగతులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో రెండు రోజుల పాటు జరిగే 'స్పాంజ్ పార్క్ ఫ్రేమ్ వర్క్ ఫర్ రెసిలెంట్ ఓపెన్ స్పేసెస్' కార్యక్రమంలో వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈనెల 16, 17 రెండు రోజుల పాటు సస్టెనబుల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నారు. నగరాల్లో స్పాంజ్ పార్క్‌ల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయడం, డిజైన్, అమలు చేయడం, పట్టణాల్లో వరదలు తగ్గించడం, భూగర్భజలాలు పెంపొందించడంపై అవగాహన కలిగించారు. వరంగల్ నగరంలో వినూత్న ఆవిష్కరణలు అమలు చేసేందుకు కార్యక్రమంలో పాల్గొన్నట్టు కమిషనర్ తెలిపారు.



చెన్నై కార్యక్రమంలో పాల్గొన్న బల్దియా కమిషనర్ అశ్విని

విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

▸▸ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం 16 సర్కిళ్ల ఎస్ఈలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఎక్కడైనా చెట్లు విరిగి, లైన్‌లు తెగిపడి ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్స్ జరిగిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు సర్కిల్ పరిధిలోని కంట్రోల్‌రూమ్‌కు సమాచారం చేరవేయాలని, అక్కడి నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు సమాచారం అందించాలన్నారు. కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉంచామన్నారు. భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులు, వర్షాలుకురిసే ఆవకాశం ఉన్నందున సంబంధిత ఎస్ఈలు ఎక్కువగా అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తితే 1912కు ఫోన్‌చేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, అశోక్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 33 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఫాతిమా చిన్నప్ప ముగ్గురికి జైలుశిక్ష, 30 మందికి రూ.30,600 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపిన 9 మందికి రూ.4,500 జరిమానా విధించారన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు వైద్య సిబ్బందికి సహకరించాలని పశువైద్యాధికారి డాక్టర్ మాలవిక అన్నారు. బుధవారం హసన్‌పర్తిలో పాడిగేదెలకు టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలవిక మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధిసోకిన పశువులకు కాళ్లకు, గిట్టల మధ్య నోటిలో పుండ్లు వచ్చి బలహీనపడుతాయన్నారు. గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సకాలంలో వేయించి వ్యాధి నివారణకు రైతులు వైద్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వీఎల్ఓ బింగి సురేష్, జేవీవో శారద, ఎల్ఎస్ఏ నబి, సాధిక్ పాల్గొన్నారు.

ఎస్సార్‌యూలో ఘనంగా 'హాకథాన్'



హాకథాన్‌లో పాల్గొన్న యువ ఆవిష్కర్తలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బుధవారం టెక్‌స్టోమ్-2025 హాకథాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూడు దశల్లో సాగిన హాకథాన్‌లో 150 టీంలు పాల్గొనగా తుది దశలో 12 టీములను ఎంపిక చేసి బహుమతులను అందజేసినట్లు ఈవెంట్ హెడ్ డాక్టర్ మార్త శశికళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీన్ ఇంద్రజీత్ గుప్తా, డాక్టర్ ప్రమోద్‌కుమార్ పోలాడి, డాక్టర్ మండల సురేష్‌కుమార్, సందీప్ మద్దతుతో కార్యక్రమం విజయవంతమైందన్నారు. అనంతరం విజేతలందరికీ ఆర్గనైజింగ్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

ఫొటో, వీడియో జర్నలిస్టుల సంక్షేమ సంఘం అడ్‌హక్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

వడ్డేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియో జర్నలిస్టుల నూతన సంక్షేమ సంఘం, కార్యవర్గం ఎన్నిక హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఎన్నికల అధికారులుగా దాసరి శ్రీనివాసులు, గోకారపు శ్యామ్, ఆవుల సంపత్ కుమార్, మోహన్, బెలిదె శ్రీనివాస్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా సంపెట సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బోళ్ల అమర్, కోశాధికారిగా గొట్టె వెంకన్న, ఉపాధ్యక్షులుగా చేతి శ్రీనివాస్, తోట తిరుమల్, జాయింట్ సెక్రటరీలుగా దిలీప్, బొడిగె శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు ఎండవేడికి జాగ్రత్తలు తీసుకోవాలి

• ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను



ఆర్టీసీ డ్రైవర్లకు వాటర్ క్యాన్లు, టవల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎం డి.విజయభాను

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోలలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎండవేడి నుంచి రక్షించుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను సూచించారు. బుధవారం హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ ఆధ్వర్యంలో హనుమకొండ డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లకు వాటర్ క్యాన్లు, టవల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆర్ఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి.విజయభాను మాట్లాడుతూ.. ఎండవేడితో పాటు బస్సులో ఇంజన్ వేడిని తట్టుకోవడం కోసం ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తలకు టవల్ చుట్టుకోవడంతో పాటు తాగునీరు, జూస్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె.భానుకిరణ్, మహేష్, హనుమకొండ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియా సుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న స్నేహితులు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైన పులి సత్యనారాయణను సన్మానించారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయన బాల్య మిత్రులు కౌడగాని రాంబాబు, ముడితె తేజేశ్వర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థులు వ్యాపార మెళుకువలు నేర్చుకోవాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నూతనంగా వస్తున్న వ్యాపార మెళకువలు నేర్చుకుంటేనే సబ్జెక్టుపరంగా రాణిస్తారని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. బుధవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కళాశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తరగతికే పరిమితం కావద్దన్నారు. మేనేజ్‌మెంట్ విద్య నిత్య జీవితంలో భాగమన్నారు. ప్రస్తుత వ్యాపార ప్రపంచం డైనమిక్‌గా ఉందన్నారు. దీనికి అనుగుణంగా మారాలని చెప్పారు. లక్ష్యం ఉన్నతంగా ఉండాలని చెప్పారు. రిటైర్డు ప్రొఫెసర్ ఎ.శంకరయ్య, గోవా వర్సిటీ ప్రొఫెసర్ బి.రమేశ్, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రిన్సిపాల్ అమరవేణి, రిటైర్డు ప్రొఫెసర్ సక్రియా, సత్యవతి, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ఫణీంద్ర, ప్రగతితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేసి పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు అన్నారు బుధవారం హసన్‌పర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కమిటీ సభ్యులు పుల్ల అశోక్ ఆధ్వర్యంలో ధర్నా చేసి తహసీల్దార్ చల్ల ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయా గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు మంద సుచందర్, గజ్జెట సతీష్, జూకంటి పద్మ, వేలు సుమన్, దేవరకొండ రమేష్, వేలు రజిత, నాంపల్లి మౌనిక, సమ్మక్క, శ్రీవాణి, లలిత పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ, గద్దం కాశీం

వడ్డేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గద్దం కాశీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందు కోసం ఈనెల 19న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర , జిల్లా నాయకులు తాళ్లపల్లి కుమార్, మంచోజు చంద్రమౌళి, బానోతు భద్రునాయక్, శంకేసి సుజాత, మారపాక రవీందర్, మాచర్ల బాబు, పసుల సారలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

వడ్డేపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రకారం దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితోపాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాసాని నర్సింగరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బత్తుల వెంకన్నలు మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు అడ్డ రాజు, సుదమల్ల ప్రశాంత్, జి.నీలాంబ్రం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పునఃప్రారంభం



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

రెడ్డికాలనీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పునఃప్రారంభించారు. బుధవారం 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్, డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మనోహర్, రఘువీర్, కిరణ్, రమేశ్, కుమార్, ప్రవీణ్, రాజు, ప్రశాంత్, అరవింద్, శాంత, రాణి, రాజకుమారి, ఉదయాన, రాధ, పార్వతి, శ్రీకల, చైతన్య, రోజా, రజిత పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రిఫ్రిజిరేటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య బుధవారం భీమదేవరపల్లి మండలం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 30 ఏళ్లకు పైబడిన వారిని స్క్రీనింగ్ చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కొనుగోలు చేసిన రిఫ్రిజిరేటర్‌ను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణ స్థలానికి సంబంధించిన సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. కొందరు గ్రామస్థులు కొత్తపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని వరంగ నుంచి ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మార్చాల్సిందిగా కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఏఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిల్టు నగలు మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

- గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.
- మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.
- వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.
- దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్లు, పూసలు రాలిపోవచ్చు.



- ఒకసారి ధరించిన నగలను భద్ర పరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాతబడతాయి.
- గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరొకటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.
- ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టె లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

అభిరుచి

ప్రపంచమంతా చుట్టేయాలని ఎవరికి ఉండదు!
కానీ ఎంతమందికి అది సాధ్యమవుతుంది?
అందుకే ఈ జంట విభిన్నంగా ఆలోచించింది.
పర్యాటక ప్రదేశాల సందర్శన కోసం ఇంటినే వదిలేసింది.
దానికి పెట్టే అద్దె డబ్బులతో... నిరంతరం పర్యటనల్లోనే గడుపుతోంది.
దీని వెనుక ఉన్న కథ ఏంటో జంటలో ఒకరైన హేమని చావ్డా మాటల్లోనే...

జగమంత కుటీరం మాది



"చదువుకొనే రోజుల్లో మార్కుల రేసులు... పోటీ పరీక్షలు... ఆ తరువాత వృత్తిపరమైన ఎదుగుదల కోసం అలుపెరుగని ప్రయత్నాలు... సగటు మనిషి జీవితం ఇదే కదా. చిన్నప్పటి నుంచీ చూసి చూసి విసుగెత్తిపోయాను. అందరిలా కెరీర్ వెంట పరుగెత్తడం... ఊహ తెలిసినప్పటి నుంచీ దాని కోసమే ప్రణాళికా రచనలో మునిగిపోవడం... డిగ్రీ చదివే రోజుల్లోనే జీవితం అంటే ఇది కాదనిపించింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ మాది. మూస ఉద్యోగాలకు భిన్నంగా చదువు అవ్వగానే ఆర్టేగా కెరీర్ ప్రారంభించాను. అందులో ఊహించినంత కిక్ దొరకలేదు. దాంతో ట్రావెల్ బ్లాగర్‌గా మారాను. తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడి ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడం... చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. దాంతో ఆర్టేగా స్వస్తి చెప్పి ట్రావెల్ బ్లాగింగ్‌కు పూర్తి సమయం కేటాయించాలని అనుకున్నాను.

ఆయనదీ అదే దారి...

ఇక నా భర్త సాగర్ పటేల్‌కు కూడా పర్యటనలంటే చాలా ఇష్టం. ఆయన సొంతూరు మధ్యప్రదేశ్‌లోని ఝబువా. భౌగోళిక సమాచార రంగంలో పని చేసేవారు. మా ఇద్దరినీ కలిపింది మా అభిరుచే. ఆయన ఆధ్యాత్మిక పర్యాటకంపై వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్ చేసేవారు. నేనేమో పిల్లా పెద్ద అందరూ కలిసి ఆస్వాదించే ప్రాంతాలను చుట్టివచ్చేదాన్ని. అనుకోకుండా ఇద్దరం ఒక ఊరు వెళ్లినప్పుడు కలిశాం. ముందు అభిరుచులు కలిశాయి. తరువాత మనసులు ముడిపడ్డాయి. రెండున్నరేళ్ల కిందట ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పటివరకు విడివిడిగా పర్యటించిన మేము... పెళ్లి తరువాత నుంచి ఎక్కడికైనా కలిసి వెళుతున్నాం. మా వృత్తుల కంటే ఇలా విహరించడమే మాకు బాగా నచ్చింది. అందుకే ట్రావెల్ బ్లాగింగ్‌కే పూర్తి స్థాయి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు ఖాళీ చేసి...

అంతకుముందు మేమిద్దరం అహ్మదాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెలకు అద్దె 40 వేలు. మెయింటెనెన్స్, పని మనిషి, కరెంటు... మరో పది వేలు అయ్యేవి. ఇవి కాకుండా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు...అన్నీ కలుపుకొంటే దాదాపు లెక్క లక్ష తేలేది. ఇంతా చేసి నెలలో కనీసం ఓ వారం రోజులు కూడా మేం ఇంట్లో ఉండేవాళ్లం కాదు. పెళ్లయ్యాక మొదటి ఏడాదంతా జీవితంలో స్థిరపడాలనే ప్రయత్నాలతోనే సరిపోయింది. దాని కోసం ఎన్నో ప్రణాళికలు. లేచింది మొదలు మెదడులో ఇవే తిరుగుతుండేవి. ఇలాంటి జీవితం కాదు కదా నేను కోరుకున్నది! ఒక రోజు కూర్చొని ఆలోచిస్తుంటే... ఇద్దరి దారి, గమ్యం ఒకటే అయినప్పుడు ఇవన్నీ అవసరమా అనిపించింది. నెల తిరిగే సరికి ఇంత ఖర్చు భరించడం అంటే... తెలియకుండానే మాపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల చేసే పని మీద ఏకాగ్రత కుదరడం లేదు. అన్నీ బేరీజు వేసుకున్నాక... ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాం. మాకున్న కొద్దిపాటి సామాను అత్తగారి ఇంట్లో పెట్టాం.

అద్దె డబ్బుతో...

ఇకపై పూర్తిగా పర్యటనల్లోనే గడపాలని ఇద్దరం అనుకున్నాం. అలా ఐదు నెలల కిందట ఇల్లు ఖాళీ చేసేశాం. అప్పటి నుంచి నిరంతరాయంగా ఊళ్లు తిరుగుతున్నాం. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లు లేదు. మేం ఎక్కడికి వెళితే అక్కడే మా నివాసం. ఎలాంటి బరువు, బాధ్యతలూ లేవు. నెల నెలా మేం కట్టే అద్దె డబ్బులతో నచ్చిన ప్రాంతాలన్నీ సందర్శిస్తున్నాం. 'మేం ఇలా గడపాలనుకున్నాం' అని మా పెద్దవాళ్లను కూడా ఒప్పించాం. అప్పుడప్పుడూ వారిని కూడా మాతో తీసుకువెళుతుంటాం. కొన్ని ఊళ్లకు తరచూ వెళుతుండంవల్ల స్థానికులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దానివల్ల కొన్నిసార్లు కొత్త ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలగదు. అంతా మనవాళ్లే అనిపిస్తుంది. అలాగే బయటివారి కంటే తక్కువ ధరకే వసతి దొరుకుతోంది. మా ప్రయాణ ఖర్చులు, అక్కడి హోటల్‌లో బస, భోజనం... అన్నీ కలుపుకొంటే మేం కట్టిన అద్దె డబ్బు కంటే మించడంలేదు. సరుకులు కొనాల్సిన అవసరం లేదు. ఇద్దరికీ కలిపి ఒక సూట్‌కేస్, ఒక బ్యాక్‌ప్యాక్. ఇదే మా సంసారం.

లక్షల్లో ఫాలోవర్స్...

ప్రస్తుతం మేం తీసే వీడియోలన్నీ నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాం. అక్కడ నాకు దాదాపు మూడున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ట్రావెల్ బ్లాగింగ్‌ను ఫుల్‌టైమ్ కెరీర్‌గా మార్చుకున్నాక ఫాలోవర్స్ విపరీతంగా పెరిగారు. మా ఆలోచనకు అభినందనలు తెలుపుతున్నారు. 'మీది సాహసోపేత నిర్ణయం' అంటూ పొగుడుతున్నారు. ఆ కామెంట్లు చూసినప్పుడు... 'ఇల్లు, కెరీర్‌ను వదిలేసి కొత్త మార్గంలో పయనిస్తున్నామంటే... నిజంగానే మాది సాహసమే కదా' అనిపిస్తుంది. అయితే జీవితం మొత్తాన్నీ ఒక సూట్‌కేసులో పెట్టేసి జీవించడమంటే అంత సులువు కాదు. కానీ ఒక్కటి నిజం... లగేజీ ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సౌకర్యంగా ఉంటుంది. ఏదిఏమైనా మా పర్యాటక అభిరుచిని జీవితాంతం కొనసాగించాలన్నదే మా ధ్యేయం. ఎందుకంటే ఇలాంటి అద్భుత అవకాశం అందరికీ రాదు కదా."

ప్రయోగాత్మకంగా...

మేం మొదలుపెట్టినప్పుడు ఎన్ని రోజులు కొనసాగిస్తామో తెలియదు. ప్రయోగాత్మకంగా ఏడాది పాటు ఇలా చేసి చూద్దామని అనుకున్నాం. ఐదు నెలలు గడిచిపోయాయి. రోజు రోజుకూ ఉత్సాహం, ఆసక్తి పెరుగుతున్నాయే కానీ తగ్గడంలేదు. కుదిరితే జీవితాంతం ఇలా పర్యటనల్లోనే గడిపేయాలని కోరుకొంటున్నాం. పర్యటిస్తూనే మేం సంపాదించుకొంటున్నాం. వెళ్లదలుచుకున్న చోట రెస్టారెంట్లు, దర్శనీయ స్థలాల నిర్వాహకులను సంప్రతిస్తాం. వారు కోరితే వాటికి ప్రచారం కల్పిస్తాం. వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తాం. సాంకేతికంగా మాకు మంచి నైపుణ్యం ఉంది. ఈ సేవలకు గానూ వారు మాకు కొంత మొత్తం చెల్లిస్తారు. రెస్టారెంట్లు, కేఫ్‌ల్లో తాత్కాలికంగా హెల్పర్‌గా పని చేస్తాం. ఇవే మా ఆదాయ మార్గాలు.



నీటి కోసం మహిళలు పడుతున్న కష్టాన్ని తొలగించడానికి ఆమె చేసిన కృషి... 16 వేల చెట్లు, నాలుగు చెక్‌డ్యాంలు, ఆరు స్టోరేజి ట్యాంక్‌లతో ఆ గ్రామం రూపురేఖలను మార్చేసింది. 'జల యోధురాలు'గా పేరుపొందిన మేఘాలయా టీచర్ లక్మెన్ మేరీ నాంగ్‌ఖ్లావ్... జాతీయ స్థాయిలోనూ తన నీటి పరిరక్షణ నమూనా గురించి వివరించి ప్రశంసలందుకున్నారు.

నీటి బొట్టును ఒడిసిపట్టి



'మాది అందమైన కొండలు, గుట్టలతో ప్రకృతి అందాలతో అలరారే మేఘాలయ రాష్ట్రంలోని క్యెర్డెమ్‌ఖ్లా గ్రామం. చుట్టూ సహజ వనరులున్నా మంచినీటికి నోచుకోని దుస్థితి మాది. ఊరికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని వాగుల్లో దొరికే నీరే మాకు జీవనాధారం. నెత్తిన, నడుము మీద బిందెలతో ఇళ్ల నుంచి బయలుదేరే మహిళలు అక్కడ సర్వసాధారణమైన దృశ్యం. ఇరుకుగా, కఠినంగా, వంకర్లు తిరిగిన కొండ దారుల్లో రోజుకు కనీసం రెండు సార్లు రాకపోకలు సాగిస్తేనే వంటకు, తాగడానికి, ఇతర అవసరాలకు కావలసిన నీరు సమకూరుతుంది. అత్యంత తడిగా ఉండే ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన మౌసిన్రామ్‌కి మా ఊరు దగ్గర్లోనే ఉంది. కానీ విలక్షణమైన భౌగోళిక పరిస్థితులవల్ల, చెట్ల నరకివేత తీవ్ర స్థాయిలో ఉండడం వల్ల మా ప్రాంతంలో కురిసిన వర్షం మైదాన ప్రాంతాల్లోకి చాలా త్వరగా ప్రవహిస్తుంది. నీటిని నిల్వ చేసే సదుపాయాలు లేకపోవడంతో నీటి కొరతను మా గ్రామం ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎండాకాలంలో మహిళల దుస్థితి వర్ణనాతీతం. అనారోగ్యంతో ఉన్నా, గర్భంతో ఉన్నా నిత్యం మంచినీటి కోసం కొండలు ఎక్కి దిగాల్సిందే. ఈ కష్టాలు నాకూ కొత్తేం కాదు.

> ఉదయం తొమ్మిదికల్లా బడిలో ఉండాలి. అంటే ఇల్లు శుభ్రం చేసుకోవడం, నీరు తెచ్చుకోవడం, వంట... ఇవన్నీ ఎనిమిదిన్నర లోగా పూర్తి చేసుకోవాలి. దీనికోసం పొద్దున్నే నీటి కోసం బయలుదేరేదాన్ని. వాగులో... కాలుష్యం లేనిచోట నీటి కోసం మహిళలు బారులు తీరి ఉంటారు. ఆ క్యూలో నిలబడి నా వంతు కోసం ఎదురు చూడాలి.

వారు స్పందించలేదు...

నేను పదిహేనేళ్లుగా మా ఊర్లోనే అసిస్టెంట్ టీచర్‌గా పని చేస్తున్నాను. ఉదయం తొమ్మిది గంటలకల్లా బడిలో ఉండాలి. అంటే ఇల్లు శుభ్రం చేసుకోవడం, నీరు తెచ్చుకోవడం, వంట... ఇవన్నీ ఎనిమిదిన్నర లోగా పూర్తి చేసుకోవాలి. దీనికోసం పొద్దున్నే నీటి కోసం బయలుదేరేదాన్ని. వాగులో కాలుష్యం లేనిచోట నీటి కోసం మహిళలు బారులు తీరి ఉంటారు. ఆ క్యూలో నిలబడి నా వంతు కోసం ఎదురుచూడాలి. అది నాకు చాలా కష్టం అనిపించింది. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే... అధికారులకు మా పరిస్థితి వివరిస్తూ లేఖలు రాశాను. స్పందన రాలేదు. టీచర్‌గా నన్ను గౌరవించే మా గ్రామంలో మహిళలందరూ నీటి కష్టాల గురించి నాతో మొరపెట్టుకొనేవారు. కానీ నేను బాధితురాలినే. ఇది మహిళల సమస్య. ఎలాగైనా దాన్ని మేమే పరిష్కరించుకోవాలనుకున్నాం. 2016లో జరిగిన ఎన్నికల్లో గ్రామ ఉపాధి మండలికి కార్యదర్శిగా గ్రామస్తులు నన్ను ఎన్నుకున్నారు. దాంతో అధికారులతో నేరుగా మాట్లాడే అవకాశం దొరికింది. గ్రామ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకొనే వీలు కలిగింది.



నీటి కొరత, శ్రమ తగ్గాయి

జల సంరక్షణ కోసం ఉద్దేశించిన 'జై శక్తి అభియాన్' పథకానికి చెందిన అధికారులు, నిపుణులతో చర్చించాను. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు కురిసినా... దాన్ని నిలబెట్టుకోకపోవడం వల్లే నీటి సమస్య తీవ్రం అయిందనీ, చెట్ల నరకివేత దీనికి ప్రధాన కారణమనీ వారు చెప్పారు. దాంతో... మా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. ప్రతి ఒక్కరినీ దానిలో భాగస్వాములుగా చేశాను. అదే సమయంలో... నీటి నిల్వ, నిర్వహణ కోసం వివిధ ప్రణాళికలను రూపొందించాను. పెద్దగా ప్రాధాన్యత లేని మారుమూల గ్రామాలకు ఎక్కువ నిధుల కేటాయింపు అంత సులువు కాదు. కానీ నా తాప్రతయం, చేపడుతున్న కార్యక్రమాలు అధికారులను, ప్రజా ప్రతినిధులను ఆకర్షించాయి. నిధుల రాక మొదలయింది. క్రమంగా మా గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికి 16 వేలకు పైగా చెట్లు నాటాం. అయిదు వాటర్ స్టోరేజి ట్యాంకులను, నాలుగు చెక్‌డ్యామ్‌లను నిర్మించుకున్నాం. భూగర్భ జలాలను పెంపొందించడానికి ఆరు నీటి వనరులను పునరుద్ధరించాం. ఇప్పుడు వర్షపు నీరు వృథా పోవడం లేదు. వేసవి కాలంలో కూడా నీటికి కొరత ఉండడం లేదు. గ్రామంలోని నిర్దిష్ట ప్రదేశాల్లో కొళాయిలు ఏర్పాటు చేయడంతో... దూరం నుంచి నీరు మోసుకొచ్చే శ్రమ మహిళలకు తప్పింది.

ప్రకృతిని కాపాడుకోవాలి...

నా భర్త ఎజిల్బస్ నేను చేసే ప్రతి కార్యక్రమానికీ ఎంతో మద్దతిస్తారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. వ్యక్తిగత స్థాయిలో నేను ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నం... సామాజిక మార్పునకు దోహదపడడమే కాదు... నాకు గొప్ప గుర్తింపు కూడా తెచ్చిపెట్టింది. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి పలు సత్కారాలు అందుకున్నాను. 'జల యోధురాలు', 'మార్పునకు మార్గదర్శి' అనే ప్రశంసలు లభించాయి. నిరుడు ఢిల్లీలో జరిగిన 8వ భారతీయ జల వారోత్సవాల్లో పాల్గొని, ప్రసంగించే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా గ్రామాలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను పరిష్కరించడానికి నేను ప్రతిపాదించిన ప్రణాళికలు జాతీయ స్థాయిలో ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి. మేఘాలయాలోని పలు ప్రాంతాల్లో ఇప్పుడు మా గ్రామ నమూనాను అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయురాలుగా, గ్రామ ఉపాధిమండలి కార్యదర్శిగానే కాదు.... మహిళా స్వయంసహాయక బృందాలకు సాధికారత కల్పించడం కోసం శిక్షణ ఇచ్చి, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారేందుకు సాయపడే గ్రామీణ సంస్థకు అధ్యక్షురాలుగానూ వ్యవహరిస్తున్నాను. వివిధ గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, నీటి సంరక్షణల ఆవశ్యకత గురించి చెబుతున్నాను. ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది. దాన్ని కాపాడుకోవాలంటే... ప్రకృతిని కాపాడుకోవాలి. ఇది మా గ్రామానికే కాదు... ప్రపంచంలో ఏ ప్రాంతానికైనా వర్తించే వాస్తవం."


కౌన్సెలింగ్

కామెర్లకు నాటు మందు వద్దు

డాక్టర్! మా అబ్బాయికి 18 ఏళ్లు. కామెర్లు సోకాయి. పత్యం చేస్తూ, పసరు మందు తీసుకుంటే సరిపోతుందని బంధువులు అంటున్నారు. ఈ మందుతో ప్రయోజనం ఉంటుందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

కాలేయం జబ్బు పడిందనడానికి కామెర్లు ఒక సంకేతమనే విషయం అందరికీ తెలుసు. అయితే కామెర్లకు కారణమైన కాలేయ జబ్బుకు అసలు కారణాన్ని వైద్య సహాయంతో కనిపెట్టి, అందుకు తగిన చికిత్స తీసుకోవడం ఎంతో కీలకం అనే విషయం ఎవరికీ తెలియదు. మూలికా వైద్యాలు, ఇతరత్రా నాటు మందుల వల్ల కాలేయానికి మేలు కంటే హాని ఎక్కువ కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన లివర్ ఫెయిల్యూర్‌కూ దారి తీయవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. కాబట్టి కామెర్లు కనిపించినప్పుడు కాలేయ వ్యాధి మరింత ముదిరిపోకుండా ఉండడం కోసం వైద్యుల సలహాలను తీసుకోవాలి. ఆకలి మందగించడం, పొట్ట నిండుగా ఉన్నట్టు అనిపించడం, మత్తుగా ఉండడం, బరువు కోల్పోవడం, కాళ్ల వాపు లాంటి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించి, వైద్య పరీక్షలతో వ్యాధి మూల కారణాన్ని నిర్ధారించుకోవాలి. ఆలస్యం చేయడం వల్ల కాలేయం మరింత దెబ్బతిని, సిర్రోసిస్ లేదా కాలేయ క్యాన్సర్‌లకు గురి కాక తప్పదు. పత్యం విషయానికొస్తే, కామెర్లు సోకినప్పుడు కాలేయం మీద భారం పడే మాంసాహారం మానేయాలి. ఎక్కువ నూనెలు, మసాలాలు లేకుండా వండిన సాత్వికాహారం తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తే కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మద్యపానం మానుకుని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకుంటూ హెపటైటిస్ పరీక్షలు క్రమం తప్పక చేయించుకుంటూ ఉండాలి.



డాక్టర్ నవీన్ పోలవరపు,
లివర్ స్పెషలిస్ట్, హైదరాబాద్.

బియ్యపు గింజ కన్నా చిన్న పేస్‌మేకర్

ఒక బియ్యపు గింజ పరిణామం ఎంత ఉంటుంది? ఒక్కసారి ఊహించుకోండి. అంత కన్నా చిన్న పేస్‌మేకర్‌ను అమెరికాలోని నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు తయారు చేశారు. దీని పరిణామం 0.46 మిల్లీమీటర్లు ఉంటుంది. కొన్ని క్లిష్టమైన గుండె సర్జరీలు చేసే సమయంలో పేస్‌మేకర్లను తాత్కాలికంగా ఉపయోగిస్తారు.

ఆ తర్వాత వాటిని మళ్లీ బయటకు తీస్తారు. దీని వల్ల పేషెంట్లకు ఇబ్బంది కలుగుతుంది. శాస్త్రవేత్తలు తయారు చేసిన ఈ పేస్‌మేకర్‌ను గుండె సమీపంలో అమర్చటానికి ఎటువంటి సర్జరీ అవసరం ఉండదు. సన్నని తీగ ద్వారా లోపలికి పంపుతారు. చర్మంపై నుంచి వచ్చే కాంతి ఆధారంగా ఇది పనిచేస్తుంది. జంతువులపై చేసిన పరిశోధనల్లో ఈ పేస్‌మేకర్ విజయవంతంగా పనిచేసింది.



ఈ ఐదు మాటలు అనొద్దు!

సంసారంలో భార్యభర్తల మధ్య తగువులు వస్తూనే ఉంటాయి. వాటికి పరిష్కారాలు కూడా దొరుకుతూనే ఉంటాయి. ఇది సర్వసాధారణం. కానీ ఒకరినొకరు అనుకొనే మాటలు మాత్రం ఎప్పటికీ మిగిలిపోతాయి. అందువల్ల ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని రిలేషన్‌షిప్ నిపుణులు సూచిస్తున్నారు. దెబ్బలాడుకొనే సమయంలో కొన్ని మాటలు వాడవద్దని హితవు చెబుతున్నారు. ఆ మాటలేమిటంటే...

ఎక్కువగా రియాక్ట్ అవుతున్నావు!

ఒక అనుబంధం బలపడాలంటే ఒకరినొకరు గౌరవించుకోవాలి. అభిప్రాయాలను స్పష్టం చెప్పాలి. వారు చెప్పే అభిప్రాయాలను అర్థం చేసుకోవాలి. దీనికి చాలా సహనం అవసరం. కొన్నిసార్లు వాదన పెరిగినప్పుడు ఇతరుల అభిప్రాయాలను మొగ్గలోనే తుంచివేయాటానికి చేసే వ్యాఖ్యలివి. దీని వల్ల వాదన పెరుగుతుంది తప్ప తగ్గదు.

మా వాళ్లైతే ఇలా చేయరు...

ప్రతి వ్యక్తి జీవితంలో తల్లితండ్రులు చాలా ముఖ్యమైనవారే! వారికి పిల్లలపై అపారమైన ప్రేమ ఉంటుంది. తప్పు చేసినా దానిని సరిదిద్దటానికి ప్రయత్నిస్తారు. కానీ భార్యభర్తల బంధం భిన్నమైనది. భార్యభర్తలిద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. ఎప్పుడైనా ఒకరు అన్న మాట నెగ్గకపోతే వెంటనే అవతల వ్యక్తి తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ చేసే వ్యాఖ్యలివి. దీనివల్ల సమస్యలు పెరుగుతాయి తప్ప తరగవు.



ఐ డోంట్ కేర్!

వాదిస్తే పర్వాలేదు. కానీ అవతల వ్యక్తి అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా 'ఐ డోంట్ కేర్' అంటే మాత్రం సమస్య జటిలమైపోతుంది. ఇతరులతో మనకు అభిప్రాయ భేదాలు ఉండచ్చు. అభిప్రాయ భేదాలు ఉన్నాయనే విషయాన్ని కూడా గౌరవంగా చెప్పాలి. లేకపోతే ఇతరుల మనస్సు దెబ్బతింటుంది.

నువ్వెప్పుడూ ఇంతే!

చాలామంది ఇళ్లలో వినిపించే డైలాగ్ ఇది. 'నువ్వు ఎప్పుడూ మర్చిపోతావు', 'నువ్వు ఎప్పుడూ నా మాట వినవు' లాంటి వ్యాఖ్యలు ఇతరుల వ్యక్తిత్వాన్ని కించపరచటమే. ఇలాంటి వ్యాఖ్యల వల్ల భార్యభర్తల మధ్య దూరం పెరుగుతుంది.

నేనిష్టం లేదు కాబట్టే...

ఇతరుల పట్ల ప్రేమ, అభిమానం ఉన్నా కొన్నిసార్లు వ్యవహారికంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి ప్రేమకు కొలమానం కాదు. మనకు ఇష్టం లేని పని జరిగితే 'నేనిష్టం లేదు కాబట్టే ఇలా చేశావు' అని నిందించటంవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు.



పోచంపల్లిలో చేనేత పట్టు మగ్గంపై స్మిత సబర్వాల్

మే 15న పోచంపల్లికి అందాల భామలు

- చేనేతకు విశిష్ట గుర్తింపు తెచ్చే ప్రణాళికలు
- టూరిజం శాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్

భూదాన్‌పోచంపల్లి, హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 15న అందాల భామలు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి రానున్నారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్-2025 పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో పాల్గొనే అందాల భామలకు భూదాన్‌పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ఇక్కడ చేస్తున్న ఏర్పాట్లను టూరిజం శాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత విశిష్టత, ప్రతిష్ఠ పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ సాంస్కృతిక వస్త్రాలను, చేనేత వారసత్వాన్ని ప్రపంచ ప్రేక్షకులకు ప్రదర్శించడానికి మే 15న చేనేత ఐకానిక్ పోచంపల్లిలో మిస్ వరల్డ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. భూదాన్‌పోచంపల్లికి 35 దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులు వస్తారని స్మితా సబర్వాల్ తెలిపారు. చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న పట్టు చీరల కేంద్రాన్ని, మగ్గాలను ఆమె ఈ సందర్భంగా పరిశీలించారు.

అర్ధరాత్రి అతలాకుతలం!

- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గాలివాన బీభత్సం
- పంటలకు నష్టం.. విద్యుదాఘాతానికి మహిళ మృతి
- నేడు, రేపు వర్షాలు.. వడదెబ్బతో ముగ్గురి మృత్యువాత



కేసముద్రం మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్నలు చూపుతున్న మహిళ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి.. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తడిసిపోయాయి. పలు చోట్ల భారీ వృక్షాలు, విద్యుత్తు స్తంభాలు నేలకొరగడంతో అర్ధరాత్రి నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో కరెంట్ వైరు తెగి కిందపడటంతో దానిని గమనించకుండా వెళ్లిన నాగెల్లి ఉప్పలమ్మ (65) విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. కల్లూరు మండలంలో పొలాల్లో వరి పంట నేలమట్టమైంది. ఖమ్మం మార్కెట్‌లో యార్డులో మిర్చి బస్తాలు తడిశాయి. వైరాలో అత్యధికంగా 3.4 సెంమీ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ మండలంలో ఓ మోస్తరు వాన పడింది. నర్సింహులపేట మండలంలో 150 ఎకరాల్లో వరి పంట నేలవాలి వడ్లు రాలిపోయాయి. భూపాలపల్లి జిల్లా ఐదు మండలాల్లో 1,232 ఎకరాల్లో వరి, 695 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. చిట్యాల మండలంలో రెండెకరాల అరటి పంట పూర్తిగా నేలకొరిగింది. ఇటు పెద్దపల్లి జిల్లాల్లో బుధవారం తెల్లవారు జామున కురిసిన వడగండ్ల వర్షానికి 2,855 ఎకరాల్లో వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కాగా, రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

వడదెబ్బకు ముగ్గురి మృతి..

రాష్ట్రంలో ఎండల ధాటికి వడదెబ్బకు గురై ముగ్గురు మృత్యువాత పడ్డారు. మెదక్ జిల్లా రామాయంపేటలో ఎరుకలి బాలయ్య (80), గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడులో ఉపాధి కూలీ తిరపాలు (58), వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గార్లగడ్డతండాలో పాల్తియ వసంత (40) ఎండలకు అస్వస్థత చెంది ప్రాణాలు కోల్పోయారు.

మంత్రి జూపల్లి X ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

- తులం బంగారం ఎప్పుడిస్తారని మంత్రిని నిలదీసిన ఎమ్మెల్యే
- కేసీఆర్ ఏ సీఎం చేయని అప్పులు చేశాడన్న మంత్రి
- మంత్రి వెళ్లాక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఘర్షణ
- పోలీసుల లాఠీచార్జి.. నిరసనగా రోడ్డుపై ఎమ్మెల్యే బైఠాయింపు

భీమ్‌గల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో బుధవారం జరిగిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఎప్పుడిస్తారని ఆయన మంత్రిని నిలదీశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ఎమ్మెల్యే చెప్పిన ప్రకారం తులం బంగారం కూడా అందజేస్తామని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల హయాంలో గతంలో ఏ ముఖ్యమంత్రులు చేయని విధంగా అప్పులు చేశారని, ఆయన చేసిన అప్పులకు ప్రస్తుతం వడ్డీకి వడ్డీ చెల్లించే పరిస్థితి నెలకొందని అన్నారు. దీంతో మధ్యలో ఎమ్మెల్యే కల్పించుకోవడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం మంత్రి బయలుదేరి వెళ్లగా బయట ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణకు దిగారు. పోలీసులు ఇరు వర్గాలను సముదాయించే ప్రయత్నం చేయగా.. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య మాటామాటా పెరగడంతో పోలీసులు లాఠీచార్జీ చేసి ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పోలీసుల తీరుకు నిరసనగా భీమ్‌గల్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. లాఠీచార్జీలో 10 మంది బీఆర్ఎస్ నాయకులు గాయాల పాలయ్యారని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడకు చేరుకున్న ఆర్మూర్ ఏసీపీ ఎమ్మెల్యేను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా లాఠీచార్జీ చేసిన పోలీసులను వదిలే ప్రసక్తే లేదని, అందరి వివరాలు నమోదు చేసుకున్నామని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

మెరుగైన కంటెంట్.. భవిష్యత్తు కోసం ఏఐ



ప్రేక్షకులకు సరికొత్త వినోదం అందించడం కోసం చిత్ర పరిశ్రమ ఎప్పటికప్పుడు నూతన మార్గాలు అన్వేషిస్తుంటుంది. ఒకప్పుడు కలర్, సినిమా స్కోప్, 70 ఎం.ఎం, డి.టి.ఎస్, డి.ఐ ఇలా రకరకాల సాంకేతిక హంగులను సమకూర్చుకుని థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి కృషి చేస్తోంది చిత్ర పరిశ్రమ. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సరికొత్త సాంకేతిక సదుపాయం ఏ.ఐ. ప్రస్తుతం ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తున్న ఏ. ఐ. విధానం భవిష్యత్‌ను శాసిస్తుందని కూడా కొందరు అంటున్నారు. ఏ.ఐ టెక్నాలజీ కోసం పెద్ద పెద్ద సంస్థలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో నిర్మాత దిల్ రాజు దృష్టి కూడా దీనిపై పడింది. కొత్తను ఆహ్వానించడం, అనుసరించడంలో మిగిలిన వారి కంటే ముందు ఉండాలనే తపన కలిగిన ఆయన తాజాగా ఇప్పుడు ఏ.ఐ ప్రొడక్ట్ కంపెనీని ఏర్పాటు చేశారు. తెలుగు సినిమాలకు ఏఐ టెక్నాలజీకి సంబంధించిన పనులు చేసే 'క్వాంటమ్ ఏ వన్' కంపెనీతో ఆయన చేతులు కలిపారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఆయన సంస్థ విడుదల చేసిన వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దిల్ రాజు తన ఆలోచనలను పంచుకుంటూ 'ఇది కేవలం మెరుగైన కంటెంట్ గురించి మాత్రమే కాదు. వినోద ప్రపంచానికి అవసరమైన ఏ వన్ వ్యవస్థ నిర్మాణం గురించి కూడా. ఏ వన్ గ్లోబల్ సాంకేతిక నైపుణ్యాలతో భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న పరిష్కారాలను అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. కంపెనీ పేరు, ఇతర వివరాలు మే 4న వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

మండు వేసవిలో చల్లని సినిమా

ప్రియదర్శి



ప్రియదర్శి, రూప కొడవాయూర్ జంటగా మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. వీకే.నరేశ్, వెన్నెల కిశోర్, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ "ఇదో విభిన్న తరహా కామెడీ క్రైమ్ చిత్రం. అన్ని రకాలుగా మెప్పిస్తుంది" అని అన్నారు. "ఇంటిల్లిపాదీ కలసి చూసేందుకు ఓ మంచి చిత్రాన్ని మీ ముందుకు తెస్తున్నాం. సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు. "మండు వేసవిలో చల్లటి అనుభూతినిచ్చే సినిమా ఇది. తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుంది" అని హీరో ప్రియదర్శి తెలిపారు.

కథే ఈ సినిమాకు హీరో



- శివ రాజ్‌కుమార్

శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్.బి.శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా '45'. అర్జున్ జన్యా దర్శకత్వంలో ఉమా రమేశ్ రెడ్డి, ఎం.రమేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాలో సరికొత్త కథనాన్ని చూస్తారు. కథే ఈ సినిమాకు హీరో" అని చెప్పారు. "అందర్నీ మెప్పించే అంశాలున్న సినిమా ఇది" అని హీరో ఉపేంద్ర చెప్పారు. "వాణిజ్యాంశాలు ఉంటూనే కొత్తదనాన్ని పంచే చిత్రమిది" అని దర్శకుడు అర్జున్ జన్యా తెలిపారు.

ఆ పాఠమేంటో తెలియాలంటే సినిమా చూడాలి

- త్రినాథరావు నక్కిన



దర్శకుడు త్రినాథరావు నక్కిన నిర్మాతగా వ్యవహరించిన చిత్రం 'చౌర్య పాఠం'. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నిఖిల్ గొల్లమారి తెరకెక్కించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ "ఈ మధ్య థియేటర్లకు ప్రేక్షకులు రావడం బాగా తగ్గిపోయింది. అలాంటి సమయంలో చిన్న సినిమా తెరకెక్కించడమంటే సాహసమే. ఈ కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులోని పాత్రధారి ఓ అవసరం కోసం దొంగతనం చేసినప్పుడు తెలుసుకున్న పాఠమే ఈ చిత్ర కథాంశం. ఆ పాఠమేంటో తెలియాలంటే సినిమా చూడండి" అని చెప్పారు. "సినిమా అద్భుతంగా వచ్చింది" అని దర్శకుడు నిఖిల్ గొల్లమారి చెప్పారు.

మధురమైన విజయాన్ని అందుకోవాలి



- వి.వి.వినాయక్

ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మధురం'. యం.బంగార్రాజు నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదల కానున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ "ఈ 'మధురం' చిత్రం మధురమైన విజయం సాధించాలి. చిత్రంలో భాగమైన వారందరికీ ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. దర్శకుడు చికిలే మాట్లాడుతూ "ఈ చిత్రం టీమ్ సమిష్టి కృషి. చిత్ర విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు విజయ్‌కుమార్ కొండ, సంగీత దర్శకులు ఆర్.పీ.పట్నాయక్, రఘు కుంచె తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీకి జయసుధ సారథ్యం

- అవార్డ్సకు కోసం 1248 నామినేషన్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ కోసం 15 మంది సభ్యులతో కూడిన జ్యూరీ సమావేశం ఛైర్‌పర్సన్ జయసుధ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్సకు అన్ని విభాగాల్లో కలిపి 1,248 నామినేషన్లు అందాయి. 21వ తేదీ నుంచి నామినేషన్ల స్ర్కీనింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. పురస్కారాల కోసం వ్యక్తిగత విభాగంలో 1172, ఫీచర్ ఫిల్మ్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ/ లఘుచిత్రాలు, ఫిల్మ్ క్రిటిక్స్ పుస్తకాలు తదితర విభాగాల్లో 76 దరఖాస్తులొచ్చినట్లు జ్యూరీ వెల్లడించింది. సమావేశం సందర్భంగా జయసుధ మాట్లాడారు. తనకు అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకొని ఫిల్మ్ అవార్డుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ.. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలనచిత్ర అవార్డులు ఇవ్వనుందని, ఉమ్మడి రాష్ట్రంలోనూ చలనచిత్ర పురస్కారాల కోసం ఇంత విశేష స్థాయిలో స్పందన రాలేదన్నారు. నామినేషన్లను జ్యూరీ నిష్పాక్షికంగా పరిశీలించాలని.. తెలుగు చలనచిత్ర రంగానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను ఆయన కోరారు.

డ్రగ్స్ తీసుకునే వారితో నటించను

- విన్సీసోనీ అలోషియస్

ఇటీవలె వరుస కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపుల ఆరోపణలతో మలయాళ చిత్రపరిశ్రమలో తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత అక్కడ పరిస్థితులు సద్దుమణిగాయని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అలాంటి తరుణంలో 'జనగణమన' ఫేమ్, హీరోయిన్ విన్సీసోనీ అలోషియస్ ఓ హీరోపై చేసిన ఆరోపణలు మరోసారి అంతటా చర్చనీయాంశమయ్యాయి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన పెంచే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇటీవల ఓ సినిమాలో తనతో కలసి నటించిన సహనటుడు డ్రగ్స్ తీసుకున్న మత్తులో లైంగికంగా వేధించాడని ఆరోపించారు. డ్రగ్స్ తీసుకునే వారితో ఇకపై ఎప్పటికీ సినిమాలు చేయనని స్పష్టం చేశారు. "ఓ సినిమా షూటింగ్ సమయంలో నేను వేసుకున్న డ్రెస్ అసౌకర్యంగా అనిపించింది. దుస్తులు మార్చుకుందామని డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తుండగా, ఆ యాక్టర్ 'నేనూ నీకు తోడుగా వచ్చి నీ డ్రెస్ మార్చుకునేందుకు సహాయం చేస్తా' అని సెట్స్‌లో ఉన్న అందరి ముందే మాట్లాడి ఇబ్బందిపెట్టాడు. ఆయన సెట్స్‌లోనే డ్రగ్స్ తీసుకునేవాడు. ఆయనపై చిత్ర దర్శకుడికి, నిర్మాతలకు ఫిర్యాదు చేశా. ఆయనది ప్రధాన పాత్ర కావడంతో, సినిమా ఆగిపోతుందనే భయంతో వారు కూడా ఏమీ చేయలేకపోయారు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు చాలా ఇబ్బందిపడ్డాను" అని పేర్కొన్నారు. కాగా, 2019లో నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు విన్సీ. పలు చిత్రాల్లో నటించిన ఆమె, 'రేఖ' సినిమాకు ఉత్తమ నటిగా కేరళ స్టేట్ అవార్డును అందుకున్నారు.



స్పోర్ట్స్

వరంగల్ ● గురువారం 17 ఏప్రిల్ 2025

నేటి మ్యాచ్ | వేదిక: ముంబై

ముంబై x హైదరాబాద్ — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	6	2	4	0	4	0.104
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఢిల్లీ 'సూపర్'

- రాణించిన రాహుల్, అభిషేక్, అక్షర్
- రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం



అక్షర్ పటేల్ (14 బంతుల్లో 34)

న్యూఢిల్లీ: ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరు.. ఈ సీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో పైచేయి సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపు బాటపట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించిన ఢిల్లీ మళ్లీ టాప్‌కు చేరుకొంది. 188 పరుగుల వద్ద ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో మొదట రాజస్థాన్ 11/2 స్కోరు చేయగా.. ఢిల్లీ 4 బంతుల్లోనే 13 పరుగులు చేసి గెలిచింది. స్టబ్స్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. అంతకుముందు తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 188 పరుగులు చేసింది. అభిషేక్ పోరెల్ (49), కేఎల్ రాహుల్ (38), అక్షర్ పటేల్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 34), స్టబ్స్ (34 నాటౌట్) రాణించారు. ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ ఓవర్లన్నీ ఆడి 188/4తో స్కోరు సమం చేసింది. నితీశ్ రాణా (51), యశస్వి జైస్వాల్ (51) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. మ్యాచ్‌లో చివరి ఓవర్‌తో పాటు సూపర్ ఓవర్‌లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అదరగొట్టిన ఓపెనర్లు: ఛేదనలో ఓపెనర్లు జైస్వాల్, శాంసన్ (31) రాజస్థాన్‌కు అదిరే ఆరంభాన్నిచ్చారు. పవర్‌ప్లేలో ఇద్దరూ పోటీపడి మరీ షాట్లు ఆడుతూ.. 34 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, గాయపడిన శాంసన్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆరు ఓవర్లకు రాజస్థాన్ 63/0తో నిలిచింది. మధ్య ఓవర్లలో ఢిల్లీ స్పిన్నర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఈ క్రమంలో రియాన్ పరాగ్ (8)ను అక్షర్ బౌల్డ్ చేసి తొలి బ్రేక్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రాణాతో కలసి జైస్వాల్ స్కోరు బోర్డును నడిపించాడు. 12వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. అయితే, కుల్దీప్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన జైస్వాల్ క్యాచవుట్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండడంతో రాణా ఎదురుదాడికి దిగాడు. అక్షర్ బౌలింగ్‌లో 6,4,4తో 16 పరుగులు రాబట్టిన రాణా.. కుల్దీప్ వేసిన 16వ ఓవర్‌లో 6,4 బాదాడు. దీంతో లక్ష్యం చివరి 5 ఓవర్లలో 45 రన్స్‌కు దిగివచ్చింది. అయితే, హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న రాణాను స్టార్క్ ఎల్బీగా వెనక్కుపంపడంతో ఢిల్లీ మ్యాచ్‌లోకొచ్చింది. కానీ, జురెల్ (26), హెట్‌మయర్ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ గెలుపు బాటలో నిలిపారు. కాగా, చివరి ఓవర్‌లో 9 పరుగులు కావాల్సి ఉండగా.. స్టార్క్ 8 పరుగులే ఇవ్వడంతో స్కోరు సమమైంది. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా.. సింగిల్ తీసిన జురెల్ రనౌటయ్యాడు.



అక్షర్ దూకుడు: రాజస్థాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. మందకొడి పిచ్‌పై 14 ఓవర్లకు ఢిల్లీ 106/4 స్కోరు మాత్రమే చేసింది. ఈ క్రమంలో 150 కూడా చేరుకోవడం కష్టమేనని పించింది. కానీ, చివరి ఓవర్లలో స్టబ్స్‌తో కలసి కెప్టెన్‌అక్షర్ పటేల్ 19 బంతుల్లోనే 41 రన్స్ జోడించడంతో స్కోరు బోర్డు రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఆ తర్వాత అశుతోష్ శర్మ (15 నాటౌట్) జతగా స్టబ్స్ వేగంగా 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఢిల్లీ ఊహించని రీతిలో 180 పరుగుల మార్క్ దాటింది. వీరిద్దరి దెబ్బకు రాజస్థాన్ చివరి 5 ఓవర్లలో 77 రన్స్ సమర్పించుకొంది. అంతకుముందు పోరెల్, రాహుల్ మూడో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, రాహుల్‌ను ఆర్చర్.. పోరెల్‌ను హసరంగ బోల్తా కొట్టించారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అక్షర్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డులో ఊపుతెచ్చాడు. హసరంగ బౌలింగ్‌లో అక్షర్ 4,4,6తో 19 పరుగులు పిండుకొన్నాడు. తీక్షణ బౌలింగ్‌లో 4,4,6 బాదిన అక్షర్ మరో భారీ షాట్ ఆడే క్రమంలో అవుటయ్యాడు. మెక్‌గుర్క్ (9), కరుణ్ నాయర్ (0) విఫలమయ్యారు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జైస్వాల్ (బి) ఆర్చర్ 9, అభిషేక్ పోరెల్ (సి) పరాగ్ (బి) హసరంగ 49, కరుణ్ నాయర్ (రనౌట్) 0, రాహుల్ (సి) హెట్‌మయెర్ (బి) ఆర్చర్ 38, స్టబ్స్ (నాటౌట్) 34, అక్షర్ (సి) జురెల్ (బి) తీక్షణ 34, అశుతోష్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 188/5; వికెట్ల పతనం:** 1-34, 2-34, 3-97, 4-105, 5-146; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-32-2, తుషార్ 3-0-38-0, సందీప్ 4-0-33-0, తీక్షణ 4-0-40-1, హసరంగ 4-0-38-1, పరాగ్ 1-0-6-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 51, శాంసన్ (రిటైర్డ్ హర్ట్) 31, పరాగ్ (బి) అక్షర్ 8, నితీశ్ రాణా (ఎల్బీ) స్టార్క్ 51, జురెల్ (రనౌట్) 26, హెట్‌మయెర్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 188/4; వికెట్ల పతనం:** 0-61 (రిటైర్డ్ హర్ట్), 1-76, 2-112, 3-161, 4-188; **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-1, ముకేశ్ 3-0-31-0, మోహిత్ 4-0-38-0, విప్రాజ్ 1-0-13-0, అక్షర్ 3-0-23-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-12-0.

'బ్యాట్' పరీక్షలో నరైన్, నోకియా విఫలం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఫీల్డ్‌లో బ్యాట్ చెకింగ్ నిబంధనతో కోల్‌కతా బ్యాటర్ సునీల్ నరైన్‌కు చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం పంజాబ్‌తో మ్యాచ్‌లో ఛేదనకు ముందు బౌండ్రీ అవతల నరైన్, రఘువంశీ బ్యాట్లను రిజర్వు అంపైర్ సయ్యద్ ఖలీద్ బ్యాట్ గేజ్‌తో పరీక్షించాడు. ఇందులో నరైన్ బ్యాట్ విఫలం కాగా.. రఘువంశీ బ్యాట్ పాసైంది. దీంతో బ్యాట్‌ను మార్చాల్సిందిగా నరైన్‌కు అంపైర్ సూచించాడు. కాగా, 16వ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన నోకియా బ్యాట్‌ను ఫీల్డ్ అంపైర్ పరీక్షించి తిరస్కరించాడు. దీంతో రిజర్వు ప్లేయర్‌తో హడావిడిగా మరో బ్యాట్‌ను తెప్పించుకొన్నాడు. ఇలా ఇద్దరు కోల్‌కతా ఆటగాళ్లు తమ బ్యాట్లను మార్చాల్సి వచ్చింది. గతంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలా బ్యాట్లు నిర్ణీత ప్రమాణాల ప్రకారం ఉన్నాయా? లేదా? అని చెక్ చేసేవారు. కానీ, గత ఆదివారం నుంచి మైదానంలోనే పరీక్షించడం ఆరంభించారు.

హంపి, హారిక విజయాలు

పుణె: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీ మూడో రౌండ్‌లో కోనేరు హంపి, హారిక విజయాలు సాధించారు. దివ్యా దేశ్‌ముఖ్‌పై హంపి, ఎన్‌గ్యుల్ సలిమోవా (బల్గేరియా)పై హారిక గెలిచారు. మూడు రౌండ్ల తర్వాత హంపి (2 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. హారిక (1.5) ఆరో స్థానంలో నిలిచింది.

సురుచి 'డబుల్'

వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు కైవసం



లిమా (పెరూ): భారత టీనేజ్ షూటర్ సురుచి సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలతో సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజేతగా నిలిచిన సురుచి.. ఆ తర్వాత మిక్స్‌డ్ ఈవెంట్‌లో సౌరభ్ చౌదరితో కలిసి స్వర్ణం నెగ్గడం విశేషం. వ్యక్తిగత ఈవెంట్‌లో సురుచి 243.6 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం దక్కించుకుంది. 242.3 పాయింట్లతో మనూ భాకర్ రెండోస్థానంలో నిలిచి రజతానికి పరిమితమైంది. చైనా షూటర్ యావో కియాన్‌గ్జున్ కాంస్యం అందుకుంది. ఇక, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పతక పోరులో 17-9తో చైనా జోడీని ఓడించి పసిడి దక్కించుకుంది.

ఐపీఎల్‌కు ఫిక్సింగ్ బెడద?

హైదరాబాద్ వ్యాపారిపై బీసీసీఐ అనుమానం

జాగ్రత్తగా ఉండాలని ఫ్రాంచైజీలకు హెచ్చరిక

క్రికెటర్లు, కోచ్‌లు, వ్యాఖ్యాతలకూ సూచన



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మ్యాచ్‌లన్నీ రంజుగా సాగుతున్నాయి. క్రికెట్ అభిమానులంతా ఉత్సుకతతో జట్ల మధ్య పోరును ఆస్వాదిస్తున్నారు. ఇలా సజావుగా సాగిపోతున్న ఈ లీగ్‌లో ఇప్పుడు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) జారీ చేసిన హెచ్చరిక షాక్‌కు గురి చేస్తోంది. ఐపీఎల్‌కు ఫిక్సింగ్ ప్రమాదం పొంచి ఉందంటూ సదరు ఫ్రాంచైజీలకు బీసీసీఐ సమాచారమిచ్చిందన్న వార్త సంచలనం రేపుతోంది. జాతీయ మీడియా కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ బడా వ్యాపారవేత్త మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని బీసీసీఐ అనుమానిస్తోంది. ఈమేరకు అతడు వ్యక్తులను ప్రలోభపెడుతున్నాడని, దాంతో జాగ్రత్తగా ఉండాలని పది ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులను బీసీసీఐ లేఖ ద్వారా హెచ్చరించింది. అలాగే క్రికెటర్లు, కోచ్‌లు, సహాయ సిబ్బంది, వ్యాఖ్యాతలను కూడా బోర్డు అప్రమత్తం చేసింది. సదరు వ్యాపారవేత్తకు బుకీలతో సంబంధాలున్నట్టు బీసీసీఐ అవినీతి వ్యతిరేక, భద్రతా విభాగం (ఏసీఎస్‌యూ) గుర్తించింది. గతంలో బెట్టింగ్‌లు, మ్యాచ్ ఫిక్సింగ్‌లు చేసిన అనుభవం ఉన్న ఆ వ్యాపారవేత్త.. ఈమారు ఐపీఎల్ జట్లు బస చేస్తున్న హోటళ్లలో, మ్యాచ్‌లు జరిగే స్టేడియాల్లో కనిపించాడని ఫ్రాంచైజీలకు రాసిన లేఖలో పేర్కొంది. అయితే, అతను ఎవరన్నది మాత్రం ఆ లేఖలో బహిర్గతం చేయలేదని సమాచారం.

సోషల్ మీడియా ద్వారా..: సోషల్ మీడియా ద్వారా అతను ఆటగాళ్లకు చేరువయ్యే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించింది. ఒకవేళ అతను ఇప్పటికే ఎవరినైనా సంప్రదించి ఉంటే తమకు సమాచారమివ్వాలని సూచించింది. ముఖ్యంగా యువ ఆటగాళ్లు బుకీల వలలో పడి బంగారం లాంటి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని హితవు పలికింది.

గిఫ్టులు, పార్టీలంటూ...: ఐపీఎల్‌తో సంబంధం ఉన్న వ్యక్తులతో ఆ వ్యాపారవేత్త సన్నిహితంగా ఉండేందుకు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం సేకరించింది. తన వ్యూహాలను అమలు చేసేందుకు హోటల్ సిబ్బందితో పాటు జట్టు సిబ్బందిని కూడా ప్రలోభపెడుతుంటాడని పేర్కొంది. అభిమానినని పరిచయం చేసుకొంటూ ఖరీదైన బహుమతులు అందజేయడం, ఫైవ్‌స్టార్ హోటళ్లలో పార్టీలకు తీసుకెళ్లడం అతడి నైజమని తెలిపింది. ఐపీఎల్ జట్ల యజమానుల కుటుంబ సభ్యులు, క్రికెటర్లు, కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు కామెంటేటర్లను సంప్రదించడం ఆ వ్యాపారి బెట్టింగ్ వ్యూహంలో ఒక భాగం అని వెల్లడించింది.

గతంలోనూ..: ఐపీఎల్‌లో ఫిక్సింగ్ వార్తలు గతంలోనూ కలకలం రేపాయి. 2013లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాళ్లు శ్రీశాంత్, అజిత్ చండీలా, అంకిత్ చవాన్ ఫిక్సింగ్ ఆరోపణలతో ఏకంగా అరెస్టవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అంతేకాదు.. బుకీలతో సంబంధాలున్నాయన్న కారణంగా చెన్నై సూపర్‌కింగ్స్ యజమాని గురు మేయప్పన్, రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రాజ్‌కుంద్రాపై వేటు కూడా పడింది. ఈ సంఘటనల తర్వాత అవినీతి నిరోధక విభాగాన్ని బీసీసీఐ మరింత బలోపేతం చేసింది. ఆటగాళ్లకు కఠిన నిబంధనలను విధించింది.

బీసీసీఐ అంబుడ్స్‌మన్ కీలక ఉత్తర్వులు

● ఆగంరావు ఫిర్యాదుపై స్పందన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మినహా తెలంగాణలోని ఇతర జిల్లాలో గత 50 ఏళ్లుగా క్రికెట్ అభివృద్ధిని హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) నిర్లక్ష్యం చేసిందని కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగంరావు ఈనెల 8న బీసీసీఐకి లేఖ ద్వారా ఫిర్యాదు చేశాడు. హెచ్‌సీఏ కేటాయించిన నిధులతో సహా జిల్లాల్లో క్రికెటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను లేఖలో ప్రస్తావించారు. హెచ్‌సీఏలో రెండు జిల్లాల నుంచే 96 శాతం ప్రాతినిధ్యం ఉందని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 33 జిల్లాల ప్రాతిపదికన కొత్త జిల్లాలకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, బీసీసీఐ అంబుడ్స్‌మన్ అరుణ్ కుమార్ మిశ్రా.. బోర్డు నిబంధనల ప్రకారం ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అపెక్స్ కౌన్సిల్‌ను ఆదేశించారు.

బిజినెస్

విప్రోకు టారిఫ్ కష్టాలు

జూన్ త్రైమాసిక ఆదాయ అంచనా 3.5% తగ్గింపు

- క్యూ4 లాభం రూ.3,569 కోట్లు
- ఆదాయం రూ.22,504 కోట్లకు..



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ విప్రో మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి రూ.3,569.6 కోట్ల ఏకీకృత నికర లాభం ఆర్జించింది. వార్షిక ప్రాతిపదికన ఇది 25.9 శాతం అధికం. ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.22,504.2 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంతో పోలిస్తే క్యూ4లో నికర లాభం 6.43 శాతం, ఆదాయం 0.83 శాతం పెరిగాయి. కాగా, క్యూ4లో ఒక్కో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.3.4గా ఉంది. క్యూ3తో పోలిస్తే ఇది 6.2 శాతం పెరగగా.. వార్షిక ప్రాతిపదికన 25.8 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన త్రైమాసికంలో విప్రో ఐటీ సేవల ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారిత) అమెరికన్ కరెన్సీలో 259.65 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే ఇది 1.2 శాతం, వార్షిక ప్రాతిపదికన 2.3 శాతం తగ్గింది. క్యూ4లో నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 1.1 శాతం పెరిగి 17.5 శాతానికి చేరుకుంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి విప్రో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.9 శాతం పెరిగి రూ.13,135.4 కోట్లకు చేరగా.. ఆదాయం మాత్రం 0.74 శాతం తగ్గి రూ.89,088.4 కోట్లకు పరిమితమైంది.

- గత కొన్ని త్రైమాసికాలుగా ఉద్యోగులను తగ్గించుకుంటూ వచ్చిన విప్రో.. క్యూ4లో నికరంగా 614 మందిని చేర్చుకుంది. క్యూ3లో 15.3 శాతంగా నమోదైన ఉద్యోగుల వలసల రేటు 15 శాతానికి తగ్గింది.
- మార్చి 31 నాటికి విప్రో ఉద్యోగుల మొత్తం సంఖ్య 2,33,346గా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఉన్న 2,32,614 మందితో పోలిస్తే గడిచిన ఏడాది కాలంలో ఉద్యోగుల సంఖ్య 732 పెరిగింది.
- మార్చి త్రైమాసికంలో కంపెనీ 395.5 కోట్ల డాలర్ల ఆర్డర్లను దక్కించుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 13.4 శాతం అధికం. అందులో బడా డీల్స్ మాత్రం 48.5 శాతం పెరిగి 176.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి మాత్రం ఆర్డర్లు 3.8 శాతం తగ్గి 1,430 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.
- ప్రాంగణ నియామకాల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక మేరకు 10,000 మంది వరకు ఫ్రెషర్లను నియమించుకున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్‌ఆర్‌ఓ) సౌరభ్ గోవిల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఫ్రెషర్ల నియామకాలు కొనసాగిస్తామన్నారు. ఈ సారి నిర్దిష్ట లక్ష్యమేమీ లేదని తెలిపారు. గతంలో లాగా ఆఫర్ లెటర్లు జారీ చేసి వారిని సంస్థలో చేర్చుకోవడాన్ని వాయిదా వేయకుండా అవసరమైన మేరకు నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు.
- ఈ జనవరి 17న ఒక్కో షేరుకు ప్రకటించిన రూ.6 మధ్యంతర డివిడెండ్‌నే 2024-25 ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌గా కూడా పరిగణించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.

క్లయింట్లు ఆచితూచి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగియనున్న తొలి త్రైమాసికంలో మాత్రం ఐటీ సేవల ఆదాయం 250.5-255.7 డాలర్లకు తగ్గవచ్చని కంపెనీ అంచనా వేసింది. 2024-25 క్యూ4తో పోలిస్తే ఆదాయం 1.5-3.5 శాతం వరకు తగ్గవచ్చని సంస్థ భావిస్తోంది. ట్రంప్ సుంకాల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు పెరగడమే ఇందుకు కారణమని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు. "అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటీ వ్యయాలపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. నిలకడైన, లాభదాయక వృద్ధికి కట్టుబడి ఉంటూనే క్లయింట్లకు మరింత చేరువకావడంపై దృష్టిసారించాం" అన్నారు. ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలను తీవ్రతరం చేయడంతోపాటు అమెరికా ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టవచ్చన్న భయాలున్నాయి. ఈ పరిణామం అమెరికన్ కంపెనీల ఐటీ వ్యయ నిర్ణయాలపై ప్రభావం చూపవచ్చని, ఐటీ సేవలకు డిమాండ్ తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. విప్రోకు అధిక ఆదాయం అమెరికా మార్కెట్ నుంచే సమకూరుతోంది.

కొండెక్కిన పసిడి

రూ.లక్షకు చేరువలో ధర



న్యూఢిల్లీ: పసిడి మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతోంది. 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.లక్షకు చేరువవుతోంది. బుధవారం ఢిల్లీ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో రూ.98,100కు చేరింది. మంగళవారంతో పోలిస్తే ఇది రూ.1,650 ఎక్కువ. కిలో వెండి ధర సైతం రూ.1,900 లాభంతో రూ.99,400కు చేరింది. ఈ నెల 11 తర్వాత పసిడి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటి సారి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ పసిడి ధర మండుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రికార్డు స్థాయిలో 3,328 డాలర్లకు చేరింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.18,710 (23.56 శాతం) పెరిగింది. పసిడి ధర చుక్కలంటడానికి ఈ కింది అంశాలు ప్రధానంగా దోహదం చేస్తున్నాయి.

- అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాలు
- పెట్టుబడిగా పెరిగిన పసిడి కొనుగోళ్లు.
- ఆర్‌బీఐతో సహా అనేక కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
- పెరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ ఉద్రిక్తతలు.

77000 పైన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 309.40 పాయింట్ల లాభంతో 77,044.29 వద్ద, నిఫ్టీ 108.65 పాయింట్ల లాభంతో 23,437.20 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ గత రెండు వారాల్లో ఇంత గరిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 77,110.23-76,543.77 మధ్య ఆటుపోట్లకు లోనైంది. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, టెలికం, ఆర్థిక సేవల కంపెనీల షేర్లకు బుధవారం చక్కటి కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో కంపెనీల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ సంవత్సరం వరుణుడు బాగానే కరుణిస్తాడనే వాతావరణ శాఖ ప్రకటన కూడా ఇందుకు దోహదపడింది.

ఇండస్‌ఇండ్, ఐరెడా షేర్లలో ర్యాలీ : ఇటీవల తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైన ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఐఆర్‌ఈడీఏఎల్ కంపెనీల షేర్ల బుధవారం మంచి లాభాలతో ముగిశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 7.12 శాతం లాభంతో రూ.788.25 వద్ద, ఐఆర్‌ఈడీఏఎల్ షేర్లు 5.57 శాతం లాభంతో రూ.176.40 వద్ద ముగిశాయి.

'ఐసీఐసీఐ' సేవింగ్ డిపాజిట్ రేటు 0.25% తగ్గింపు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ సైతం పొదుపు ఖాతా డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును 0.25 శాతం తగ్గించింది. కొత్త రేటు బుధవారం నుంచే అమలులోకి వస్తుందని బ్యాంక్ స్పష్టం చేసింది. దీంతో రూ.50 లక్షల లోపు సేవింగ్ డిపాజిట్లపై వార్షిక వడ్డీ 2.75 శాతానికి తగ్గింది. రూ.50 లక్షలకు పైగా డిపాజిట్‌పై వడ్డీ 3.25 శాతానికి దిగివచ్చింది. ఈ నెల 9న ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడంతో బ్యాంక్‌లు ఒక్కొక్కటిగా డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	130
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	95
కర్నూలు	130	నెల్లూరు	100
విశాఖపట్నం	124	అనంతపురం	100
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	96,170 ▲	88,150 ▲	1,10,000 ▲
విజయవాడ	98,000 ▲	92,000 ▲	98,000 ▲
విశాఖపట్నం	95,660 ▲	87,690 ▲	96,790 ▲
రాజమండ్రి	95,510 ▲	87,550 ▲	97,600 ▼
ప్రొద్దుటూరు	93,800 ▲	86,110 ▲	98,500 ▲
ముంబై	94,580 ▲	86,630 ▲	96,575 ▲

కేఫిన్‌టెక్ చేతికి సింగపూర్ కంపెనీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేఫిన్ టెక్నాలజీస్ తన అంతర్జాతీయ ఫండ్ నిర్వహణ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ కేంద్రంగా పని చేసే యాక్సెంట్ ఫండ్ సర్వీసెస్ పీటీఈ లిమిటెడ్ కంపెనీ ఈక్విటీలో 51 శాతం వాటాను 3.47 కోట్ల డాలర్లకు (సుమారు రూ.297.30 కోట్లు) కొనుగోలు చేసింది. మిగతా 49 శాతం వాటానూ వచ్చే ఐదేళ్లలో మూడు సమాన వాయిదాల్లో కొనుగోలు చేస్తామని కేఫిన్ టెక్నాలజీస్ తెలిపింది. యాక్సెంట్ 18 దేశాల్లోని 260 అంతర్జాతీయ ప్రత్యామ్నాయ పెట్టుబడుల నిర్వహణ సంస్థలకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థలు వివిధ పెట్టుబడులకు సంబంధించి 576 ఫండ్స్ నిర్వహిస్తున్నట్టు పేర్కొంది.

పతంజలి చేతికి మాగ్మా ఇన్సూరెన్స్

న్యూఢిల్లీ : యోగా గురువు బాబా రాందేవ్ నాయకత్వంలోని పతంజలి ఆయుర్వేద్ కంపెనీ బీమా రంగంలోకి ప్రవేశిస్తోంది. మరో ఐదు సంస్థలతో కలిసి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈక్విటీలో 98.05 శాతం వాటా కొనుగోలు చేసేందుకు కాంపిటిషన్ కమిషన్ (సీసీఐ) ఆమోదం తెలిపింది. పతంజలితో పాటు ఎస్ఆర్ ఫౌండేషన్, రితి ఫౌండేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్, సురుచి ఫౌండేషన్, స్వాతి ఫౌండేషన్ ఈ లావాదేవీలో భాగస్వాములవుతున్నాయి. సీసీఐ గ్రీన్ సిగ్నల్‌తో బీమా రంగంలో ప్రవేశించేందుకు పతంజలి ఆయుర్వేద్‌కు మార్గం సుగమమైంది.

విమానయానంపై రూ.20 లక్షల కోట్ల పెట్టుబడి

ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియాపై ఏసీఐ అంచనా.. వచ్చే ఏడాదికి చైనాను అధిగమించనున్న భారత్

న్యూఢిల్లీ: వచ్చే పదేళ్ల కాలంలో ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతాల్లో మొత్తం 124 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అవసరమైన వసతులు కల్పించేందుకు విమానయాన రంగంలోకి 24 వేల కోట్ల డాలర్ల (రూ.20.40 లక్షల కోట్లు) పెట్టుబడులు రానున్నట్టు ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) అంచనా వేసింది. 68 కోట్ల మంది అదనపు ప్రయాణికుల సామర్థ్యం, 1.4 కోట్ల టన్నుల అదనపు కార్గో సామర్థ్యం జోడు కానున్నట్టు తాజా నివేదికలో తెలిపింది. 30 కీలక ప్రాంతీయ విమానాశ్రయాలపై ఏసీఐ సమగ్ర సర్వే నిర్వహించి ఈ నివేదిక రూపొందించింది. పదేళ్లలో చేసే ఈ భారీ పెట్టుబడి కేవలం కాంక్రీట్, రన్‌వేలకే పరిమితం కాదని; సమగ్ర సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ పెట్టుబడులు దోహదపడతాయని ఏసీఐ ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంత ప్రెసిడెంట్ ఎస్‌జీకే కిశోర్ అన్నారు. రాబోయే 5-10 సంవత్సరాల కాలంలో భారత్‌లో భారీ విమానయాన హబ్‌లు అభివృద్ధి చెందనున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశీయ విమానయాన సంస్థల చేతిలో 1700 కొత్త విమానాలకు ఆర్డర్లున్నాయని ఆయన తెలిపారు.

విమానయానంలో 10.5% వృద్ధి: వచ్చే ఏడాది నాటికి భారత్ విమాన ప్రయాణికుల సంఖ్యలో 10.5% వృద్ధితో పొరుగు దేశం చైనాను అధిగమించనున్నదని ఏసీఐ అంచనా వేసింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉంది.



దాసోజు శ్రవణ్‌తో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. చిత్రంలో కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు

ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ ప్రమాణం

» ప్రమాణ స్వీకారం చేయించిన మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఇటీవల ఎన్నికైన బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ప్రమాణ స్వీకారం చేశారు. మండలి ప్రాంగణంలో బుధవారం మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, పద్మారావు గౌడ్ తదితరులు హాజరయ్యారు. అంతకు ముందు దాసోజు శ్రవణ్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి శాసన మండలికి చేరుకున్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ కార్యకర్తగా పద్దెనిమిదేళ్లు ఉన్నానని, మాజీ సీఎం కేసీఆర్ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం రాజకీయ పునర్జన్మగా భావిస్తున్నానని చెప్పారు.

రాష్ట్రంలో తాగునీటి కోసం ప్రజల ఆర్తనాదాలు..!

» రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలి: హరీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంతవరకు సాగునీళ్లకోసం రైతన్నలు గోస పడితే, ఇప్పుడు తాగునీటి కోసం ప్రజలు ఆర్తనాదాలు పెడుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. మిషన్ భగీరథ నిర్వహణలో రాష్ట్రప్రభుత్వ వైఫల్యం కనబడుతోందని, నల్లాల ద్వారా నీటిసరఫరా చేయని దైన్య స్థితి నెలకొందని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల్లో నీళ్లను ఒడిసిపట్టకపోవడం, చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అట్టడుగుకు చేరుతున్నాయని, ముందు చూపులేని కాంగ్రెస్ పాలనలో పొలాలు తడారి ప్రజల బతుకులు ఎడారయి పోతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి తాగు నీళ్లిస్తే, రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించడం లేదని, ఉమ్మడి పాలన నాటి బిందెలు, డ్రమ్ములు రోడ్లపై కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగునీటిని అందించాలని సూచించారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం, చేతకానితనం వల్లే ఏపీ అక్రమంగా కృష్ణా జలాలను తరలించుకుపోయిందని, ఈ జల దోపిడీని అడ్డుకోలేని దద్దమ్మలుగా రాష్ట్ర సీఎం, మంత్రులు మిగిలిపోయారని మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణాజలాలను ఏపీ అక్రమంగా తరలిస్తోందని బీఆర్ఎస్ ఎప్పటి నుంచో చెబుతోందని.. తాము చెప్పిన విషయం నిజమని కేఆర్ఎంబీ రుజువు చేసిందన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు పెట్టాలి

» విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనంలో వేదిక నేతల డిమాండ్

పంజాగుట్ట, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరువలేనిదని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనంలో వక్తలు కోరారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక (టీవీయూవీ), తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ(టీయూజేఏసీ)ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలను గ్రంథస్థం చేయాలని కోదండరాం సూచించారు. ఉద్యమకారులపై పెట్టిన అన్ని కేసులు ఎత్తివేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని వేదిక నాయకులు డిమాండ్ చేశారు.

హైడ్రా పేరుతో వసూళ్లు

» సోషల్ మీడియాలో వైరలవుతున్న నకిలీ లేఖ

» సైబర్ క్రైమ్‌కు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ ఫిర్యాదు

హైదరాబాద్, అమీన్‌పూర్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో తాను వసూళ్లకు పాల్పడుతున్నట్లు అమీన్‌పూర్ సంక్షేమ సంఘం పేరుతో ఒక నకిలీ లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోందని, దీని వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ.ఫహీమ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు.. ఇవ్వని పక్షంలో సీఎం సాయంతో హైడ్రా అధికారులను పంపించి ఇళ్లు కూల్చి వేస్తానంటూ బెదిరించినట్లుగా ఆ లేఖలో ప్రస్తావించారని సైబర్‌క్రైమ్ దృష్టికి తెచ్చారు. ఆ లేఖ నకిలీ లేఖ అని ఇప్పటికే పోలీసులు తేల్చారన్నారు. రాజకీయంగా కక్ష సాధింపులో భాగంగానే ఆ లేఖను సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారని, దీని వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందని ఆయన అన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన పోలీసులను కోరారు.

నిరుద్యోగుల మధ్య బీఆర్ఎస్ చిచ్చు : కాంగ్రెస్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ - 1 పరీక్షల ఫలితాలపై ఆరోపణలు చేస్తూ నిరుద్యోగుల మధ్య చిచ్చు పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ విమర్శించారు. పరీక్ష పేపర్లను పొట్లాలు కట్టి అమ్మిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదైతే.. గ్రూప్ 1 పరీక్షను పాదర్శకంగా నిర్వహించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. నిరుద్యోగ యువత అంతా గమనిస్తోందని, బీఆర్ఎస్ పార్టీకి సరైన సమయంలో బుద్ధి చెబుతుందని ఆయన అన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

» ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

కవాడిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే క్రమబద్ధీకరించాలని, ఆతర్వాతే వర్సిటీల్లో నియామకాలు చేపట్టాలని రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద బుధవారం మహాధర్నా జరిగింది. ఈ మహాధర్నాకు పలువురు ప్రముఖులు విచ్చేసి.. వారికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా ఉండే గౌరవాన్ని కాంట్రాక్టు వ్యవస్థ నిర్వీర్యం చేసిందన్నారు. ప్రపంచబ్యాంకు విధించిన షరతుల మేరకు కాంట్రాక్టు వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. 15-20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 12 వర్సిటీల్లో పనిచేస్తున్న దాదాపు 1200 కాంట్రాక్టు అధ్యాపకులు 15-20 ఏళ్లుగా పనిచేస్తున్నారని.. ఎలాంటి షరతులు లేకుండా అందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్సీ మదుసుధనాచారి, సీపీఎంరాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీజే నర్సింగ్ రావు, టీపీసీసీ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పునరుద్ధరిస్తారా.. జైలుకెళ్తారా?

(మొదటిపేజీ తరువాయి)

సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై సుప్రీం ఆదేశాల మేరకు.. 263 పేజీలతో కూడిన సుదీర్ఘ అఫిడవిట్‌ను తెలంగాణ ప్రభుత్వం సమర్పించింది. సుమోటో కేసుతోపాటే బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ సైతం దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అమికస్ క్యూరీలు పరమేశ్వర్, గోపాల్ శంకర్ నారాయణ్, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వి, మేనక గురుస్వామి, బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, పి.మోహిత్ రావు, భారత ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా, ఇంప్లీడ్ పిటిషన్ ద్వారా సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి హాజరయ్యారు.

నిబంధన ప్రకారమే..

కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానికి చెందిన వేనని, అక్కడ అటవీ భూమి లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. అన్ని అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, ఇతర పొదల్ని తొలగించామని తెలిపారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించామని గుర్తుచేశారు. ఇంతలో అమికస్ క్యూరీ పరమేశ్వర్ జోక్యం చేసుకుని.. తెలంగాణలో వాల్టా చట్టం ఉందని, దాన్ని సైతం విస్మరించారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి జస్టిస్ గవాయి.. అనుమతులు తీసుకోకపోతే సీఎస్ సహా సంబంధిత అధికారులు అందరినీ జైళ్లకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే, ఆ భూమి కోసం 2004 నుంచి ప్రభుత్వం న్యాయ పోరాటం చేస్తోందని అభిషేక్ మను సింఘ్వి తన వాదనలను కొనసాగించారు. 2024లో అది తెలంగాణ ప్రభుత్వానికే చెందుతుందని న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఇన్నేళ్లుగా ఆ భూమిపై ఎవరు మాట్లాడలేదని, కానీ తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి భూమిని కేటాయించిన తర్వాతే ఆ భూమి అటవీ శాఖదనే వాదన పుట్టుకొచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో అక్కడ పనులు ప్రారంభించిందని, కానీ కొందరు కావాలనే అసత్య ప్రచారాలతో అందరినీ తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. దీనికి జస్టిస్ గవాయి.. చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారో లేదో చెప్పాలని, అంతేతప్ప వందెకరాల్లో చెట్లను తొలగించడాన్ని సమర్థించుకోవద్దని హెచ్చరించారు.

ఒక్క చెట్టూ..

పర్యావరణ పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని విచారణ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. "చెట్ల నరికివేత తీవ్రమైన అంశం. పర్యావరణ పరిరక్షణకు వ్యతిరేకంగా చెట్లను నరికివేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పండి. వారాంతపు సెలవుల్లో మూడు రోజుల్లో అంత హడావుడిగా చెట్లు కొట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? డజన్ల కొద్దీ బుల్‌డోజర్లతో అడవిని వంద ఎకరాల్లో అత్యవసరంగా తొలగించాల్సిన అత్యవసమేంటో చెప్పండి? సరిహద్దుకు సులభమైన అనుసంధానం కల్పించే, దళాల కదలికను తెలిపే చార్‌ధామ్ రోడ్ల వంటి ముఖ్యమైన ప్రాజెక్టుల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం ఈ కోర్టులో సంవత్సరాల తరబడి పోరాడాల్సి వచ్చింది. మహారాష్ట్రలో సచివాలయ నిర్మాణం కేసు రెండు దశాబ్దాలుగా సుప్రీంకోర్టులో ఉంది" అని పేర్కొంది. ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి మహా నగరాల్లోని అటవీ భూములను కాపాడుకోపోతే ఎలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. తమకు ప్రభుత్వాల గురించి ఆందోళన లేదని.. కేవలం మూడు రోజుల్లో 100 ఎకరాలను నాశనం చేయడానికి డజన్ల కొద్దీ బుల్‌డోజర్లను మోహరించడం గురించి మాత్రమే తాము ఆందోళన వ్యక్తం చేస్తున్నామని పేర్కొంది. "అవసరమనుకుంటే.. వందెకరాలే కాదు, అక్కడ 2,400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టొద్దని ఆదేశాలివ్వాల్సి వస్తుంది.." అని ధర్మాసనం హెచ్చరించింది.



సంబంధం లేదు...

కంచ గచ్చిబౌలిలో చెట్ల నరికివేత గత సుప్రీం తీర్పునకు విరుద్ధమని.. కానీ, తెలంగాణ సర్కారు స్వీయ ధ్రువీకరణ చేసుకుని చెట్లను తొలగించినట్టు కనిపిస్తోందని అమికస్ క్యూరీ పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఆ భూములను తాకట్టు పెట్టి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు అప్పుగా తీసుకున్నట్టు కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) నివేదిక చెబుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ అంశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు. మంత్రుల ఆదేశాల ప్రకారం సీఎస్ అనుమతితోనే అక్కడ చెట్ల నరికివేత జరిగిందని స్పష్టం చేశారు. అయితే.. అధికారులు, మంత్రుల వివరణలు, ఆదేశాలను తాము పరిగణనలోకి తీసుకోబోమని, అక్కడ 1996 సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకున్నారా? లేదా? అనేదే తమకు ముఖ్యమని ధర్మాసనం తెలిపింది. ఆ భూములను మార్టిగేజ్ చేశారా? అమ్ముకున్నారా? అనేది తమకు అనవసరమని స్పష్టం చేసింది. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి తీసుకున్నారా? లేదా? అనేది మాత్రమే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. కాగా.. ఆ సమయంలో సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టిని కొన్ని ఫొటోలను తీసుకెళ్లారు. వందెకరాల్లో విధ్వంసం జరిగిందని, అక్కడ వన్యప్రాణులు, పక్షులు ఎలా ఇబ్బంది పడ్డాయనే వాటిని వివరించారు. జంతువులను సురక్షించడం, నీటి సరఫరాను పునరుద్ధరించడం వంటి వాటి గురించి ఆయన ప్రస్తావించారు. దీంతో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. దీనికి సంబంధించి ఏ చర్యలు తీసుకున్నారో తదుపరి విచారణ తేదీన తమకు వివరించాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి పేరుతో..

ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అభిషేక్ మను సింఘ్వి.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి వేల ఎకరాల భూమి ఉందని, అందులో 400 ఎకరాల భూవివాదం 2004 నుంచి కొనసాగుతోందని మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఇరవై ఏళ్లలో ఆ పరిసర ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ నిర్ణయంతో అక్కడ ఎంతోమందికి జీవనోపాధి, ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు. ఆ భూములపై ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అయితే.. అభివృద్ధి, ఉద్యోగాల కల్పన పేరుతో పర్యావరణాన్ని విధ్వంసం చేస్తామంటే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని జస్టిస్ గవాయి మరోసారి హెచ్చరించారు. మూడు రోజుల్లోనే వందెకరాలను విధ్వంసం చేశారన్న ఆయన.. అందుకు ఎన్ని బుల్‌డోజర్లు వాడారు, ఇప్పటికైనా బుల్‌డోజర్లను అక్కడి నుంచి తొలగించారా? లేదా? అనే విషయాన్ని సీఎస్ చెప్పాలన్నారు. దీనికి సింఘ్వీ.. సుప్రీంకోర్టు ఆదేశించిన వెంటనే అక్కడ పనులన్నీ ఆపేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిళ అని.. ఆమె కేవలం సమన్వయ అధికారి మాత్రమేనని, నెలరోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నారని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి జస్టిస్ గవాయి.. "సీఎస్‌ను కాపాడాలనుకుంటే వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పండి. పునరుద్ధరణ ప్రణాళికతో ముందుకు రండి. ఎలా చేస్తారో, అందుకు ఎంతకాలం పడుతుందో, జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పండి. పర్యావరణ, వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయండి" అని ఆదేశించారు. అయితే, సీఈసీ నివేదికపై సమగ్ర వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని.. అందుకు తమకు కొంత సమయం కావాలని సింఘ్వి ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నాలుగు వారాల సమయం ఇచ్చి, తదుపరి విచారణను మే 15కు వాయిదా వేసింది. అప్పటి వరకూ కంచ గచ్చిబౌలి భూములపై యథాతథ స్థితి కొనసాగుతుందని తెలిపింది.

సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం

» రేవంత్‌కు జ్ఞానోదయం అవుతుందని ఆశిస్తున్నాం: కేటీఆర్

» కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు: హరీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల్లో అడవిని పునరుద్ధరించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. వన్యప్రాణులను కాపాడాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌కు ఆదేశాలివ్వడం గొప్ప విజయమని బుధవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు పర్యావరణ ప్రేమికులతోపాటు కంచ గచ్చిబౌలి భూముల కోసం పోరాడిన ప్రతి ఒక్కరి విజయమన్నారు. భూముల తనఖా వ్యవహారంలో పదివేల కోట్ల ఆర్థిక మోసం జరిగి ఉండొచ్చన్న కేంద్ర సాధికార కమిటీ సిఫారసులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అటవీ భూముల్ని ప్రైవేట్ సంస్థకు తాకట్టు పెట్టడంలో ఆర్థిక మోసం జరిగిందని బీఆర్ఎస్ చేసిన ఆరోపణలకు సుప్రీంకోర్టు ఆదేశాలతో మరింత బలంచేకూరిందన్నారు. సుప్రీం ఆదేశాలతోనైనా రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం అవుతుందని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పర్యావరణాన్ని ధ్వంసం చేసి తప్పించుకుందామనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆటలు ఇకపై సాగవన్నారు. మూగ జీవాల కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించిన హెచ్‌సీయూ విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వారి అవిశ్రాంత కృషితోనే 400 ఎకరాల అడవిని కాపాడుకోగలిగామన్నారు. 10 వేల కోట్ల తెలంగాణ సంపదను సీఎం దోచుకోవాలనుకున్నారని బీఆర్ఎస్ చేస్తున్న వాదనలో వంద శాతం నిజం ఉందన్న సంగతి సుప్రీం ఆదేశాలతో తేటతెల్లమైందని చెప్పారు. తెలంగాణ ప్రజలకు, రాష్ట్రంలోని అడవులు, వన్యప్రాణులకు రేవంత్‌రెడ్డి ప్రధాన విలన్ అన్న సంగతి మరోసారి రుజువైందని తెలిపారు.

రేవంత్‌కు బుద్ధి చెప్పాలి: హరీశ్

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం కావాలనే సెలవు దినాల్లో బుల్డోజర్లతో విధ్వంసానికి పాల్పడిందని ఆరోపించారు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని సుప్రీం నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ప్రభుత్వం చేసిన పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సర్వోన్నత న్యాయస్థానంలో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైందని చెప్పారు. వృక్షో రక్షతి రక్షితః అని పెద్దలంటే.. వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలని హరీశ్ పిలుపునిచ్చారు.

స్మితా సబర్వాల్‌కు నోటీసులు

రాయదుర్గం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ని ఉపయోగించి సృష్టించిన ఫొటోను ఎక్స్‌లో రీపోస్టు చేసినందుకు ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కొందరు ఏఐని ఉపయోగించి.. కంచ గచ్చిబౌలిలోని భూమిని చదును చేస్తున్నప్పుడు జింకలు, నెమళ్లు దీన స్థితిలో చూస్తున్నట్లు ఉన్న ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అలా మార్చి 31న ఓ నెటిజన్ పోస్ట్ చేసిన ఓ ఫొటోను స్మితాసబర్వాల్ రీపోస్ట్ చేశారు. దాంతో ఆమెను 12న పోలీసులు నోటీసులు జారీ చేశారు.

జీపీవో పోస్టుల అప్లన్ల గడువును 26 దాకా పెంచండి

» హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిపాలన అధికారుల(జీపీవో) భర్తీకి సంబంధించి గూగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు అప్లన్లు ఇచ్చేందుకు తుది గడువును ఈ నెల 26వ తేదీ వరకు పెంచాలని హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చట్టబద్ధమైన నిబంధనలు, సర్వీస్ రూల్స్ తెలియజేయకుండా జీపీవో పోస్టుల భర్తీకి జీవో 129 అమలులో భాగంగా ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదంటూ వీఆర్వోల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్, తమ సర్వీసును లెక్కలోకి తీసుకోకపోవడం చెల్లదని పలువురు జూనియర్ అసిస్టెంట్లు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. గూగుల్ ఫామ్ ద్వారా ఇచ్చే అప్లన్ల చివరి తేదీని ఈనెల 16 నుంచి 26 వరకు పెంచాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఈ వ్యవహారంలో వైఖరి తెలియజేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

అది ప్రభుత్వ పోరంబోకు భూమి

1955 నుంచి అనేక సంస్థలకు కేటాయించారు.. ఏనాడూ అటవీ భూమిగా నమోదు కాలేదు

» 165 చిన్న, మధ్యతరహా చెట్లనే తొలగించాం

» భారీ యంత్రాలను ఉపయోగించలేదు

» నకిలీ వీడియోలతో తప్పుడు ప్రచారం

» వాస్తవాలు చూసి నిర్ణయం తీసుకోండి

» అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలో ఉన్నది అటవీ భూమి కాదని, అది ప్రభుత్వ పోరంబోకు భూమి మాత్రమేనని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం నివేదించింది. అక్కడ 400 ఎకరాల్లో పర్యావరణ అనుకూల ఐటీ పార్కు నిర్మించాలని భావించామని వివరించింది. అక్కడి జంతువులు, జలాశయాలను పరిరక్షిస్తూనే ప్రాజెక్టును అమలు చేస్తామని తెలిపింది. కంచ గచ్చిబౌలికి సంబంధించి నకిలీ చిత్రాలు, వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోరింది.

వర్సిటీ నుంచి జంతువులు, పక్షులు..

ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన 400 ఎకరాల భూమి కంచ గచ్చిబౌలి గ్రామంలో ఉన్న 2,374.02 ఎకరాల్లో భాగమని ప్రభుత్వం వివరించింది. 2003లో అప్పటి ప్రభుత్వం ఈ భూమిని క్రీడల కోచింగ్ అకాడమీ నెలకొల్పడం కోసం ఐఎంజీ భారత్ అకడమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అమ్మిందని తెలిపింది. తర్వాత ఏడాదిలో ప్రభుత్వం మారడంతో కొత్త ప్రభుత్వం ఈ కేటాయింపును రద్దు చేసిందని వివరించింది. దీనిపై హైకోర్టులో విచారణ కొనసాగిందని, చివరికి 2024 మేలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపింది. ఈ క్రమంలో 2003 నుంచి 2024 మధ్య ఆ ప్రాంతంలో చెట్లు, పొదలు పెరిగాయని వెల్లడించింది. దానికి పక్కనే ఉన్న హెచ్‌సీయూలో భారీగా హరిత ప్రాంతం ఉందని, అందులో జింకలు, పక్షులు విహరించేవని పేర్కొంది. వర్సిటీ భూమికి, ప్రస్తుత భూవికి మధ్య కంచె లేకపోవడంతో జింకలు, నెమళ్లు, ఇతర పక్షులు అప్పుడప్పుడూ అటూ ఇటూ వచ్చేవని తెలిపింది. ఈ మొత్తం ప్రాంతంలో నాలుగు చెరువులను గుర్తించామని.. అందులో మూడు ప్రభుత్వానికి చెందిన 400 ఎకరాల్లో లేవని వివరించింది. మిగతా ఒక్క చిలుకల కుంట నైరుతి ప్రాంతంలో ఉందని, దాన్ని సురక్షితంగా ఉంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపింది.

కూల్చినవి చిన్న, మధ్యతరహా చెట్లే..

టీజీఐఐసీ అనుమతులు తీసుకుని 165 చిన్న, మధ్య తరహా చెట్లను భారీ యంత్రాలు ఉపయోగించకుండా కూల్చివేసిందని ప్రభుత్వం అఫిడవిట్‌లో వివరించింది. ఈ 400 ఎకరాల్లో పర్యావరణ అనుకూల ఐటీ పార్కును అభివృద్ధి చేయాలని భావించినట్టు తెలిపింది. భూమిని వివిధ పరిమాణాల్లో ప్లాట్లుగా విభజించి, ఐటీ సంబంధిత వాణిజ్య ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు తగిన డెవలపర్లను గుర్తించాలని అనుకున్నామని వెల్లడించింది. ప్రతీ ప్రాపర్టీ డెవలపర్ తమ ప్రాజెక్టుల కోసం పర్యావరణ అనుమతులు పొందాల్సి ఉంటుందని.. హరిత ప్రాంతం కోసం పలు ప్లాట్లను గుర్తించి అక్కడ ప్రభుత్వం చెట్లను నాటుతుందని వివరించింది. కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25లో భాగమైన ఈ 400 ఎకరాల భూమిని ఏనాడూ రికార్డుల్లో అటవీ భూమిగా గుర్తించలేదని.. ప్రభుత్వ పోరంబోకుగా మాత్రమే గుర్తించామని అఫిడవిట్‌లో తెలిపింది. 1975లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు, 1990లో ఎమ్మార్వో కార్యాలయానికి, 1991లో ఆర్టీసీ డిపోకు, నవోదయ స్కూలుకు, 1992లో బీఎస్ఎన్ఎల్‌కు, 1997లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు, 2006లో ట్రిపుల్ ఐటీకి, 2017లో అప్రోచ్ రోడ్డుకు ఇదే ప్రాంతంలో అనుమతులు లభించాయని వివరించింది. అంతేగాకుండా ఒక క్రీడల సంస్థ స్టేడియంతో పాటు టీఎన్‌జీవో సహా ఇతర హౌసింగ్ సొసైటీలకు ఇక్కడే భూమి లభించిందని తెలిపింది. మొత్తం భూమి 1955, 1956 నుంచే కంచ పోరంబోకు సర్కారీ భూమిగా.. అంటే ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని గుర్తు చేసింది. అంతేగాక అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నందున దాన్ని అటవీ భూమిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

నకిలీ చిత్రాలతో దుష్ప్రచారం.


పర్యావరణ పరిరక్షణకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొంతమంది టెక్నాలజీని దుర్వినియోగం చేసి నకిలీ చిత్రాలు, వీడియోల ద్వారా కంచ గచ్చిబౌలి భూములపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని వివరించింది. ఇందుకు తమవద్ద నిర్దిష్ట సాక్ష్యాలున్నాయని తెలిపింది.నకిలీ ఫొటోలు, వీడియోల సాక్ష్యాలను కోర్టుకు సమర్పించింది. వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించింది. ఇప్పటికే ఉన్న చెట్లను పరిరక్షిస్తున్నామని, ఏప్రిల్ 3 నాటి కోర్టు ఆదేశాల తర్వాత ఎలాంటి కార్యకలాపాలను అనుమతించడం లేదని తెలిపింది. ఈ అంశంలో కోర్టు ఆదేశాలను పాటిస్తామని తెలిపింది.

ఆ భూమి ప్రభుత్వానిదని సుప్రీంకోర్టే చెప్పింది

» చట్టానికి లోబడి కంచ గచ్చిబౌలి భూమిని కాపాడుకుంటాం

» నకిలీ ఫొటోలు వ్యవస్థల్నీ ప్రభావితం చేశాయి

» సుప్రీంకోర్టుపై గౌరవం ఉంది.. ఆదేశాలు పాటిస్తాం:మంత్రి దుద్దిళ్ల



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూమి ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టే చెప్పిందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. చట్టానికి లోబడి దాన్ని కాపాడుకుంటామని చెప్పారు. ఈ భూములపై బీఆర్ఎస్ నేతలు విష ప్రచారం చేశారన్నారు. నకిలీ వీడియోలు, ఫొటోలు అన్ని వ్యవస్థలనూ ప్రభావితం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతల తప్పుడు సమాచారాన్ని నమ్మిన కేంద్ర మంత్రులూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారన్నారు. ఆ తర్వాత వాటిని తొలగించారని గుర్తుచేశారు. రాష్ట్ర బీజేపీ నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ప్రధాని మోదీ ఈ భూములపై మాట్లాడారన్నారు. సుప్రీం కోర్టుపై తమకు గౌరవం ఉందని, కంచ గచ్చిబౌలి భూములపై కోర్టు ఆదేశాలు తప్పక పాటిస్తామని చెప్పారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ఎక్కువగా మాట్లాడబోనన్నారు. సుప్రీంకోర్టు అడిగిన ప్రతి అంశంపైనా వివరంగా సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జనావాసాల్లోకి నెమళ్లు రావడం సర్వసాధారణమన్నారు. ఈ భూమిలో వన్యప్రాణులంటే.. ఏనుగులు ఉన్నాయా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలికి సంబంధించి ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ పోస్టుపై చట్ట పరంగా ముందుకు వెళతామని చెప్పారు. గాంధీభవన్‌లో శ్రీధర్‌బాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ ప్రభుత్వాన్ని కూలగొడతామని బీఆర్ఎస్ మొదటి నుంచీ అంటోందని, ఆ మేరకు కుట్ర కూడా చేసిందని అన్నారు. తమ సర్కారు కూలగొడితే కూలిపోయేది కాదన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీలు కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఏఐసీసీ సిద్ధాంతాలకు లోబడే తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీనియర్ నేత జానారెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు కట్టుబడి మాట్లాడే వ్యక్తి అని చెప్పారు. ధరణి భూముల వివాదంపై ఆడిటింగ్ జరుగుతుందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ చార్జిషీటులో సోనియా, రాహుల్ పేర్లు చేర్చారని ఆరోపించారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే..

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈడీ చార్జిషీట్ దాఖలు చేశారని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. దేశంలో ప్రతిపక్షం బలంగా ఉండకూడదన్న దురుద్దేశంతోనే బీజేపీ సర్కారు అక్రమ కేసులతో వేధిస్తోందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయాలను గౌరవిస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. అయితే ఛత్తీస్‌గఢ్ అడవుల నరికివేతపైనా కోర్టు స్పందించాలన్నారు. అక్కడ 2.72 లక్షల ఎకరాల్లో 9.20 లక్షల చెట్లను ఎలాంటి అనుమతులూ లేకుండా అదానీ కంపెనీ ఎలా నరికివేస్తోందని ప్రశ్నించారు.

రాజీవ్ యువ వికాసానికి సహకరించండి

» బ్యాంకర్లను కోరిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవన ప్రమాణాలు పెరిగి వారి జీవితాలు మారుతాయని.. రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్‌గా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ఈ పథకం అమలుపై బ్యాంకర్లతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియ పూర్తికావడంతో వెంటనే భట్టి బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకాన్ని ఒక సాధారణ సంక్షేమ పథకంగా చూడవద్దని బ్యాంకర్లను కోరారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే ఇంకా మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి ఏడాదిలో రూ.6 వేల కోట్లు ఖర్చు పెడుతుందని.. బ్యాంకర్లు రూ.1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలని భట్టి కోరారు.

పార్లమెంటుకు హాజరులో చామల ఫస్ట్

» ఎంపీగా ఎన్నికైన దగ్గర్నుంచి వంద శాతం హాజరు

» రాష్ట్రం నుంచి తర్వాతి స్థానంలో రఘునందన్‌రావు

» ప్రశ్నలు వేయడంలో ఈటల.. చర్చల్లో ఒవైసీ టాప్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఎంపీలు పార్లమెంటుకు హాజరవుతున్న తీరు, సభలో వారు లేవనెత్తుతున్న ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడంపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పటిదాకా జరిగిన పార్లమెంటు సమావేశాల్లో పూర్తి స్థాయిలో పాల్గొని.. వంద శాతం హాజరుతో మొదటి స్థానంలో నిలిచారు. ఆయన తర్వాత మెదక్ ఎంపీ రఘునందన్‌రావు 97.05 శాతం హాజరుతో రెండో స్థానంలో ఉన్నారు. ఇక మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్.. పార్లమెంటులో అందరికంటే ఎక్కువగా 80 ప్రశ్నలు లేవనెత్తి చురుకైన పార్లమెంటేరియన్‌గా నిలిచారు. చర్చల్లో పాల్గొనడంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ (21 చర్చలు) మొదటి స్థానంలో ఉన్నారు. అయితే 79 ప్రశ్నలు, 17 చర్చల్లో పాల్గొన్న చామల ఈ రెండు విషయాల్లోనూ రెండో స్థానంలో నిలిచారు. ఈటల రాజేందర్ 9 చర్చల్లో పాల్గొన్నారు. కాగా, రఘునందన్‌రావు 46 ప్రశ్నలు అడిగి, ఏడు చర్చలకు హాజరయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 95.58 శాతం లోక్‌సభ సమావేశాలకు హాజరయి, 18 ప్రశ్నలను లేవనెత్తి, ఆరు చర్చలలో పాల్గొన్నారు. కాగా, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అతి తక్కువ హాజరు, చర్చలు, ప్రశ్నలతో చివరిస్థానంలో నిలిచారు. ఆయన హాజరు శాతం కేవలం 72.05 శాతం మాత్రమే ఉంది. ఇప్పటివరకు 8 ప్రశ్నలు మాత్రమే అడిగారు. ఒక్క చర్చలో కూడా మాట్లాడలేదు.

మెస్సేజ్ పెట్టు.. అపాయింట్‌మెంట్ పట్టు

» మంత్రి పొన్నం ప్రభాకర్ వినూత్న ఆలోచన



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో తనను కలిసేందుకు వచ్చే వారిని దృష్టిలో పెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. తనను కలిసేందుకు వచ్చే వారి కోసం ఓ వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు సచివాలయంలోని తన చాంబర్ ఎదుట "మంత్రి అపాయింట్‌మెంట్ కోసం 9959226407 నంబర్‌కు వాట్సాప్‌లో మెసేజ్ చేయండి" అంటూ ఒక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ ఆలోచన సత్ఫలితాలను ఇస్తోందని మంత్రి కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఇలా మెసేజ్‌లు చేసిన వారితో మాట్లాడేందుకు ప్రత్యేకంగా ఒక రోజును మంత్రి కేటాయిస్తున్నారని చెప్పారు.

అన్ని ఆలయాల్లో సేవలు డిజిటలైజ్ చేయండి

» అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భక్తులకు అందించే సేవలను డిజిటలైజ్ చేయాలని దేవాదాయ శాఖ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. భక్తులకు అందించే సేవల్లో పారదర్శకత పాటించాలని, ఇందుకు అవసరమైన టెక్నాలజీని ఉపయోగించాలని చెప్పారు. సచివాలయంలో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

'సీతారామ' అనుమతులపై 24న టీఏసీ భేటీ

సీతారామ ఎత్తిపోతల పథకంకు సాంకేతిక అనుమతినిచ్చే అంశంపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా మండలి(టీఏసీ) సమావేశం 24న జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈ సమావేశం ఉంటుంది. వాస్తవానికి ఫిబ్రవరి 11న జరిగిన 157వ టీఏసీలోనే సీతారామకు అనుమతి రావాల్సి ఉంది. కానీ, మేడిగడ్డ ఘటన దృష్ట్యా సీతారామ డిజైన్లను పునఃపరిశీలించాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆదేశించారు. ఈ మేరకు ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లను తెలంగాణ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి అందించింది. సీతమ్మసాగర్ బ్యారేజీ స్థిరత్వాన్ని భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్) ప్రమాణాల మేరకు విశ్లేషించగా, సరిగ్గానే ఉన్నట్టు సీడబ్ల్యూసీ తేల్చింది. టీఏసీ అభ్యంతరాలతో ఐఐటీ రూర్కీతో భూకంప అధ్యయనాలను పూర్తి చేసి అధికారులు సీడబ్ల్యూసీకి నివేదిక సమర్పించారు. బ్యారేజీ నుంచి దిగువకు దూకే వరద ఉధృతితో బ్యారేజీకి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేలా ప్రాజెక్టు డిజైన్లు రూపొందించారని, బ్యారేజీ ప్రధాన గేట్లు, స్లూయిస్ రేడియల్ గేట్లకి సంబంధించిన డ్రాయింగ్స్ కూడా సక్రమంగా ఉన్నట్టు సీడబ్ల్యూసీ నిర్ధారించింది. దీంతో 24వ తేదీన టీఏసీలో సీతారామకు సాంకేతిక అనుమతిపై విధాన నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

పూస శనగ 4037 రకానికి అశ్విని పేరు

» ఐసీఏఆర్ ప్రకటన.. కుటుంబ సభ్యుల హర్షం



ఖమ్మం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కారేపల్లి: రాష్ట్రానికి చెందిన దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినికి అరుదైన గౌరవం దక్కింది. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) కొత్తగా అభివృద్ధి చేసిన పూస శనగ 4037 రకానికి అశ్విని పేరునే పెట్టింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారంతండాకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత నూనవత్ అశ్విని తన తండ్రి మోతీలాల్‌తో కలిసి గత ఏడాది కారులో వెళ్తుండగా వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన సంగతి తెలిసిందే. అనతి కాలంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తగా గుర్తింపు తెచ్చుకున్న అశ్విని పేరు చిరస్థాయిలో గుర్తుండేలా గతంలో ఆమె పరిశోధన చేసిన పూస శనగ వంగడానికి ఆమె పేరునే పెడుతున్నట్లు ఐసీఏఆర్ ప్రకటించింది. అశ్విని పేరుతో విడుదల చేసిన పూస శనగ రకం హెక్టారుకు 26.73 క్వింటాళ్ల నుంచి 36.46 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. అశ్విని పేరుతో పూస శనగకు చెందిన వంగడం విడుదల చేయడం పట్ల ఆమె కుటుంబీకులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

12మంది స్పెషల్ గ్రేడ్ కమిషనర్లకు సెలక్షన్ గ్రేడ్

హైదరాబాద్, ఏప్రిల్, 16 (ఆంధ్రజ్యోతి): 12 మంది స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లకు సెలక్షన్ గ్రేడ్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. సెలక్షన్ గ్రేడ్ పొందిన వారిలో సి.అరుణకుమారి, టి.యాదయ్య, సీహెచ్.మధుకిరణ్, పి.మోహన్ రెడ్డి, ఎంకేఐ ఆలీ, కె.మల్లికార్జున రావు, జి.ఉమాప్రకాశ్, కె.నారాయణ రావు, బి.యాదయ్య, కె.రవికుమార్, కె.ఫల్గుణ్ కుమార్, డి.బాలయ్య ఉన్నారు.



ఒడిసాలోని నైనీలో తవ్విన బొగ్గుతో సింగరేణి సీఎండీ

నైనీ ప్రాజెక్టుతో సింగరేణి విశ్వవ్యాప్తం

» ఒడిసాలో సింగరేణి బొగ్గు ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించిన భట్టి

హైదరాబాద్/కొత్తగూడెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిన సింగరేణి సంస్థ ఒడిసాలోని నైనీ ప్రాజెక్టు ద్వారా విశ్వవ్యాప్త విస్తరణ వైపు వరుగుల తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒడిసా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని ఆయన వర్చువల్‌గా ప్రాంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గనిని ప్రారంభించడం సువర్ణ అధ్యాయమని తెలిపారు. నైనీ బ్లాక్ సింగరేణికి కేటాయించి తొమ్మిదేళ్లయినా అనుమతుల్లో జాప్యంతో ప్రారంభం ఆలస్యమైందన్నారు ఏడాది క్రితం రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులు తీసుకుని ఏడాదిలోనే నైనీ బ్లాక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి, కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్, ఒడిసా సీఎం మోహన్‌చరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు బంగారు బాట: సీఎం

సింగరేణి సంస్థ తన 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు చేపట్టడం అభినందనీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 13 దశాబ్దాలకు పైగా బొగ్గు ఉత్పత్తి చేస్తూ.. తెలంగాణ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి రాష్ట్రం బయట నైనీ బ్లాకులో బొగ్గు తవ్వకాలు చేపట్టి, భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేయనున్నట్లు తెలిపారు. తొలిసారి రాష్ట్రం అవతల బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం సింగరేణి సంస్థ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు.

మొదలుకానున్న కొలువుల జాతర!

(మొదటిపేజీ తరువాయి)



కూడా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక జాబితాలో ఉన్న ఖాళీల భర్తీకిగాను వివిధ శాఖల్లో కలిపి 18,236 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలను కూడా పరిగణలోకి తీసుకుని 2024-25 జాబ్ క్యాలెండర్‌ను రూపొందించింది. అయితే ఎస్సీలను వర్గీకరించేందుకు రాష్ట్రాలకు హక్కు ఉందంటూ గతేడాది ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో తెలంగాణలో వర్గీకరణ చేపట్టి, రిజర్వేషన్లు ఖరారు చేసే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో అప్పటి నుంచి రాష్ట్రంలో కొత్త నోటిఫికేషన్లు రాలేదు. ఇటీవల ఎస్సీ వర్గీకరణ పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల చివరి వారం నుంచి జూన్ 2 వరకు నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

శాఖల వారీగా తేలిన ప్రాథమిక జాబితా..

రాష్ట్రంలో శాఖల వారీగా ఉద్యోగ ఖాళీల లెక్కలను తేల్చాల్సిందిగా అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు పలు విభాగాలకు సంబంధించిన పోస్టుల ప్రాథమిక జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. దాని ప్రకారం పోలీసు శాఖలో 10,500 కానిస్టేబుళ్లు, 1,650 వరకు ఎస్ఐ పోస్టులను గుర్తించినట్లు సమాచారం. ఇక వైద్య ఆరోగ్య శాఖలో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, మరో 2,150 డాక్టర్ పోస్టులను గుర్తించారు. వీటిలో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి కూడా అనుమతులు వచ్చాయి. ఇవికాకుండా మరో 2వేల వరకు నర్స్ పోస్టులు సహా మరికొన్ని వివిధ స్థాయిల పోస్టులున్నాయని, మొత్తంగా వైద్యారోగ్య శాఖలో సుమారు 6వేల పోస్టుల వరకు భర్తీ చేసే అవకాశం ఉందని సమాచారం. ఆర్టీసీలో 3,038 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఇప్పటికే ఆ సంస్థ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, పలు శాఖల్లోని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి దాదాపు 2,510 పోస్టులు, వ్యవసాయ శాఖలో 148, ఆర్అండ్‌బీలో 185-200 వరకు పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. అటవీ శాఖలోనూ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు కొన్ని భర్తీ చేయాలని గుర్తించినట్టు తెలిసింది. ఇవే కాకుండా మహిళా శిశు సంక్షేమ శాఖలో 6,399 అంగన్‌వాడీ టీచర్లు, 7,837 హెల్పర్లు కలిపి 14,236 పోస్టులను భర్తీ చేయాలని ఇప్పటికే నిర్ణయించారు.

4వేల జీపీవో పోస్టులకు నోటిఫికేషన్..

గ్రామ పరిపాలన అధికారి (జీపీవో) పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 10,954 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసి ప్రస్తుతం ఇతర శాఖల్లో ఉన్నవారి నుంచి దాదాపు 6వేల మంది వీఆర్వోలను తిరిగి గ్రామ పరిపాలన అధికారులుగా నియమించన్నారు. మిగిలిన 4వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయనున్నారు. వాస్తవానికి అంగన్‌వాడీల్లో టీచర్, హెల్పర్‌ల పోస్టుల భర్తీ కోసం గతంలోనే ప్రభుత్వ ఆమోదం లభించినా.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ నేపథ్యంలో వీటి భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. తాజాగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రెవెన్యూ, అంగన్‌వాడీ టీచర్ల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉందని ఆయా శాఖల అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. ఆ జిల్లాను మినహాయించి మిగిలిన జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రాథమిక జాబితాలో ఉన్న పోస్టులు మాత్రమే కాకుండా స్కిల్ యూనివర్సిటీ, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ఇన్‌స్టిట్యూట్‌లు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ల(ఏటీసీ)లో అవసరమైన పలు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. వీటితోపాటు న్యాయశాఖ, సచివాలయం, ఆర్థికశాఖ సహా మరికొన్ని శాఖలన్నింటిలో కలిపి మరో 7-8 వేల పోస్టులు ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే తేల్చి అన్నింటినీ కలిపి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్టు అధికారిక వర్గాలు అంటున్నాయి.

వైద్యారోగ్య శాఖలోని పెండింగ్ ఫలితాల విడుదల..

ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ప్రకటించనున్న నేపథ్యంలో ఇప్పటివరకు పరీక్షలు నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న ఫలితాలను వెల్లడించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్యారోగ్య శాఖలోని ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, స్టాఫ్‌నర్సులు కలిపి 6 వేల పోస్టులకు గతేడాది పరీక్షలు నిర్వహించగా.. ఫలితాలు వెలువరించాల్సి ఉంది. ఈ ఫలితాలను ఏప్రిల్ 28 తరువాత విడుదల చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది.

హరిత ఇంధనంలో రూ.29 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగిన కార్యక్రమంలో హరిత ఇంధన రంగంలో రూ.29 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఎకోరెన్, జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఎకోరెన్ ఎనర్జీ సంస్థ రూ.27వేల కోట్లతో రాష్ట్రంలో 11 చోట్ల 5579 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్లు పెట్టడానికి వీలుగా ఒప్పందం చేసుకుంది. జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. భట్టి విక్రమార్క సమక్షంలో ఆయా సంస్థలు రాష్ట్ర విద్యుత్ సంస్థలతో ఎంవోయూ చేసుకున్నాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి, కొత్తగా వస్తున్న పరిశ్రమలు, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని కేంద్ర సంస్థలు నివేదికలు ఇచ్చాయని, దానికి తగ్గట్లుగా విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాలుష్యం లేని హరిత ఇంధన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకెళుతున్నామని చెప్పారు.

ఏపీ సచివాలయం నిర్మాణానికి టెండర్లు

(మొదటిపేజీ తరువాయి)

అడుగుల విస్తీర్ణం, మూడు, నాలుగు టవర్లను 23,42,956 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఉండే కీలకమైన జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్+47 ఫ్లోర్లు+హెలిప్యాడ్‌తో కలిపి మొత్తం 17,00,3000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ టెండర్ నోటిఫికేషన్ల జారీతో అమరావతిలోని గవర్నమెట్ కాంప్లెక్స్‌లో కీలక నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్టయింది. జీఏడీ టవర్ నిర్మాణానికి 1,126కోట్లు, సచివాలయం ఒకటి, రెండు టవర్ల నిర్మాణానికి 1,897కోట్లు, సచివాలయం మూడు, నాలుగు టవర్ల కోసం రూ.1,664 కోట్లతో వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మే 1వ తేదీన సచివాలయం, జీఏడీ టవర్ల టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరవనుంది.



రామ్మోహన్ నాయుడికి యంగ్ గ్లోబల్ లీడర్స్ అవార్డు

» జాబితాలో ఓయో రితేశ్, మరో ఐదుగురు

» ఖరారు చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక

» ప్రపంచవ్యాప్తంగా 116 మంది ఎంపిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రతిష్ఠాత్మక 'యంగ్ గ్లోబల్ లీడర్స్' అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలకు చెందిన 116 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేయగా.. వారిలో ఏడుగురు భారతీయులున్నారు. 40 ఏళ్లలోపు వయసుండి.. వేర్వేరు రంగాల్లో తమదైన ముద్ర వేసి, ప్రపంచ స్థితిగతుల అభివృద్ధికి కృషిచేసే యువకులకు డబ్ల్యూఈఎఫ్ ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. భారత్ నుంచి రామ్మోహన్‌నాయుడితోపాటు.. ఓయో వ్యవస్థాపక సీఈవో రితేశ్ అగర్వాల్, పర్వతారోహకుడు అనురాగ్ మాలూ, నిప్మాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిపుణ్ మల్హోత్రా, నెక్స్ట్ బిగ్ ఇన్నోవేషన్ ల్యాబ్ వ్యవస్థాపక ఎండీ అలోక్ మెడికెపుర అనిల్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఎండీ నటరాజన్ శంకర్, పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ఉపాధ్యక్షురాలు, ఎడిటర్-ఇన్-చీఫ్ మానసి సుబ్రమణియం ఈ అవార్డుకు ఎంపికైనట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది.

ఆర్టీసీలో తిరిగి విధుల్లోకి 136 మంది ఉద్యోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తప్పిదాల కారణంగా ఉద్యోగం కోల్పోయిన వారిలో 136 మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. టీజీఎస్ఆర్టీసీలో విధుల నిర్వహణలో చిన్న చిన్న తప్పిదాలకు గత ప్రభుత్వంలో సుమారు 500 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగం కోల్పోయిన వారు సర్కారుకు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. పలు దఫాల్లో అప్పీలు మేళా నిర్వహించిన అధికారులు విచారణ తర్వాత 136మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. మరో 41మంది అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

22న అన్ని సంఘాలతో జేఏసీ భేటీ

ఆర్టీసీలో సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మెను విజయవంతం చేసేందుకుగాను అన్ని సంఘాల మద్దతు కూడగట్టేందుకు ఈ నెల 22న భేటీ అవుతున్నట్టు జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలన్నీ భేదాభిప్రాయాల్ని పక్కనబెట్టి ఐక్యతను చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు.

జపాన్ చేరుకున్న సీఎం రేవంత్

ఘనస్వాగతం పలికిన ప్రవాస తెలంగాణ వాసులు.. ఇండియా హౌస్‌లో రేవంత్ బృందానికి విందు

» రాయబారి షిబు జార్జ్‌తో సీఎం భేటీ

» నేడు మెట్రోపై జైకాతో సమావేశం

» రెండో దశకు సాయం కోరనున్న సీఎం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం ఉదయం టోక్యో చేరుకుంది. వారికి విమానాశ్రయంలో అక్కడి ప్రవాస తెలంగాణవాసులు, తెలంగాణ పారిశ్రామికవేత్తలు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితోపాటు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సీఈవో మధుసూదన్‌తోపాటు పలువురు అధికారులు ఈ బృందంలో ఉన్నారు. వీరికి జపాన్‌లోని భారత రాయబారి షిబు జార్జ్ బుధవారం విందు ఇచ్చారు. వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన టోక్యోలోని ఇండియా హౌస్‌లో జరిగిన ఈ విందుకు కాంగ్రెస్ ఎంపీ రఘువీరారెడ్డితోపాటు తమిళనాడు నుంచి వెళ్లిన డీఎంకే ఎంపీలు కనిమొళి, నెపోలియన్ కూడా హాజరయ్యారు. విందు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమిళనాడు ఎంపీలతో పలు అంశాలపై మాట్లాడారు. రాయబారి షిబు జార్జ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడుల అనుకూలతలు, సులభతర వాణిజ్య విధానాలను వివరించారు. ఈ నెల 13 నుంచి అక్టోబరు 13 వరకు ఆరు నెలలపాటు జపాన్‌లోని ప్రముఖ నగరం ఒసాకాలో ఎక్స్‌పో-2025 జరుగుతుండగా.. 160కి పైగా దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. ఈ ఎక్స్‌పోలో తెలంగాణ తొలిసారిగా ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసింది. దీనిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాల గురించి ఈ పెవిలియన్‌లో విదేశీ ప్రతినిధులకు వివరించనున్నారు.



జపాన్‌లో భారత రాయబారి షిబూ జార్జ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ కనిమొళి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, నెపోలియన్

నేడు 'జైకా'తో మెట్రో మీటింగ్..!

సీఎం రేవంత్‌రెడ్డి బృందం గురువారం జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ (జైకా) ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానుంది. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ ప్రాజెక్ట్ నిర్మాణంలో అతి పెద్ద భాగస్వామ్యమైన ప్రపంచ బ్యాంకులు సాయం అందించాలని కోరనున్నారు. రెండో దశ ప్రాజెక్టులో పార్ట్ -ఏ కింద 76.4 కిలోమీటర్ల మేర ఐదు కారిడార్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా దీనిని చేపడుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు రూ.24,269 కోట్లను కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 30 శాతం నిధులు రూ.7,313 కోట్లు ఇస్తుండగా, కేంద్ర ప్రభుత్వం 18 శాతం వాటాగా రూ.4,230 కోట్లు భరిస్తుంది. మరో 48 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం పూచీకత్తుగా ఇచ్చే సావరీన్ గ్యారంటీతో జైకా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ), వంటి ఇంటర్నేషనల్ మల్టీ లేటరల్ సంస్థల నుంచి రూ.11,693 కోట్ల రుణాలను సేకరించనున్నారు. మిగతా 4శాతం పెట్టుబడి రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చుకుంటున్నారు. మొదటి దశ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఎల్అండ్‌టీ సంస్థకు రూ.3 వేల కోట్ల వరకు జైకా రుణ సాయం చేసినట్లు తెలిసింది. అయితే కేవలం 2 శాతం వడ్డీతో రుణ సాయం అందించే జైకా నుంచి ఎక్కువ మొత్తంలో రుణాలు సేకరించి ప్రాజెక్ట్‌ను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ టూర్‌లో జైకా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీ ఎలా?!

(మొదటిపేజీ తరువాయి)

యోచిస్తోంది. ఇందుకోసం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆలోచిస్తోంది. వర్గీకరణ అనంతరం అత్యంత వెనుకబడిన వర్గాలకే వర్గీకరణ ఫలాలు అందాలంటే కుల ధ్రువీకరణ పత్రం ఎంతో కీలకమైంది. ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా, అత్యంత వెనుకబడిన 15కులాల వారికి (3.288శాతం జనాభా) 1శాతం, గ్రూప్-2లో మాదిగలు, మాదిగ ఉపకులాలలుగా ఉన్న 18 కులాల (62.748శాతం) వారికి 9శాతం, గ్రూప్-3లో మాలలు, మాల ఉపకులాలుగా ఉన్న (33.963శాతం జనాభా) 26 కులాల వారికి 5శాతం చొప్పున రిజర్వేషన్‌ను కేటాయించిన విషయం తెలిసిందే. గ్రూప్-1లో 1,71,625 మంది, గ్రూప్-2లో 32,74,377 మంది, గ్రూప్-3లో 17,71,1682 మంది జనాభా ఉన్నారు. గ్రూప్-1లో ఉన్న 1.71 లక్షల మందిలో బుడగ జంగాల కులస్తులే 1.12 లక్షల మంది ఉండగా, బాపురి, చచాటి, డక్కలి, డొక్కాల్వార్, జగ్గలి, కొలుపులవాండ్లు, పంబాడ, పంబండి, పంబాల, మాంగ్, మాంగ్‌గరోడి, మన్నె, మష్తీ, మాతంగి, మెహతర్, ముండాల, సంబన్, సప్రు ఉపకులాలన్నీ కలిపి 59 వేల మంది ఉన్నారు. గ్రూప్-1లోని ఈ కులాల వారిని గుర్తించి, కుల ధ్రువీకరణ పత్రాలను ఎలా ఇస్తారనేదే పెద్ద సమస్య అని దళిత యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బిళ్లపాటి బాబురావు పేర్కొన్నారు. ఈ ఉపకులాలకు కేటాయించిన రిజర్వేషన్‌ను ఇతర గ్రూప్‌లకు చెందిన వర్గాలు కొల్లగొట్టే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కులగణనే పరిష్కారం చూపనుందా?

ఎస్సీ సామాజికవర్గంలో వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు కులగణన గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని సర్కారు భావిస్తోంది. ఉదాహరణకు ఒక జిల్లాలోని మండల పరిధిలో ఎస్సీ ఉపకులమైన డక్కలి సామాజికవర్గ జనాభా ఉంటే.. సంబంధిత మండల రెవెన్యూ అధికారికి ఆ సమాచారం అందుబాటులో ఉంటుంది. ఒక వేళ ఆ మండల పరిధిలో మస్తీ ఉపకులస్తులు ఒక్కరూ లేరనుకుంటే.. ఆ విషయమూ తహసీల్దార్‌కు తెలిసేలా ఏర్పాట్లు చేయనున్నారు. అంటే.. కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసే ముందే తన మండల పరిధిలో ఏయే ఉపకులాలున్నాయో తహసీల్దార్‌కు ముందే సమాచారం ఉంటుంది. దాంతో అర్హులైన వారికే సర్టిఫికెట్లు జారీ అవుతాయని సచివాలయ అధికారులు చెబుతున్నారు.

అఫిడవిట్లు తీసుకోవాలి

ఎస్సీ కులాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల జారీలో సర్కారు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వర్గీకరణ ఫలాలు వెనుకబడిన వర్గాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. నియామకాల సమయంలో కచ్చితంగా అఫడవిట్లు తీసుకోవాలి. తప్పుడు పత్రం ఇస్తే.. ఉద్యోగం నుంచి తీసేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

- మల్లేశం, ఓయూ ప్రొఫెసర్, హైదరాబాద్

పోలీసు విచారణకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

» రెండున్నర గంటల పాటు కొనసాగిన విచారణ

చేవెళ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరోసారి పోలీసు విచారణకు హాజరయ్యారు. బుధవారం చేవెళ్ల పోలీసు స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్ ఆయనను సుమారు రెండు గంటల పాటు విచారించారు. రాజేంద్రనగర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సామ దామోదర్‌రెడ్డి చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామ పరిధిలో తనకున్న 14 ఎకరాల 30 గుంటల భూమిని జీవన్‌రెడ్డి కబ్జా చేశారని గత ఏడాది మే 22న చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే జీవన్‌రెడ్డి వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని కూడా ఆయన పోలీసులకు తెలిపారు. ఈ కేసులో విచారణకు హాజరవ్వాలని ఈనెల 13న చేవెళ్ల పోలీసులు జీవన్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. దాంతో బుధవారం జీవన్‌రెడ్డి చేవెళ్ల పీఎస్‌కు వచ్చి, విచారణలో అడిగిన అన్నీ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. మళ్లీ ఎప్పుడు పిలిచినా విచారణకు రావాలని జీవన్‌రెడ్డి సీఐ సూచించారు. విచారణకు పూర్తిగా సహరిస్తానని జీవన్‌రెడ్డి చెప్పారని సీఐ వెల్లడించారు.

ములాఖత్‌గదిలో రీల్స్‌పై అధికారుల సీరియస్

» చంచల్‌గూడ జైలులో ములాఖత్‌లు కట్టుదిట్టం

సంతోష్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులోని ములాఖత్‌గదిలో రీల్స్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన ఘటనను అధికారులు తీవ్రంగా పరిగణించారు. చోరీ కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు పటిష్ఠ నిఘా ఉండే ములాఖత్ గదిలో శనివారం సిబ్బంది కళ్లు గప్పి స్నేహితుడి ఫోన్ తీసుకొని వీడియో రికార్డు చేశాడు. దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశించారు. ఈ క్రమంలో ములాఖత్‌లకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇకపై ములాఖత్ గదిలో ఖైదీల కుటుంబసభ్యులకు మాత్రమే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అంతే కాకుండా ములాఖత్ గదిలోకి మెటల్ డిటెక్టర్‌తో పరీక్షలు చేసి లోపలికి పంపించనున్నారు.

తెలంగాణ పోలీసులకు సీఎం అభినందనలు

» ఇండియా జస్టిస్ నివేదికపై హర్షం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ పనితీరుతో తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యావత్ పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇండియా జస్టిస్ నివేదిక-2025 ప్రకారం కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాల్లో పోలీసింగ్ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచిందని, టాటా ట్రస్ట్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్‌కాజ్ వంటి ప్రఖ్యాత సంస్థలు రూపొందించిన ఈ నివేదికలో తెలంగాణకు గొప్ప గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. రాజీలేని కర్తవ్య నిర్వహణతో పోలీసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచారని, ప్రజాపాలనలో ఈ విజయం పోలీసు శాఖ సమిష్టి కృషి ఫలితమని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఎస్టీ మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఓ ఎస్టీ మహిళను వేధించి యాసిడ్‌తో దాడి చేసి చంపేందుకు యత్నించిన నిందితుడికి తగిన శాస్తి జరిగింది. హత్యాయత్నానికి పదేళ్లు, యాసిడ్ దాడి చేసినందుకు మరో పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజారమణి తీర్పునిచ్చారు. ఎస్పీ శరత్‌చంద్ర వివరాల మేరకు.. నాంపల్లి మండలం దామెర గ్రామానికి చెందిన మహిళ (ఎరుకల-ఎస్టీ) భర్తతో మనస్పర్థల కారణంగా పుట్టింటి వద్దే ఉంటూ కూలీ పనులు చేసుకుంటోంది. అదే గ్రామానికి చెందిన బచ్చనబోయిన మహేశ్ యాదవ్ అలియాస్ పిట్టల మహేశ్ ఆమెను లైంగికంగా వేధించేవాడు. 2018 అక్టోబరు 13న బాధితురాలు నిద్రిస్తుండగా మహేశ్ ఆమె ఇంటికి వెళ్లి బలవంతంగా పక్కనే ఉన్న పత్తి చేలలోకి లాక్కెళ్లాడు. ఆమె ప్రతిఘటించటంతో వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను పోసి చంపేందుకు యత్నించాడు. బాధితురాలు తప్పించుకుని మరుసటి రోజు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో 2019లో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత నాంపల్లి ఎస్సై శోభన్‌బాబు సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం నిరూపణ అయింది. హత్యాయత్నం కేసులో 10 ఏళ్లు, రూ.1000 జరిమానా, యాసిడ్ దాడికి యత్నించినందుకు మరో 10 ఏళ్లు, వెయ్యి జరిమానా విధిస్తూ రెండూ ఏకకాలంలో అనుభవించాలని కోర్టు తీర్పునిచ్చింది.

టన్నెల్‌లో మృతదేహాల వెలికితీతకు సలహాల కోసం 12 మందితో కమిటీ

హైదరాబాద్, ఏప్రిల్, 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని మృతదేహాలను వెలికి తీసేందుకు సలహాలు ఇవ్వాలంటూ ప్రభుత్వం 12 మందితో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఫిబ్రవరిలో 14వ కి.మీ వద్ద టన్నెల్ పైకప్పు కూలడంతో 8 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. వారిలో ఇద్దరి మృతదేహాలను వెలికి తీయగా, ఇంకా ఆరుగురి మృతదేహాలు లోపలే ఉన్నాయి.ఈ నేపథ్యంలో మార్చి 24వ తేదీన నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి శిథిలాల కింద ఉన్న ఆరు మృతదేహాలను బయటకు తీయాలని ఆదేశించారు. సురక్షిత మార్గాల అన్వేషణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. దాంతో 12 మందితో కమిటీ ఏర్పాటు చేస్తూ విపత్తుల నిర్వహణ శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ ఎన్‌కౌంటర్

చర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోమారు తుపాకీ గర్జించింది. కొండగావ్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అడవుల్లో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47 తుపాకులను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు రెండు జిల్లాల సరిహద్దులోని బార్గమ్ అడవుల్లో కూంబింగ్ చేపట్టిన క్రమంలో నక్సల్స్ కాల్పులకు దిగినట్లు వివరించారు. మృతులను డీవీసీఎం సభ్యుడు హల్దార్ (రూ.8 లక్షల రివార్డు), ఏరియా కమిటీ సభ్యుడు రాము(రూ.5 లక్షల రివార్డు) ఉన్నట్లు వెల్లడించారు.

విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రసాదరావు కన్నుమూత



ప్రసాదరావు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.ప్రసాదరావు (84) బుధవారం హైదరాబాద్ మెహదీపట్నంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన భౌతిక కాయానికి పలువురు మాజీ విశ్రాంత ఐఏఎస్ అధికారులతో పాటు మాజీ సీఎస్ రాజీవ్‌శర్మ నివాళులర్పించారు. ప్రసాదరావుతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1964లో ఆయన మునిసిపల్‌శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. 1984లో ఐఏఎస్‌గా పదోన్నతి లభించింది. పట్టణ ప్రణాళిక, అభివృద్ధి విషయంలో ప్రసాదరావు మంచి నిపుణులని పేరుండేంది. 2001లో ఆయన పదవీ విరమణ చేసేనాటికి పురపాలకశాఖ డైరెక్టర్‌గా ఉన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా మునిసిపల్‌శాఖ, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ, జేఎన్‌యూఆర్ఎమ్‌లకు సేవలందించారు. ఆయన కుటుంబసభ్యులంతా కూడా విద్యాధికులే. యశోదా ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ మల్లెల వెంకటేశ్వరరావు (ఎంవీరావు) ప్రసాదర్‌రావుకు అల్లుడు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో ప్రసాదరావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కంచగచ్చిబౌలి భూములకు అటవీ లక్షణాలు!

నిబంధనలు తుంగలో తొక్కి చెట్లు కూల్చేశారు.. జంతుజాలం మనుగడను ప్రమాదంలో పడేశారు

» సుప్రీంకు కేంద్ర సాధికారిక కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 2374 ఎకరాల 2 గుంటల భూమికి ప్రాథమిక ఆధారాల ప్రకారం అటవీ ప్రాంత లక్షణాలున్నాయని.. ఈ అంశంపై సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికారిక కమిటీ (సీఈసీ) తన నివేదికలో తెలిపింది. అయితే, దీనిపై తమ ఆదేశాల మేరకు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న సమీక్ష పూర్తయిన తర్వాతే అంతిమ సిఫారసులను సమర్పించగలమని అందులో పేర్కొంది. ఈ భూములకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధికారులనుంచి ఇంకా అనేక పత్రాలు, సమాచారం రావాల్సి ఉందని.. చదును చేసిన భూమి, మిగతా భూమి అటవీ ప్రాంతం క్రిందకు వస్తుందా అన్నదానిపై తుది నివేదిక సమర్పించేందుకు నాలుగు వారాల సమయం అవసరమని పేర్కొంది. చారిత్రక పత్రాలు, ఒప్పందాల ప్రకారం చూస్తే ఈ అటవీ భూమి హైదరాబాద్ యూనివర్సిటీదేనని ప్రాథమికంగా స్పష్టమవుతోందని (ప్రైమాఫేసీ) తెలిపింది. ప్రభుత్వం పారదర్శకత, నిజాయితీ లేకుండా టీజీఐఐసీకి ఈ భూమిని బదిలీ చేసిందని కమిటీ అభిప్రాయపడింది. క్రీడల అకాడమీ కోసం గతంలో ఒక సంస్థకు కేటాయించిన ఈ భూమిని టీజీఐఐసీకి ధారాదత్తం చేయడం ఎంవోయూ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా పరిశీలించాలని తెలిపింది. ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని సరిగా పరిశీలించకుండా బీకన్ ట్రస్టీ షిప్ లిమిటెడ్ అనే సంస్థకు భూమిని తాకట్టుపెట్టడం, రూ.పది వేల కోట్ల మేరకు బాండ్లు జారీ చేయాలని నిర్ణయించడం, అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించడం ఆందోళనకరమని సీఈసీ స్పష్టం చేసింది. అక్కడ వంద రకాల చెట్లను కూల్చివేశారని, వేల సంవత్సరాల రాతి నిర్మాణాలను కుప్పకూల్చేశారని, అనేక జంతుజాలాల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చారని విమర్శించింది. అసలు డీపీఆర్ తయారు చేయకుండా, సరైన అనుమతులు లేకుండా ఆగమేఘాలపై టీజీఐఐసి భూమిని చదును చేయాలని ప్రయత్నించడం బాధ్యతాయుత పాలన క్రిందకు రాదని, సంస్థాగత స్వతంత్రత, పర్యావరణ జవాబుదారీకి విరుద్ధమని తీవ్రంగా విమర్శించింది. పర్యావరణ ఉల్లంఘనలు, యాజమాన్య అంశాలను పరిశీలించేందుకు ఒక స్వతంత్ర ఏజెన్సీ దర్యాప్తు అవసరమని, రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత యంత్రాంగం ఈ దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేందుకు సరిపోదని తేల్చింది. యూనివర్సిటీకి కేటాయించిన భూమి కూడా 'కంచ అస్తబల్ పోరంబోక్ సర్కారీ'గా రికార్డుల్లోకెక్కిందని చెప్పిన కమిటీ.. సుప్రీంకు సమర్పించిన నివేదికలో ఎనిమిది కీలక సిఫారసులు చేసింది. అవేంటంటే..

- సుప్రీం తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకూ ఈ భూమిపై ఎలాంటి చర్యలూ తీసుకోరాదు.
- అటవీ ప్రాంతంలా ఉన్న భూమిని గుర్తించేందుకు అటవీ అధికారులు, వన్యప్రాణి నిపుణులు, పర్యావరణ వేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలను కూడా చేర్చి నిపుణుల కమిటీని పునర్వ్యవస్థీకరించాలి.
- వన సంరక్షణ, సంవర్ధన చట్టం, 2023 ప్రకారం కచ్చితంగా, పర్యావరణపరంగా, సరైన వర్గీకరణ చేసేందుకు వీలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల గుర్తింపునకు వేర్వేరు ప్రమాణాలను అవలంబించేలా గౌరవ న్యాయస్థానం ఆదేశించాలి.
- టీజీఐఐసీ ఉద్దేశపూర్వకంగానే వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం 1981, జల కాలుష్య నివారణ చట్టం 1974 కింద అనుమతులకు దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006 కింద అనుమతి పొందకుండా తప్పించుకుంది. ఈ అంచనాను నిర్వహించడాన్ని, పర్యావరణ యాజమాన్య ప్రణాళికను రూపొందించడాన్ని తప్పించుకునేందుకే ఇదంతా చేసినట్లు కనపడుతోంది. అలా చేసినందుకు టీజీఐఐసీకి చెందిన సంబంధిత అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. టీజీఐఐసీకి అనుకూలంగా ఇచ్చిన అనుమతిని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెంటనే రద్దు చేయాలి.
- ఈ ప్రాంతంలోఉన్న గొప్ప జీవ వైవిధ్యం, వన్యప్రాణులు, పర్యావరణపరంగా ముఖ్యమైన చెరువులనుదృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న మొత్తం భూమిని పర్యావరణపరంగా సున్నితమైన జోన్‌గా రక్షించే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సమగ్ర పర్యావరణ అంచనాను నిర్వహించేంతవరకూ తదుపరి క్లియరింగ్, అభివృద్ధి కార్యకలాపాలను నిరోధించాలి.
- 13ఏ ఫారమ్‌లో తప్పుడు డిక్లరేషన్ ఇచ్చిన టీజీఐఐసీ అధికారులపైన.. పెద్ద ఎత్తున చెట్లను కూల్చివేసిన కాంట్రాక్టర్ డెల్టా గ్లోబల్ సర్వీసెస్ పైన గట్టి చర్యలు తీసుకోవాలి. వారు వాడిన యంత్రాలను స్వాధీనపరుచుకోవాలి.
- ప్రాథమికంగా ఈ భూమి హైదరాబాద్ యూనివర్సిటీ యాజమాన్యంలో ఉన్నట్లు కనపడుతోంది. అయితే ఈ భూమి యాజమాన్య స్థితిని తేల్చేందుకు చట్టపరమైన, పరిపాలనపరమైన సమగ్ర సమీక్ష జరగాల్సి ఉంది. వర్సిటీతో కుదుర్చుకున్న ఎంవోయూను దృష్టిలో పెట్టుకుని.. టీజీఐఐసి వాదనలు చెల్లుతాయా లేదా నిర్ధారించాలి.
- మరిన్ని ఆర్థికపరమైన, చట్టపరమైన సమస్యలు రాకుండా.. కోర్టు ఈ భూమి ఎవరిదో తేల్చేంతవరకూ.. టీజీఐఐసీ ఈ భూమిని తాకట్టు పెట్టకుండా, లీజుకు ఇవ్వకుండా, వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించకుండా నిలిపివేయాలి.

..వర్సిటీ ప్రాంగణం బయట తగిన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను ఏర్పరచి.. యూనివర్సిటీలోకి ప్రవహించే అన్ని సీవేజ్ అవుట్‌లెట్లనూ 12 నెలల్లోగా జీహెచ్ఎంసీ మూసివేయాలని కూడా కమిటీ సూచించింది. ఈ భూమికి సంబంధించి అనేక తీవ్రమైన ఉల్లంఘనలు, ఆర్థిక అవకతవకలు జరిగిన రీత్యా.. అనుమతుల చట్టబద్ధత, థర్డ్ పార్టీ హక్కుల కల్పన, టీజీఐఐసీ అధికారుల పాత్రపై ఒక ప్రత్యేక ఏజెన్సీ ద్వారా స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కూడా కమిటీ అభిప్రాయపడింది.

టీజీఐఐసీ నిర్లక్ష్యం..

టీజీఐఐసీ మొదటి దశలో 122 ఎకరాల భూమిని అభివృద్ధి చేసే ప్రయత్నం చేసిందని సీఈసీ తెలిపింది. అందులో భాగంగా భారీ యంత్రాలను ఉపయోగించి చెట్లను కూల్చివేశారని పేర్కొంది. తెలంగాణ జల, భూమి, వృక్షాల చట్టం, 2002 ప్రకారం.. ఒక వ్యక్తి తన భూమిలో మినహాయింపు పొందిన చెట్లను కూల్చి వేయాలంటే ఫారెస్ట్ డివిజనల్ అధికారికి 13 ఏ క్రింద అనుమతి కోరుతూ స్వీయ ధ్రువీకరణ ఇచ్చి, నిర్దిష్ట రుసుము కట్టి కూల్చివేసుకోవచ్చనని తెలిపింది. కానీ చిల్కూరు అటవీ రేంజ్ అధికారి ఆ ప్రాంతాన్ని తనిఖీ చేసినప్పుడు ఎలాంటి మినహాయింపు లేని 125 చెట్లను కూడా కూల్చివేసినట్లు తేలిందని.. దీనిపై కేసు కూడా నమోదు చేశారని, అక్కడున్న మూడు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారని వివరించింది. ఈ పత్రాల ప్రకారం 1524 చెట్లను కూల్చివేయగా, అందులో 1399 చెట్లకు మినహాయింపు ఉన్నదని తెలిపింది. అలాగే.. అసలు ఎన్ని ఎకరాలను క్లియర్ చేశారో కూడా స్పష్టత లేదని, అధికారిక సమావేశంలో 122 ఎకరాలను క్లియర్ చేస్తున్నామని చెప్పిన టీజీఐఐసీ.. డీఎఫ్‌వోకు సమర్పించిన 13ఏ ఫారమ్‌లో మాత్రం 150 ఎకరాలని పేర్కొందని, పోలీసు శాఖకు పంపిన లేఖలో 400 ఎకరాలని వివరించిందని సీఈసీ వెల్లడించింది. ఆ ప్రాంతంలోని పర్యావరణ ప్రాముఖ్యం, సుసంపన్నమైన జీవ వైవిధ్యం గురించి టీజీఐఐసీకి ఎలాంటి పట్టింపూ లేదని విమర్శించింది. ఇక్కడ అత్యంత అరుదైన, పర్యావరణ పరమైన రాతినిర్మాణాలున్నాయని.. పుట్టగొడుగు శిల వంటి ప్రత్యేక నిర్మాణాలు కూడా ఉన్నాయని.. అవి ఏర్పడేందుకు భౌగోళిక ప్రక్రియ ద్వారా వేలాది సంవత్సరాలు పడుతుందని తెలిపింది. ఈ ప్రాంతపు సహజమైన వారసత్వ సంపదలో ఇది ముఖ్యమైన భాగమని పేర్కొంది. అవి సరీసృపాలు, పక్షులు, కీటకాలు, చిన్న క్షీరదాల వంటి వివిధ జంతు జాతులకు నిలయమని సీఈసీ తన నివేదికలో వివరించింది. అయితే ఇటీవల చదును చేసే ప్రక్రియలో భాగంగా ఇలాంటి ఎన్నో రాతి నిర్మాణాలను భారీ యంత్రాలతో నిర్లక్ష్యంగా కుప్పకూల్చి విధ్వంసం చేశారని.. దీని వల్ల పూడ్చలేని నష్టం జరిగిందని తెలిపింది. అనేక జంతుజాతుల మనుగడ ప్రమాదంలో పడడం మాత్రమే కాక పర్యావరణ సమతౌల్యం దెబ్బతిన్నదని వెల్లడించింది. ఈ భూముల్లో జింకలు, నెమళ్లు, సరీసృపాలు ఉన్నాయని.. పీకాక్ లేక్, గున్నేరు లేక్, గుంట్లకుంట, చిలుకల కుంట అనే నాలుగు చెరువులు ఉన్నాయని తెలిపింది.

దుబాయిలో అసలేం జరిగింది..?

తెలంగాణ వాసుల హత్యకు కారణమేంటి?

ఖుబూస్ల తయారీ కేంద్రంలో గొడవేంటి?

జంట హత్యలపై కొనసాగుతున్న ఉత్కంఠ

అత్యంత గోప్యంగా స్థానిక పోలీసుల విచారణ

ఆచితూచి వ్యవహరిస్తున్న దుబాయి, భారత అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయిలో ఇద్దరు తెలంగాణ వాసులను దారుణంగా హతమార్చిన ఉదంతంపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. అక్కడ అసలు ఏం జరిగిందనే విషయం ఎవరికీ తెలియడం లేదు. ఈ దుర్ఘటన కంటే ముందు రెండు సార్లు పాకిస్థానీయులు, భారతీయుల మధ్య వాగ్వివాదం జరిగినట్లు తెలుస్తోంది. మూడోసారి జరిగిన వాగ్వాదం జంట హత్యలకు దారి తీసినట్లు సమాచారం. రంజాన్ ఇఫ్తార్ విందు సమయంలో హోలీ పండగ చేసుకుంటూ భారతీయులు కొందరు మతపరమైన నినాదాలు చేయగా పాకిస్థానీయులు ప్రతిఘటించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా.. కంపెనీ యాజమాన్యం ఇరు వర్గాలకు సర్దిచెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఖుబూస్ తయారీ కేంద్రంలో..

దుబాయిలో స్థానికులందరూ రొట్టెలే తింటారు. వీటిని అరబ్ భాషలో ఖుబూస్ అంటారు. రోజూ లక్షలాది ఖుబూస్లను తయారు చేసి, దుబాయి నగరమంతటికీ సరఫరా చేసే ఈ సంస్థలో పెద్ద సంఖ్యలో భారతీయులు పనిచేస్తుండగా.. కొద్ది సంఖ్యలోనే పాకిస్థానీయులు, ఇతర దేశస్థులు ఉన్నట్లు తెలుస్తోంది. నినాదాలు, ప్రతి నినాదాలతోనే హత్యలు జరిగినట్లు సమాచారం. అయితే నినాదాలను ఎవరు మొదలుపెట్టారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు విచారణలో భాగంగా అనేక మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వినియోగం సహా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సమాచారం. విచారణ దశలో ఉన్నందున కేసుకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. భారత అధికారులు సహా ఎవరికీ తెలియనివ్వడం లేదు. మృతుల వివరాలను కూడా భారత కాన్సులేట్ తెలుసుకోలేకపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రెండు దేశాల మధ్య ఉన్న బలమైన మైత్రి కారణంగా అధికారులూ ఈ అంశంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

అంతా మౌనమే..

వాట్సాప్ గ్రూపుల్లో క్రియాశీలకంగా వ్యవహరించే వారెవరూ ఈ దుర్ఘటనకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్నీ పంచుకోవడం లేదు. అందరూ మౌనంగానే ఉంటున్నారు. కంపెనీలో పని చేసే వారి కదలికలపై పోలీసులు కన్నేసి ఉంచారని చెబుతున్నారు. ఈ దుర్ఘటనలో మొత్తం ఏడుగురు గాయపడినట్లుగా తెలుస్తోంది. దుబాయి ప్రభుత్వం జాతి, మతం సహా ఎలాంటి వివక్షనూ సహించదు. ముస్లింలు, ముస్లిమేతరులు ఎవరైనా సరే విద్వేష, కవ్వింపు చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలు తీసుకుంటుంది.

కాంగ్రెస్ ధర్నాలు.. సిగ్గుమాలిన చర్య

» ధర్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

» కంచగచ్చిబౌలి ఫొటోలు నేనూ పోస్టు చేశా.. కేసు పెట్టుకోవచ్చు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో ఎన్నో సార్లు అవినీతి, అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్.. అదే తీరులో రూ.వేల కోట్ల నేషనల్ హెరాల్డ్ కుంభకోణానికి పాల్పడిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు స్థాపించుకున్న నేషనల్ హెరాల్డ్ పత్రికతో పాటు సంబంధిత ఆస్తులను.. దొడ్డిదారిన రాహుల్, సోనియాగాంధీకి చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి బదలాయించుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ చేపడితే.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ధర్నాలు చేపట్టడం సిగ్గుమాలిన చర్య అని ధ్వజమెత్తారు. చట్టం మీద విశ్వాసం ఉన్న వాళ్లు ధర్నాలు చేయరని, కాంగ్రెస్ నేతల ధర్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. నెహ్రూ కుటుంబానికి దేశాన్ని లూటీ చేయాలన్న ఉద్దేశమే తప్ప.. సేవ చేయాలనే సంకల్పం లేదని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసును కొట్టేయాలన్న సోనియా, రాహుల్ అభ్యర్థనను 2016లోనే సుప్రీం కోర్టు తోసిపుచ్చిందని గుర్తు చేశారు. కానీ.. మోదీ ప్రధాని అయ్యాకే ఈ కేసు బయటకు వచ్చినట్లు.. సోనియా, రాహుల్ శుద్ధపూసలు అయినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కంచ గచ్చిబౌలి భూముల అంశంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన తప్పులను ఇప్పటికైనా ఒప్పుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. అబద్ధాలు మానేసి.. ఆ భూముల్లో సుప్రీంకోర్టు చెప్పినట్లు మొక్కలను నాటే పని చేపడితే బాగుంటుందన్నారు. పోలీసు బందోబస్తు పెట్టి వంద ఎకరాల్లో చెట్లు నరకడం.. కాంగ్రెస్ దుర్మార్గానికి అద్దం పడుతోందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల్లో జింకలు చనిపోయిన మాట వాస్తవం కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఫొటోలు పోస్టు చేసిన స్మిత సభర్వాల్‌కు తెలంగాణ సర్కారు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మీకూ ఏమైనా నోటీసులొచ్చాయా? అని విలేకరులు అడగ్గా.. కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి తానూ ఎక్స్ వేదికగా ఫొటోలు పోస్టు చేశానని, తనపైనా ప్రభుత్వం కేసులు పెట్టుకోవచ్చని అన్నారు. అలాంటి కేసులకు తాను భయపడబోనని చెప్పారు.

రాజకీయ కక్షతోనే ఈడీ కేసు

ఈడీ, సీబీఐలు బీజేపీ జేబు సంస్థలుగా మారాయి.. బీజేపీ కేసులకు కాంగ్రెస్ భయపడదు

» ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు చేర్చడంపై నిరసన, ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

» నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ఈడీ కార్యాలయం ముందు భారీ ధర్నా



ఆదర్శనగర్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద నిరసన ర్యాలీలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తప్పుడు కేసు నమోదు చేసినట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. తమ పార్టీకి చెందిన పత్రికలో తాము పెట్టుబడులు పెడితే మనీలాండరింగ్ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అమలు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంతో కాంగ్రెస్, రాహుల్‌గాంధీకి వచ్చిన ప్రజాదరణ చూసి తట్టుకోలేకే ఈడీ చార్జిషీట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ పేర్లను మోదీ ప్రభుత్వం నమోదు చేయించి డైవర్షన్ పాలిట్రిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీల పేర్లను ఈడీ చార్జిషీట్‌లో నమోదు చేయడాన్ని నిరసిస్తూ రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి టెలికామ్ భవన్ వరకు నల్ల జెండాలతో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీకి వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మహేశ్ కుమార్‌గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈడీ, సీబీఐలు బీజేపీ జేబు సంస్థలుగా మారాయని ఆయన ఆరోపించారు. 2014 నుంచి ఆ సంస్థలు పెట్టిన కేసుల్లో 95 శాతం కాంగ్రెస్ నేతలపైనే ఉద్దేశపూర్వకంగా పెట్టారని విమర్శించారు. బీజేపీ ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం ఆగదని, కేంద్రంలో బీజేపీని గద్దెదించే వరకు రాహుల్ పోరాడుతూనే ఉంటారన్నారు. బీజేపీ కేసులకు కాంగ్రెస్ భయపడదని చెప్పారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే పార్టీ అగ్రనేతలపై ఈడీ కేసులు బనాయిస్తున్నట్లు ఆరోపించారు. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ కేసు ప్రజాస్వామ్యవిరుద్ధమన్నారు. కాగా, హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ నిరసనల్లో పాల్గొన్నారు. బీజేపీ వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పోరాడుతుంటే తమ పార్టీ అగ్రనేతలను ఈడీ కేసులు, చార్జిషీట్లతో ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు.

మీరెందుకు జోక్యం చేసుకున్నారు?

» ఎవరు మీకు ఫోన్‌నంబర్లు ఇచ్చేవారు!?

» మీకు.. బీఆర్ఎస్ నేతలకు సంబంధమేంటి!!

» 4 గంటల పాటు శ్రవణ్‌రావు విచారణ

» విచారణకు సహకరించని శ్రవణ్‌రావు!



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "ఫోన్‌ట్యాపింగ్ అనేది పూర్తిగా ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ స్థాయి వ్యవహారమైనప్పుడు మీరెందుకు జోక్యం చేసుకున్నారు? అసలు ఎస్ఐబీ అధికారులతో మీకు ఎంతకాలం నుంచి పరిచయం ఉంది? మీకు.. బీఆర్ఎస్ నేతలకు సంబంధమేంటి? ట్యాపింగ్ కోసం ఫోన్ నంబర్లను మీకు ఎవరు అందజేసేవారు?" అంటూ ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావుపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంతకు ముందు మూడుసార్లు విచారణకు హాజరైన శ్రవణ్‌రావు.. సిట్‌కు సహకరించకపోవడంతో.. పోలీసులు అతని నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్ల నుంచి డాటాను వెలికి తీశారు. దాంతో పాటు.. పలు సాంకేతిక ఆధారాలతో బుధవారం 4 గంటల పాటు విచారణ జరిపారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుతో పరిచయం గురించి ప్రశ్నించగా.. శ్రవణ్‌రావు మూగనోము పట్టినట్లు తెలిసింది. దాంతో.. రిట్రీవ్ చేసిన డాటాను ఆయన ముందుంచి, ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ఫోన్‌కాల్స్, ఇద్దరూ కలిసినప్పుడు సెల్‌టవర్ లొకేషన్ డాటా.. ఇలా సాంకేతిక ఆధారాలను ముందు పెట్టడంతో శ్రవణ్‌రావు పలు ప్రశ్నలకు ముభావంగా సమాధానమిచ్చి, కీలక ప్రశ్నల విషయంలో మౌనం వహించినట్లు తెలుస్తోంది. "అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతల్లో ఎవరు ఫోన్ నంబర్లను ఇచ్చేవారు? ట్యాపింగ్ ద్వారా మీరు సమాచారాన్ని చేరవేసి, ఎంతమేర ఆర్థిక లబ్ధి పొందేవారు? మీకు.. బీఆర్ఎస్ నాయకత్వానికి సంబంధమేంటి? ఈ కేసులో అరెస్టయిన మాజీ పోలీసు అధికారులతో ఎన్నిసార్లు కలిశారు?" అని అడిగిన ప్రశ్నలకు శ్రవణ్‌రావు సరైన సమాధానాలివ్వలేదని తెలిసింది. దీంతో.. సిట్ అధికారులు మరోసారి శ్రవణ్‌రావును విచారణకు పిలిచే అవకాశాలు కన్పిస్తున్నాయి. శ్రవణ్‌రావు విచారణకు పూర్తిస్థాయిలో సహకరించకపోవడాన్ని కారణంగా చూపెడుతూ.. సుప్రీంకోర్టు తదుపరి విచారణ సమయంలో పిటిషన్ దాఖలు చేసి.. ఆయనకు మధ్యంతర రక్షణను తొలగించాలని సిట్ అధికారులు కోరనున్నట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.